ప్రభాత
వెలుగు
04.02.2019
www.v6velugu.com
సోమవారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 349 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL



ఈ సంచికతోపాటు 12 పేజీల **లైఫ్** సప్లిమెంట్ అందుకోండి

మోడీ వర్సెస్ దీదీ

కోల్‌కతా సీపీ రాజీవ్ ఇంట్లో తనిఖీలకు వెళ్లిన సీబీఐ అధికారులు
వారిని అదుపులోకి తీసుకున్న బెంగాల్ పోలీసులు
కేంద్రానికి వ్యతిరేకంగా సీఎం మమతా బెనర్జీ ధర్నా
మోడీ.. ఏం చేసుకుంటావో చేసుకో అంటూ సవాల్
కోల్‌కతాలో అర్ధరాత్రి దాకా హైడ్రామా
బెంగాల్ సర్కార్ తీరుపై సుప్రీంకు సీబీఐ!



04



తరతరాలు యాది మరవొద్దు

యాదాద్రి అత్యద్భుతంగా మారుతోంది: కేసీఆర్

అత్యంత వైభవంగా ఆలయాన్ని ప్రారంభిస్తాం.. అది ఎప్పుడనేది నేనే చెప్తా

- పీఠాధిపతులు, రుత్విక్కులు, అర్చకులతో యాగం
- రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రులు వస్తరు
- మరో 15 రోజుల్లో చిన జీయర్‌తో వస్తా
- యాదాద్రి ఆలయ పనులను పరిశీలించిన సీఎం

“సమైక్య రాష్ట్రంలో యాదగిరిగుట్ట అభివృద్ధిని పట్టించుకోలేదు. మేము కొన్ని వేల సంవత్సరాల పాటు ఉండేలా ఆలయాన్ని నిర్మిస్తున్నాం. ఈ పనులు బాగా జరుగుతున్నాయి. జీవితంలో మరిచిపోలేని విధంగా అత్యంత వైభవంగా ప్రారంభోత్సవం నిర్వహిస్తాం. భక్తుల కోసం 1,100 ఎకరాల్లో టెంపుల్ సిటీ నిర్మిస్తున్నాం. భువనగిరి కోట, కొలనుపాక జైన దేవాలయం, బస్వాపురం ప్రాజెక్టులను కలుపుకొని యాదాద్రిని టూరిస్ట్ స్పాట్‌గా మారుస్తాం.

– ముఖ్యమంత్రి కేసీఆర్

యాదాద్రి/యాదగిరికొండ, వెలుగు: యాదగిరిగుట్ట నరసింహస్వామి ఆలయం ప్రపంచస్థాయి దివ్య క్షేత్రంగా రూపుదిద్దుకుంటోందని, జీవితంలో మరిచిపోలేని విధంగా అత్యంత వైభవంగా ప్రారంభోత్సవం నిర్వహిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. 133 దేశాల్లోని పీఠాధిపతులు, 6,500 మంది రుత్విక్కులు పారాయణాలు చదువుతుండగా, మరో మూడు వేల మంది అర్చకుల వేద మంత్రాల మధ్య సహస్ర కుండాత్మక యాగంతో ఆలయాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ఆ మహోన్నత ఘట్టానికి రాష్ట్రపతి, ప్రధాని, రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు వస్తారని తెలిపారు. ఈ ప్రారంభోత్సవం ఎప్పుడనేదీ తానే స్వయంగా ప్రకటిస్తానన్నారు. ఆదివారం యాదాద్రి ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆలయాలు ఒక తరానికి చెందిన సంస్కృతి, సంప్రదాయాలను మరో తరానికి తెలియజేస్తాయన్నారు. సమైక్య రాష్ట్రంలో యాదగిరిగుట్ట అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. తాము కొన్ని వేల సంవత్సరాల పాటు ఉండేలా ఆలయాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ పనులు బాగా జరుగుతున్నాయన్నారు. ప్రారంభోత్సవానికి ఐదు నుంచి 15 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు.

భక్తుల కోసం అద్భుతమైన ఏర్పాట్లు

అందరూ అనుకున్నట్లుగా ఆలయ నిర్మాణం రెండు, మూడు నెలల్లో పూర్తి కాదని.. ఒకవేళ అలా ఆగమాగంగా చేస్తామన్నా తాను ఒప్పుకోబోనని కేసీఆర్ చెప్పారు. వందల ఏళ్ల పాటు నిలిచే శాశ్వత నిర్మాణాలు కాబట్టి తొందరపాటు లేకుండా, నాణ్యంగా పనులు చేయాలన్నారు. ప్రతీ పని చినజీయర్ స్వామి సలహాతో జరుగుతోందని, మరో 15 రోజుల్లో చినజీయర్ స్వామితో కలిసి

మిగతా 2లో




జనరల్
నేటి నుంచి నాగోబా జాతర
గిరిజనుల ఆరాధ్య దైవమైన నాగోబా జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుంది.
03



దేశం - విదేశం
పట్టాలు తప్పిన ‘సీమాంచల్’
బిహార్‌లో సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పి ఆరుగురు మృతి, 29 మందికి గాయాలు.
05



జనరల్
అడవుల రక్షణకు యువదళాలు
స్మగ్లర్లు, వేటగాళ్లకు చెక్ పెట్టేలా ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర అటవీ శాఖ నిర్ణయం.
04



బిజినెస్
పాత లగ్జరీ కార్లకు ఫుల్ గిరాకీ
దేశంలో నెమ్మదించిన కొత్త లగ్జరీ కార్ల సేల్స్. ఊపందుకున్న సెకండ్ హ్యాండ్ కార్ల అమ్మకాలు.
10

ఆశలకు రెక్కలు

పేదింటి బిడ్డలకు అంబేద్కర్ విద్యానిధి వరం
విదేశాల్లో చదువులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్
ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ విద్యార్థులకు వర్తింపు
పథకం కింద ఒక్కొక్కరికీ రూ. 20 లక్షల సాయం
ఇప్పటివరకు 1,773 మందికి ప్రయోజనం
రాష్ట్ర సర్కారుకు రుణపడి ఉంటామంటున్న విద్యార్థులు

03

బండ్లు మస్తు అయితున్నయ్

రాష్ట్రంలో ఏటా పెరుగుతున్న వాహనాలు
రహదారులపై కోటీ 15 లక్షలకుపైగా వెహికల్స్
85.5 లక్షల వరకూ టూవీలర్లే.. గ్రేటర్‌లోనే ఎక్కువ
రోజుకు 3 వేల రిజిస్ట్రేషన్లు.. 2018లోనే 10.87 లక్షలు
విపరీతంగా పెరుగుతున్న వాతావరణ, శబ్ద కాలుష్యం

04

ఢిల్లీ కోటకు రాచబాట

ఉత్తరప్రదేశ్‌లో మెజారిటీ సీట్లొస్తేనే అధికారం

లోక్‌సభలో 15 శాతం ఆ ఒక్క రాష్ట్రంలోనే
కులాల బలమే పార్టీల ఆయువుపట్టు
2014లో బీజేపీని నిలబెట్టిన యూపీ
తాజాగా మహా కూటమితో మారిన సమీకరణాలు
ప్రియాంక ఎంట్రీతో పైఎత్తు వేసిన కాంగ్రెస్

02




ఒకప్పుడు జాతీయ పార్టీ కాంగ్రెస్ కు కంచుకోట. తర్వాత బీసీల పార్టీకి పట్టం గట్టిన ప్రత్యేకత. ఆపై దళితులకు పెద్దదిక్కు లాంటి పక్షానికి అధికారాన్నిచ్చిన విలక్షణత. మరో జాతీయ పార్టీ బీజేపీకి ఆదరణ ఉత్తరప్రదేశ్ సొంతం. ఇన్ని రకాల భిన్నమైన ఆలోచనలున్న పార్టీలను ఇంత పెద్ద రాష్ట్రంలో పూర్తి మెజారిటీతో అధికారంలో తెచ్చుకోవడం ఆశ్చర్యం కలిగించేదే. అంతేకాదు అత్యధిక లోక్‌సభ సీట్లున్న ఆ రాష్ట్రమే కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులోనూ కీలకం. అందుకే ఈసారి యూపీ ఎటువైపు చూస్తుందన్నది ఆసక్తి రేపుతోంది.

వచ్చే సాధారణ ఎన్నికల నేపథ్యంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఎన్నికల రాజకీయాలపై ‘వెలుగు’ వరుస కథనాలను అందిస్తోంది. ఈరోజు యూపీపై స్పెషల్ రిపోర్ట్.

మళ్లీ నేనే వస్తా

కాంగ్రెస్ రైతు రుణమాఫీ ఓ జిమ్మిక్కు

వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం: మోడీ



ఇవాళ ఎన్నో ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశాను. ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవాలు కూడా నేనే చేస్తాను. ఏసీ రూముల్లో కూర్చునే వారికి ఆరుగాలం కష్టపడే రైతుల కష్టాలు పట్టవు. కాంగ్రెస్ అమలు చేస్తున్న రైతు రుణమాఫీలు ఓ జిమ్మిక్కు. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసమే ఆ పార్టీ రైతు రుణాలను మాఫీ చేస్తోంది. కాంగ్రెస్ విధానాల వల్లే ఇప్పుడు రైతులకు కష్టాలు.

– లెహ్ బహిరంగ సభలో ప్రధాని మోడీ

05


దేశమంతా ‘మాఫీ’

అధికారంలోకి వస్తే చేసి తీరుతాం

రైతులను మోడీ అవమానించారు: రాహుల్

మేము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా ఉన్న రైతులందరి రుణాలనూ మాఫీ చేస్తాం. రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌రాష్ట్రాల్లో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వాలు కొద్ది రోజుల్లోనే రుణమాఫీ చేశాయి. దీన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తాం. ఏడాదికి రూ.6 వేలు ఇస్తామంటూ దేశంలోని రైతులను ప్రధాని మోడీ అవమానించారు. రైతులే ఆయనకు సరైన సమాధానం చెబుతారు.

– బిహార్ కాంగ్రెస్ ర్యాలీలో రాహుల్‌గాంధీ





11


హై జోష్ విక్టరీ

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌ను టీమిండియా ఫుల్ జోష్‌తో ముగించింది. ఆఖరి వన్డేలో ఆల్‌రౌండ్ షో చేసిన రోహిత్ సేన 35 రన్స్ తేడాతో గెలిచి సిరీస్‌ను 4–1తో సొంతం చేసుకుంది. హైదరాబాద్ స్టార్ రాయుడు, పాండ్యా బ్యాట్‌తో చెలరేగిపోతే చహల్, షమి బాల్‌తో అదరగొట్టారు. ఈ గెలుపుతో కివీస్ గడ్డపై అతిపెద్ద సిరీస్ విజయాన్నందుకుని టీమిండియా రికార్డులు తిరగరాసింది.

ఏఐ పిలుస్తున్నది

ఐటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణులకు డిమాండ్

క్లౌడ్ కంప్యూటింగ్, మెషీన్ లెర్నింగ్ కోర్సులు చేసిన వారికి కూడా
ఈ ఏడాది రెండు లక్షల మందికి ఉద్యోగావకాశాలు
మూడేళ్లలో 23 లక్షల మేర కొత్త కొలువులు
ఏఐను ప్రోత్సహిస్తామన్న కేంద్ర ప్రభుత్వం




హైదరాబాద్, వెలుగు: దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) భారీగా ఉద్యోగావకాశాలను సృష్టించనుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా పెరుగుతున్న టెక్నాలజీకి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కీలకంగా మారుతోంది. దీనితోపాటు క్లౌడ్ కంప్యూటింగ్, మెషీన్ లెర్నింగ్ నిపుణులకూ భారీగా డిమాండ్ పెరుగుతోంది. సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఈ మూడు రంగాల వారికి భారీ ప్యాకేజీలు ఇచ్చిమరీ ఉద్యోగాల్లో చేర్చుకుంటున్నాయి. ఈ ఏడాది భారత్‌లో 2 లక్షల మంది ఫ్రెషర్స్‌కు ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, మిషిన్ లెర్నింగ్ రంగాల్లో ఉద్యోగాలు లభిస్తాయని ఇటీవల గార్టనర్ సంస్థ తన నివేదికలో వెల్లడించింది. 2018 చివరికి దేశంలో ఐటీ, అనుబంధ రంగాల్లో ఉద్యోగుల సంఖ్య 45 లక్షలుగా ఉండగా.. 2021 చివరి నాటికి మరో 23 లక్షల మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తుందని పేర్కొంది.

మిగతా 3లో

వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్ 74.00	వరంగల్ 72.00	మహబూబ్‌నగర్ 74.00
కరీంనగర్ 74.00	నిజామాబాద్ 72.00	ఖమ్మం 76.00



ఆదివారం యాదాద్రిలో ఆలయ పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

తరతరాలు యాది మరవొద్దు

మొదటిపేజీ తరువాయి..
మళ్లీ వచ్చి పనులను పరిశీలిస్తానని తెలిపారు. భారీగా వచ్చే భక్తుల కోసం 1,100 ఎకరాల్లో టెంపుల్ సిటీ నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే 832 ఎకరాలు సేకరించామని, మిగతా భూమిని సేకరిస్తామని చెప్పారు. 354 కాటేజీల నిర్మాణానికి 250 ఎకరాల్లో లే అవుట్ చేశామని, ఈ కాటేజీలను దాతల సహకారంతో నిర్మిస్తున్నామని వెల్లడించారు. రూ.2 కోట్లు, రూ. కోటి, రూ. 50 లక్షలు, రూ. 25 లక్షల ఖర్చయ్యే కాటేజీలను నిర్మిస్తున్నామని.. రూ.2 కోట్లతో నిర్మించే కాటేజీల కోసం ఇప్పటికే 43 మంది దాతలు ముందుకొచ్చారని చెప్పారు. కాటేజీలు నిర్మించే దాతలకు తిరుమల తరహాలో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వారితో త్వరలోనే హైదరాబాద్‌లో సమావేశమై కాటేజీలను ఎలా నిర్మించాలన్న దానిపై చర్చిస్తామని వివరించారు.

టూరిస్టు స్పాట్ చేస్తం
భువనగిరి కోట, కొలనుపాక జైన దేవాలయం, బస్వాపురం ప్రాజెక్టులను కలుపుకొని టూరిస్ట్ స్పాట్‌గా మారుస్తామని కేసీఆర్ చెప్పారు. బస్వాపూర్ రిజర్వాయర్ వద్ద 250 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్లు, ఫైవ్ స్టార్ హోటళ్లు నిర్మిస్తామన్నారు. యాదగిరిగుట్ట పట్టణం చుట్టూ ఆరులేన్ల రింగ్ రోడ్ నిర్మిస్తామని తెలిపారు. అభివృద్ధి పనుల కోసం 173 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందని, ఇందుకోసం ఇప్పటికే రూ.70 కోట్లను మంజూరు చేశామని వెల్లడించారు. ఇక్కడ 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గండి చెరువును అభివృద్ధి చేసి, కాళేశ్వరం నీటితో నింపుతామన్నారు. మిగతా 143 ఎకరాల్లో బస్టాండ్, పార్కింగ్ ప్రదేశాలు, నిత్యాన్నదాన సత్రాలు, మార్కెట్లు నిర్మిస్తామన్నారు. వీవీఐపీల కోసం ప్రత్యేకంగా ఎనిమిది ప్రెసిడెన్షియల్ సూట్స్ నిర్మిస్తున్నామని, అవి సెప్టెంబర్ వరకల్లా పూర్తవుతాయని చెప్పారు.

గుట్ట చుట్టూ ఏరియల్ సర్వే
సీఎం కేసీఆర్ ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో యాదాద్రికి బయలుదేరారు. అక్కడికి చేరుకున్నాక ప్రధాన ఆలయమున్న యాదగిరిగుట్టతోపాటు పక్కన చిన్న గుట్టలపై జరుగుతున్న టెంపుల్ సిటీ, ప్రెసిడెన్షియల్ సూట్ల పనులను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. 11.40 గంటల సమయంలో యాదగిరిగుట్ట సమీపంలోని వడాయిగూడెంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో గుట్టపైకి చేరుకున్నారు. అక్కడ ఆలయ అర్చకులు కేసీఆర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తర్వాత కేసీఆర్ బాలాలయంలో శ్రీలక్ష్మీ నర్సింహస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నర్సింహాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు.

శిల్పులను ప్రశంసించిన సీఎం

నర్సింహస్వామిని దర్శించుకున్న లకేసీఆర్ తర్వాత ఆలయ పునర్నిర్మాణ పనులను రెండు గంటలకుపైగా పరిశీలించారు. స్వయంభూ ఆలయం, మండపం, గర్భగుడి, బాహ్య ప్రాకారాలు, అంతర ప్రాకారాలు, మాడ వీధులు, రథశాల, వ్రత మండపం, ధ్వజ స్తంభం, ప్రసాదశాల, శివాలయం ప్రాంతాల్లో తిరిగి.. అధికారులు, శిల్పులకు పలు సూచనలు చేశారు. శిల్పులను ప్రశంసించారు. ప్రధానాలయంలో మెట్లదారి వద్ద స్వల్ప మార్పులు చేయాలని.. ఈశాన్య భాగంలోని వ్రత మండపం, రథశాల పెద్ద పెద్ద నిర్మాణాలుగా ఉండడంతో, తగ్గించాలని సూచించారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో హరిత హోటల్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకున్నారు. తిరిగి నాలుగు గంటల సమయంలో టెంపుల్ సిటీ పనులను పరిశీలించారు. అర్చకులు, అధికారులతో సమావేశమయ్యారు. రెండు గుట్టలను కలుపుతూ రోడ్డు నిర్మిస్తామని, త్వరలో నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. టెంపుల్ సిటీ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా అన్నదాన సత్రం నిర్మాణం కోసం రాజు వేగేశ్న ఫౌండేషన్ అధ్యక్షుడు అనంతకోటి రాజు, కార్యదర్శి ఆనంద రాజు రూ.10 కోట్ల విరాళం చెక్కును సీఎం కేసీఆర్‌కు అందజేశారు. నిర్మాణ వ్యయం ఇంకా ఎక్కువైనా భరిస్తామని చెప్పారు. సీఎం వారికి కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడి, హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరారు.

ఏపీ హైకోర్టు తాత్కాలిక భవనం ప్రారంభం



విజయవాడ, వెలుగు: ఏపీ రాజధాని అమరావతిలో హైకోర్టు తాత్కాలిక భవనాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ ఆదివారం ప్రారంభించారు. సీఎం చంద్రబాబుతోపాటు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు హైకోర్టు శాశ్వత భవనానికి జస్టిస్ రంజన్ గొగొయ్, సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. హైకోర్టు భవన నిర్మాణ విశేషాలతో కూడిన గ్యాలరీని సీజేఐ పరిశీలించారు 'హైకోర్టు భవనం ఏపీ ప్రజల సంస్కృతి, ఆనందానికి ప్రతీకగా నిలుస్తుంది. రాజ్యాంగబద్ధమైన విధిని సీఎం చంద్రబాబు సక్రమంగా, సకాలంలో నిర్వర్తించారు. న్యాయవ్యవస్థలో రాజ్యాంగ విలువలకే తప్ప, వ్యక్తిగత అభిప్రాయాలకు తావుండకూడదు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాల్సి ఉంది. న్యాయమూర్తుల ఖాళీలు భర్తీ చేస్తే సమస్యలు తగ్గుతాయి. కిందిస్థాయి, జిల్లా స్థాయి కోర్టుల్లోనూ 5వేల ఖాళీలు ఉన్నాయి' అని జస్టిస్ రంజన్ గొగొయ్ అన్నారు. అమరావతిలో నిర్మించే తొమ్మిది నగరాల్లో న్యాయనగరం కూడా ఒకటని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. 450 ఎకరాల్లో బౌద్ధ స్థూపాకృతిలో న్యాయనగరం నిర్మిస్తున్నామన్నారు. రూ.819 కోట్లతో హైకోర్టు శాశ్వత భవనం, సిబ్బందికి అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు.

'పద్మశ్రీ' అవార్డు వాపస్

సిటిజన్‌షిప్ బిల్లుకు వ్యతిరేకంగా దర్శకుడు అరిబమ్ శ్యాం శర్మ నిర్ణయం

ఇంఫాల్: ప్రముఖ మణిపురి దర్శకుడు అరిబమ్ శ్యామ్‌శర్మ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పద్మశ్రీ అవార్డును వెనక్కి ఇస్తున్నట్లు ప్రకటించారు. సిటిజన్‌షిప్‌బిల్లుకు నిరసనగా తాను ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. ఇంఫాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన నిర్ణయాన్ని చెప్పారు. 82 ఏళ్ల అరిబమ్‌కు 2006లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ఇచ్చింది. పొరుగు దేశాల నుంచి వచ్చే ముస్లిమేతరులకు పౌరసత్వాన్ని కల్పిస్తూ ప్రభుత్వం సిటిజన్‌షిప్‌బిల్లును తీసుకొచ్చింది. అయితే దానికి వ్యతిరేకంగా గత కొద్ది రోజులుగా ఈశాన్య రాష్ట్రాల్లో ఆందోళనలు జరుగుతన్నాయి. ఈ నేపథ్యంలోనే 1980ల్లో జరిగిన అస్సాం ఆందోళనలో పాల్గొని ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అవార్డులను కొందరు వెనక్కి ఇచ్చేశారు. దాదాపు 125 కుటుంబాలకు చెందిన వారు గౌహతిలో భారీ ర్యాలీ నిర్వహించి తమ నిర్ణయాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే.

ఢిల్లీ కోటకు రాచబాట

ఉత్తరప్రదేశ్‌లో మెజారిటీ సీట్లొస్తేనే అధికారం

వెలుగు బ్యూరో:
ఢిల్లీకి దగ్గరి దారిగా ఉత్తరప్రదేశ్ ను చెబుతుంటారు. దేశంలోనే ఎక్కువగా యూపీలో 80 లోక్‌సభ సీట్లున్నాయి. అందుకే ఇక్కడ గెలిచినవారు ఢిల్లీ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించడం పక్కా. 1996లో దేశవ్యాప్తంగా 161 ఎంపీ సీట్లు సాధించిన బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. అందులో యూపీలో గెలిచిన సీట్లే 51 ఉన్నాయి. అప్పుడే కేంద్రంలో తొలిసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైంది. వాజ్ పేయి ప్రధానమంత్రి అయ్యారు. 13 రోజుల తర్వాత విశ్వాస పరీక్షలో ఆ ప్రభుత్వం పతనమైంది. తర్వాత 1998లో లోక్‌సభ మధ్యంతర ఎన్నికల్లో 182 సీట్లతో బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చింది. అప్పుడు కూడా యూపీలో 58 సీట్లు రావడం వల్లే బలం పెరిగింది. 1999 ఎన్నికల్లో బీజేపీకి 182 స్థానాలతో వాజ్‌పేయి మూడోసారి ప్రధాని అయ్యారు. ఈసారి యూపీలో బీజేపీ గెలిచింది 29 సీట్లే. కానీ ఎస్పీ, బీఎస్పీ, కాంగ్రెస్ లతో పోలిస్తే ఎక్కువ సీట్లే వచ్చాయి. 2004 ఎన్నికల్లో బీజేపీ అధికారాన్ని కోల్పోయింది. ఆ ఎన్నికల్లో యూపీలో బీజేపీ పది స్థానాలకు పడిపోయింది. కాంగ్రెస్ 9 సీట్లు సాధించింది. ఎస్పీ, బీఎస్పీ బయటి నుంచి కాంగ్రెస్‌కు మద్దతివ్వడంతో కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ఏర్పాటైంది. 2009 ఎన్నికల్లోనూ యూపీలో బీజేపీ 10 సీట్లకే పరిమితమై అధికారాన్ని అందుకోలేకపోయింది. కాంగ్రెస్ మాత్రం బలాన్ని 21 సీట్లకు పెంచుకుంది. దాంతో జాతీయ స్థాయిలో 206 సీట్లు సాధించి అధికారంలో కొనసాగింది. అప్పట్లో బీజేపీ నుంచి బయటికొచ్చిన సీనియర్ నేత కల్యాణ్‌సింగ్ ఎస్పీతో చేతులు కలిపారు. బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో సీఎంగా ఉన్న ఆయనపై ముస్లింలు ఆగ్రహంతో ఉండడం వల్ల ఎస్పీ వారి ఓట్లను కోల్పోయింది. ఇది కాంగ్రెస్ సీట్లు పెరగడానికి కారణమైంది. బీఎస్పీకి 23 సీట్లు, ఎస్పీకి 22 సీట్లు దక్కాయి.


2014లో మోడీ ప్రభంజనం
యూపీని గెలిస్తేనే అధికారం దక్కుతుందని బీజేపీకి బాగా అర్థమైంది. దీంతో 2013లో బీజేపీ ప్రధాని అభ్యర్థిగా ఎంపిక కాగానే నరేంద్ర మోడీ యూపీపైనే దృష్టిపెట్టారు. అప్పట్లో గుజరాత్ ఎమ్మెల్యేగా ఉన్న అమిత్ షాను యూపీ వ్యవహారాల ఇన్‌చార్జిగా పెట్టించారు. అక్కడ సంస్థాగతంగా పార్టీని పటిష్టం చేసిన అమిత్ షా.. ప్రధానంగా హిందూ ఓట్లను ఆకర్షించడానికి అన్ని ప్రయత్నాలు చేశారు. అప్పట్లో చోటుచేసుకున్న ముజఫర్ నగర్ అల్లర్లను రాజకీయంగా ఉపయోగించుకున్నారు. గుజరాత్‌తో పాటు యూపీలోని వారణాసిలో మోడీని పోటీచేయించడం ద్వారా స్థానికులను ఆకర్షించారు. హిందువులు పవిత్రంగా భావించే పుణ్యక్షేత్రంలో పోటీచేయడం ద్వారా సెంటిమెంట్ ను ప్రయోగించారు. ఇవన్నీ భారీ విజయాన్ని తెచ్చిపెట్టాయి. 2014 ఎన్నికల్లో బీజేపీ 71 సీట్లు సాధించింది. మిత్రపక్షమైన అప్నాదళ్ కు మరో రెండు సీట్లు రావడంతో మొత్తం 73 సీట్లు వచ్చినట్లైంది. దీంతో బీజేపీ జాతీయ స్థాయిలో పూర్తి మెజారిటీతో ఢిల్లీ పీఠాన్ని చేజిక్కించుకుంది. సమాజ్‌వాదీ 5 సీట్లకు పడిపోతే కాంగ్రెస్‌కు సోనియా, రాహుల్ సీట్లైన రాయ్ బరేలీ, అమేథీ మాత్రమే దక్కాయి. మాయావతి నేతృత్వంలోని బీఎస్పీ అసలు ఖాతా తెరవలేదు. జాట్ ఓట్లపై ఆధారపడిన అజిత్ సింగ్ పార్టీ ఆర్ఎల్డీకి కూడా ఒక్క సీటు రాలేదు.

అసెంబ్లీ ఎన్నికల్లో మరో సంచలనం
లోక్ సభ ఎన్నికలు గెలిచిన ఊపులోనే 2017లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ కమలం వికసించింది. జనం ఏకపక్షంగా బీజేపీకి అధికారాన్ని కట్టబెట్టారు. ఎవరి ఊహకూ అందకుండా బీజేపీ మిత్రపక్షాలతో కలిసి 325 సీట్లను సాధించింది. సమాజ్ వాదీ 54 సీట్లతో సరిపెట్టుకోగా బీఎస్పీ 19 సీట్లకు పడిపోయింది. గోరఖ్ పూర్ మఠానికి చెందిన యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి అయ్యారు.



పట్టువదలని కమలనాథులు

బీజేపీ గెలిచిన మొత్తం సీట్లలో నాలుగో వంతు బలాన్నిచ్చిన యూపీని వదులుకోవడానికి ఆ పార్టీ అగ్రనేతలు కూడా సిద్ధంగా లేరు. రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇక్కడ కాంగ్రెస్ కంటే అసలు ప్రత్యర్థులు ఎస్పీ, బీఎస్పీలు కావడంతో వాటి మూలాలను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ పార్టీలకు పట్టున్న ప్రాంతాల్లో బీజేపీని పటిష్టం చేసే చర్యలు మొదలుపెట్టారు. టీట్వంటీ ఫార్ములాతో ప్రతి ఇంటికీ పార్టీ చేరేలా యాక్షన్ ప్లాన్ రెడీ చేశారు. ఇందులో భాగంగా ఒక్కో కార్యకర్తకు 20 మంది ఓటర్లను సమన్వయం చేసే బాధ్యత అప్పగించారు. వారి ద్వారా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు చెబుతూనే, సమస్యలను గుర్తిస్తారు. ఈ వివరాల ఆధారంగా మేనిఫెస్టో రూపొందించే ఆలోచనలో ఉన్నారు. అలాగే ఈసారి సగం మంది అభ్యర్థులను మార్చి కొత్త వాళ్లకు టికెట్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అగ్రకులాలకు కోటా ఇవ్వడం, రైతులకు పంటసాయం లాంటివి కూడా యూపీలో కలిసొస్తాయని బీజేపీ నమ్ముతోంది. మోడీ ఇమేజ్ తో కూటమిని చిత్తు చేయచ్చని ధీమాగా ఉన్న కమలనాథులు ఎన్నికలను మోడీకి, ఇతర పార్టీలు అన్నిటికీ మధ్య జరుగుతున్న యుద్ధంగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నారు. మోడీకి వ్యతిరేకంగా అవినీతిపరులంతా ఒకటయ్యారని ప్రచారం చేస్తోంది. వివాదం లేని అయోధ్య భూమిని తిరిగిస్తామని కోర్టుకు చెప్పడం, రామమందిరం ఆర్డినెన్స్ చేయాలన్న డిమాండ్లు తేవడం లాంటి ప్రయత్నాలతో మతపరంగా సున్నితమైన అంశాలను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోంది.



ఉప ఎన్నికల్లో ఉప సంహారం

యూపీలో బీజేపీని ఎదుర్కోవాలంటే కలిసి పోరాడక తప్పదని ఎస్పీ, బీఎస్పీ నిర్ణయించుకున్నాయి. సీఎం యోగి, డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య రాజీనామా చేయడం వల్ల ఖాళీ అయిన గోరఖ్‌పూర్, ఫూల్ పూర్ ఎంపీ సీట్ల ఉపఎన్నిక విపక్షాల మహాకూటమి పోరుకు వేదికగా మారింది. ఆ ఎన్నికలు బీజేపీకి తొలిషాక్ ఇచ్చాయి. యోగి ఐదుసార్లు ఎంపీగా గెలిచిన గోరఖ్ పూర్ సీటును ఆయన సీఎం అయ్యాక పోగొట్టుకోవాల్సి వచ్చింది. ఇక్కడ ఎస్పీ అభ్యర్థి ప్రవీణ్ కుమార్ నిషాద్ 21 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఫూల్ పూర్ స్థానంలోనూ ఎస్పీ అభ్యర్థి నాగేంద్రప్రతాప్ 59 వేల ఓట్లకు పైగా మెజారిటీతో విజయం సాధించారు. కొన్ని నెలల తర్వాత జరిగిన కైరానా ఎంపీ సీటు ఉప ఎన్నికలోనూ ఎస్పీ, బీఎస్పీల కూటమి సత్తా చూపించింది. ఆ ఎన్నికలో ఆర్ఎల్డీ అభ్యర్థి తబస్సుమ్ హసన్ కు మద్దతిచ్చింది. ఆమె 44 వేల ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి మృగాంకా సింగ్ పై గెలిచారు. దీంతో విపక్ష కూటమి విజయాల హ్యాట్రిక్ కొట్టింది. ఈ ఫలితాలతో మహాకూటమి వల్ల భవిష్యత్ లో బీజేపీకి ఇబ్బందులు తప్పవన్న అంచనాలు మొదలయ్యాయి.

'సంకుల' సమరంలో బలాబలాలు



ఓట్ల శాతాలు, సర్వేల ఆధారంగా ఎస్పీ, బీఎస్పీ కూటమి బలంగా కనిపిస్తున్నా ఆగర్భ శత్రువులైన పార్టీల కార్యకర్తలు కలిసి పనిచేయడంపై కొన్ని అనుమానాలు కూడా ఉన్నాయి. రెండు దశాబ్దాలుగా యూపీలో ఈ రెండు పార్టీల మధ్య హోరాహోరీ నడుస్తోంది. ఉపఎన్నికల్లో ఎలా ఉన్నా అసలు ఫైట్ లో ఒకరికొకరు సహకరించుకోవడంపైనే గెలుపు ఆధారపడింది. మరోవైపు ఎస్పీకి కీలక ఓటు బ్యాంకు అయిన యాదవులకు, బీఎస్పీకి అండగా నిలిచే దళితులకు మధ్య రాష్ట్రంలో చాలాచోట్ల విభేదాలు ఉన్నాయి. ఈ రెండు వర్గాల మధ్య నేతలు ఎలా సమన్వయం చేయబోతున్నారన్నది కీలకం కాబోతోంది. అటు బీజేపీ అగ్రకులాల ఓట్లతో పాటు యాదవులను మినహాయించి ఇతర ఓబీసీ కులాలను నమ్ముకుంది. ఎస్పీకి యాదవులతో పాటు ముస్లింలు కూడా మొదటి నుంచి అండగా ఉంటున్నారు. బీఎస్పీ పూర్తిగా దళిత ఓటు బ్యాంకుపై ఆధారపడింది. ఎస్పీ, బీఎస్పీలకు అండగా ఉన్న వర్గాలన్నీ కలిపి జనాభా పరంగా 48 శాతం ఉండడం ఆసక్తి రేపుతోంది. మరోవైపు అగ్రకులాలకు కోటా ఇచ్చారన్న కారణంతో ఓబీసీ కులాల్లో బీజేపీపై వ్యతిరేకత వస్తే కూటమికి కలిసొస్తుందని నమ్ముతున్నారు. అటు కాంగ్రెస్ ఒంటరిగా పోటీచేయడం వల్ల ఆ పార్టీ అగ్రకులాల ఓట్లకు ఏ కొంచెం చీల్చినా ఆ మేరకు బీజేపీ నష్టపోతుందని అంచనా వేస్తున్నారు. ఇటీవలి ఉప ఎన్నికల్లో ఇదే జరిగిందని కూటమి నేతలు గుర్తుచేస్తున్నారు.



2014 లోక్‌సభ ఎన్నికల్లో పరిస్థితి

పార్టీ/కూటమి	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ, అప్నాదళ్	73	43.63
ఎస్పీ	5	22.35
బీఎస్పీ	0	19.77

2017 అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల శాతం

బీజేపీ, మిత్రపక్షాలు	41.7
ఎస్పీ	22
బీఎస్పీ	22.5
కాంగ్రెస్	6.5

పార్టీలు,-కులబలాలు

బీజేపీ: అగ్రకులాలు, యాదవేతర బీసీలు
ఎస్పీ: యాదవులు, ముస్లింలు
బీఎస్పీ: దళితులు

కులాలు-జనాభా శాతం

దళితులు	21
అగ్రకులాలు	20
ముస్లింలు	17
యాదవులు	10
యాదవేతర ఓబీసీలు	32

కమలానికి 'మహా' సవాల్

ఉప ఎన్నికల్లో వరుస విజయాలు ఇచ్చిన ఉత్సాహంతో లోక్‌సభ ఎన్నికల్లోనూ కలిసి పోటీచేయాలని మాయావతి, అఖిలేశ్ నిర్ణయానికి వచ్చారు. మొత్తం 80 సీట్లకు చెరో 38 సీట్లలో పోటీ చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ను పొత్తులో కలుపుకోలేదు. అయితే ఆ పార్టీ అగ్రనేతలైన సోనియా, రాహుల్‌గాంధీలపై గౌరవంతో వారి సీట్లు రాయ్ బరేలీ, అమేథీలలో పోటీచేయడం లేదని ప్రకటించాయి. యూపీలో కాంగ్రెస్‌కు పెద్దగా బలం లేదు కాబట్టి ఆ పార్టీని దూరం పెట్టినట్లు చెబుతున్నారు. ఆ రెండు సీట్లను అజిత్ సింగ్ నేతృత్వంలోని ఆర్ఎల్డీకి వదిలే అవకాశం ఉంది. మాయావతి, అఖిలేశ్ ప్రకటన తర్వాత చేసిన సర్వేలన్నీ యూపీలో మహా కూటమి భారీగా సీట్లు గెలుచుకుంటుందని చెబుతున్నాయి. ఇండియా టుడే సర్వేలో కూటమికి 58 సీట్లు వస్తాయని అంచనా వేశారు. బీజేపీ గత ఎన్నికలతో పోలిస్తే ఏకంగా 55 సీట్లు కోల్పోయి 18 సీట్లతో సరిపెట్టుకుంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కు 2 సీట్లే వస్తాయన్నారు. కూటమిలో కాంగ్రెస్ ను కూడా కలుపుకుంటే బీజేపీకి 5 సీట్లే వస్తాయని కూడా విశ్లేషించారు. ఏబీపీ న్యూస్ సర్వే కూటమి 51 స్థానాలు గెలుస్తుందని అంచనా వేసింది. బీజేపీకి 25 స్థానాలు, కాంగ్రెస్‌కు 4 సీట్లు దక్కుతాయని చెప్పింది.

ఈసారి భిన్నం

మొత్తమ్మీద దేశానికి ప్రధాని ఎవరు అవ్వాలో నిర్ణయించే ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో నాలుగు పక్షాల పోరు కాస్తా ఈసారి రెండు బలమైన పక్షాల ఫేస్ టు ఫేస్‌గా మారింది. కులాల కోటలో ఎత్తులు పైఎత్తులు నడుస్తున్నాయి. గత ఎన్నికల ఫలితాలను ఈసారి కూడా రిపీట్ చేయాలని భారతీయ జనతా పార్టీ , రాష్ట్రంతో పాటు కేంద్రంలో చేజారిన పట్టును నిలబెట్టుకోవాలని సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీలు, కనీసం గౌరవం కాపాడుకోవాలని కాంగ్రెస్ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

కాంగ్రెస్ అస్త్రం ప్రియాంక

ఎస్పీ, బీఎస్పీలు పొత్తులో కాంగ్రెస్ ను పక్కనబెట్టడంతో ఆ పార్టీ పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిగా మారింది. తనతో సంబంధం లేకుండానే వారు సీట్లు పంచుకొని, రెండు సీట్లే వదలడం హస్తానికి అవమానంగా మిగిలింది. అటు బీజేపీకి, ఇటు ఎస్పీ, బీఎస్పీలకు తమవైన బలమైన ఓటు బ్యాంకులు ఉంటే కాంగ్రెస్‌కు అలాంటిది ఏమీలేదు. నెహ్రూ, ఇందిరా, రాజీవ్ నుంచి ఇప్పుడు సోనియా, రాహుల్ వరకు అధినేతలందరూ ప్రాతినిధ్యం వహించిన రాష్ట్రంలో పార్టీ పరిస్థితి దారుణంగా మారింది. దీంతో ఎన్నికల ముందు పార్టీ అధ్యక్షుడు రాహుల్ కీలక నిర్ణయం తీసుకున్నారు. చెల్లెలు ప్రియాంకాగాంధీని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ యూపీ తూర్పు బాధ్యతలు అప్పగించారు. తాము యూపీని తేలికగా తీసుకోవడం లేదని ఈ నిర్ణయంతో బీజేపీకి, మహాకూటమికి సంకేతాలు పంపినట్లు భావిస్తున్నారు. ప్రియాంకను తేవడం ద్వారా యువతను, మహిళలను ఆకర్షించడం, ఇందిరాగాంధీని గుర్తుచేసే పోలికలతో పాతతరం అభిమానులను ఆకట్టుకోవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ ఎత్తుతో ఎస్పీ, బీఎస్పీలు కూడా దోస్తీకి ముందుకొస్తాయన్న వ్యూహం కూడా ఉందని చెబుతున్నారు. మరోవైపు ఈ నిర్ణయం కాంగ్రెస్ కు కూడా పెద్ద సవాలే. కేడర్ లో జోష్ రావడం వరకు బాగున్నా కాంగ్రెస్ ఉనికే చాలావరకు దెబ్బతిన్న తూర్పు యూపీలో ప్రియాంక వల్ల ఎంత బలం పెరుగుతుందన్నది అంచనా వేయడం కష్టం. గత ఎన్నికల్లో ఈ ప్రాంతంలో కాంగ్రెస్ 7 శాతం ఓట్లే సాధించింది. ఎస్పీ, బీఎస్పీలకు సీట్లు తగ్గినా 22 శాతం, 19 శాతం ఓట్లు వచ్చాయి. రాయ్ బరేలీ, అమేథీలలో తప్ప కాంగ్రెస్ ఎక్కడా ఉనికిలో లేదు. రాహుల్ ఎంపీగా ఉన్న అమేథీ పరిధిలో కాంగ్రెస్ కి ఒక్క ఎమ్మెల్యే లేరు. రాయ్ బరేలీలో మాత్రం ఇద్దరు ఎమ్మెల్యేలున్నారు. తూర్పు యూపీలో 25 ఎంపీ సీట్లు ఉంటే, సెంట్రల్ యూపీ కూడా కలిపితే 35 సీట్లు ఉన్నాయి. వారణాసి, గోరఖ్ పూర్ కూడా ఇందులోనే ఉన్నాయి. అసలు పోటీనే ఇవ్వలేని పరిస్థితిలో ఉన్న కాంగ్రెస్ ను ఇంత తక్కువ టైంలో పటిష్టం చేయడం ప్రియాంకకు కఠిన పరీక్షే.



సోమవారం | హైదరాబాద్
04.02.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu

రాష్ట్రంలో చలి తగ్గుతున్నది

హై దరాబాద్, వెలుగు: రాష్ట్రంలో రానున్న మూడ్రోజుల పాటు పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆదివారం తెలిపింది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో చలి తీవ్రత తగ్గుతోంది. ఉదయం, రాత్రి వేళల్లో పొగమంచు కురుస్తోంది. ఆదిలాబాద్‌లో కనిష్ఠంగా 11.7 డిగ్రీలు, మెదక్‌లో 13.3, హకీంపేటలో 15.6 డిగ్రీల టెంపరేచర్లు నమోదయ్యాయి. మహబూబ్ నగర్‌లో అత్యధికంగా 31.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.



నేటి నుంచి నాగోబా జాతర

గిరిజనుల ఆరాధ్య దైవమైన నాగోబా జాతర ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో సోమవారం నుంచి ప్రారంభం కానుంది. వారం రోజులపాటు వేడుకలు జరుగుతాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశాల నుంచి వేలాదిమంది ఆదివాసీలు తరలివస్తున్నారు. - వెలుగు, ఉట్నూర్

ఇంటి దొంగలేనని అనుమానం

తిరుపతిలో బంగారు కిరీటాల చోరీపై దర్యాప్తు వేగవంతం

తిరుమల, వెలుగు: తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో 3 బంగారు కిరీటాల చోరీ ఘటనలో అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు సమాచారం. తిరుపతి రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఈ ఆలయంలోని ఉత్సవమూర్తుల కిరీటాలు శనివారం సాయంత్రం మాయమయ్యాయి. దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు ఆదివారం ఉదయం ఉపాలయంలో తనిఖీలు చేశారు. సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గుర్తించారు. విధుల్లో ఉన్న అధికారులు, అర్చకులు, సిబ్బందిని విచారించారు. ప్రత్యేక బృందాలతో అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మరోసారి డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు చేశారు. ఈ కేసులో ఇప్పటికే కొన్ని కీలక ఆధారాలను సేకరించినట్టు తెలుస్తోంది. ఇది ఇంటి దొంగల పనేనని పోలీసులు అనుమానిస్తున్నారు. కిరీటాల చోరీ జగిందని తెలిసిన వెంటనే సెక్యూరిటీ సిబ్బంది ఆలయంలోని చెత్త డబ్బాలను తనిఖీ చేయగా బీరు బాటిళ్లు బయటపడ్డాయి.

త్వరలో రికవరీ చేస్తాం: టీటీడీ ఈవో

తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయాన్ని టీటీడీ ఈవో, అధికారులు ఆదివారం పరిశీలించారు. 3 స్వర్ణ కిరీటాల బరువు 1,351 గ్రాములుగా నిర్ధారించారు. శ్రీనివాసుడి స్వర్ణకిరీటం 528 గ్రాములు, లక్ష్మీదేవి స్వర్ణ కిరీటం 408 గ్రాములు, భూదేవి బంగారు కిరీటం 415 గ్రాములు ఉన్నట్లు చెప్పారు. బంగారు కిరీటాలను త్వరలో రికవరీ చేస్తామని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అన్నారు. వీలైనంత త్వరగా నిందితులను పట్టుకుంటామని చెప్పారు.

కుక్కలను చంపే ఇంజెక్షన్ ఇచ్చి..

హైదరాబాద్, వెలుగు: చిగురుపాటి జయరాం హత్య కేసులో సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. తెలంగాణ పోలీసుల సహకారంతో ఏపీ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి జయరాం మేన కోడలు శిఖా చౌదరి, ఆమె స్నేహితుడు రాకేశ్ రెడ్డిలను కృష్ణ జిల్లా నందిగామ పోలీసులు ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఆదివారం మహాప్రస్థానంలో జయరాం అంత్యక్రియలు పూర్తయ్యాక ఆయన భార్య పద్మశ్రీ వాంగ్మూలాన్నీ పోలీసులు తీసుకున్నారు. వ్యాపార లావాదేవీలు, ఎవరైనా శత్రువులున్నారా అనే కోణంలో ప్రశ్నించారు. అయితే అమెరికాలో ఉంటున్న తనకు ఇక్కడ జరిగిన విషయాలేవీ తెలియవని పద్మశ్రీ చెప్పినట్టు సమాచారం. నిందితులను కఠినంగా శిక్షించాలని ఆమె పోలీసులను కోరారు. రాకేశ్ రెడ్డి ఎవరో పద్మశ్రీకి తెలియదని, అదే విషయం ఆమె పోలీసులకు చెప్పారని జయరాం లీగల్ అడ్వైజర్ వివేక్ రెడ్డి తెలిపారు. పద్మశ్రీ కుటుంబానికి భద్రత కల్పించాలని పోలీసులను కోరారు.



- హైదరాబాద్‌లోనే జయరాంను హత్య చేసినట్టు అనుమానం
- తెలంగాణ–ఏపీ పోలీసుల జాయింట్ దర్యాప్తు


10 నిమిషాల్లోనే..

కుక్కల ను చంపేందుకు వాడే ఇంజెక్షన్‌తోనే జయరాంను హత్య చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంజెక్షన్ ప్రభావంతో 10 నిమిషాల్లోనే శరీరం విషపూరితమైనట్టు సమాచారం. ఆర్థిక లావాదేవీల్లో విభేదాలే హత్యకు కారణమై ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. జయరాంను హైదరాబాద్‌లోనే హత్య చేసి నందిగామకు కారులో తరలించినట్టు తెలుస్తోంది. కేసును కృష్ణా జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పర్యవేక్షిస్తున్నారు. రాకేశ్‌రెడ్డిని ఆయనే విచారిస్తున్నారు. శిఖా చౌదరి సహా ఇద్దరిని వత్సవాయి పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్టు తెలుస్తోంది. హత్య హైదరాబాద్‌లోనే జరిగితే కేసును తెలంగాణ పోలీసులకు బదిలీ చేసే అవకాశం ఉంది.

25న సీఐటీయూ చలో హైదరాబాద్

పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం..

హైదరాబాద్, వెలుగు: పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ ఈనెల 25న చలో హైదరాబాద్ ఆందోళనకు సీఐటీయూ పిలుపునిచ్చింది. కార్మికులు ఈ నెల 11, 12 తేదీల్లో సర్పంచులకు వినతిపత్రాలు ఇవ్వాలని, 18న అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు చేయాలని నిర్ణయించింది. ఆదివారం గ్రామపంచాయతీ ఉద్యోగులు, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ వివరాలను ప్రధాన కార్యదర్శి శ్రీపతిరావు వెల్లడించారు. వేతనాలు పెంచాలంటూ కార్మికులు గతేడాది 33 రోజులు సమ్మె చేస్తే రూ.8,500కు పెంచుతామని సర్కారు హామీ ఇచ్చిందన్నారు. కానీ ఇప్పటికీ హామీ నెరవేర్చలేదన్నారు. దాన్ని అమలు చేయాలని, సమ్మె కాల వేతనం, బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అర్హులకు పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించాలని, ప్రస్తుతం పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని కోరారు.



ఏఐ పిలుస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) భారీగా ఉద్యోగావకాశాలను సృష్టించనుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా పెరుగుతున్న టెక్నాలజీకి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కీలకంగా మారుతోంది. దీనితోపాటు క్లౌడ్ కంప్యూటింగ్, మెషీన్ లెర్నింగ్ నిపుణులకూ భారీగా డిమాండ్ పెరుగుతోంది. సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఈ మూడు రంగాల వారికి భారీ ప్యాకేజీలు ఇచ్చిమరీ ఉద్యోగాల్లో చేర్చుకుంటున్నాయి. ఈ ఏడాది భారత్‌లో 2 లక్షల మంది ఫ్రెషర్స్‌కు ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, మెషీన్ లెర్నింగ్ రంగాల్లో ఉద్యోగాలు లభిస్తాయని ఇటీవల గార్టనర్ సంస్థ తన నివేదికలో వెల్లడించింది. 2018 చివరికి దేశంలో ఐటీ, అనుబంధ రంగాల్లో ఉద్యోగుల సంఖ్య 45 లక్షలుగా ఉండగా.. 2021 చివరి నాటికి మరో 23 లక్షల మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తుందని పేర్కొంది.

ఏఐకే ఎక్కువ డిమాండ్

అడిగిన దానికి సమాధానం చెప్పే రోబోలు, కంప్యూటర్ అప్లికేషన్లు, మనుషుల తీరును, మూడ్‌ను బట్టి వాటంతటవే రంగులు మార్చుకునే డ్రెస్సులు.. మెయిల్స్, మెసేజ్‌లలో ముఖ్యమైన వాటిని గుర్తించి నోటిఫికేషన్లుగా చూపే యాప్స్.. ఇలా ప్రతి విషయంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ పాత్ర ఉంది. మనం ఎలా ఆలోచిస్తామో దాదాపుగా అదే తరహాలో ఆలోచించగల స్థాయికి ఇది అభివృద్ధి చెందుతోంది. మన ఆసక్తిని పసిగట్టి అడగకముందే మనకు కావాల్సింది చేసే పెట్టే స్థాయికి ఎదుగుతోంది. ఇప్పుడు భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే అనే చెప్పొచ్చు. గతేడాది హైదరాబాద్‌లో జరిగిన వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో పాల్గొన్న హ్యూమనాయిడ్ రోబో సోఫియాను ఏఐ టెక్నాలజీతోనే రూపొందించారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న స్మార్ట్ ఫోన్లలో ఏఐ టెక్నాలజీ ఇప్పుడిప్పుడే అందుబాటులోకి వస్తోంది. గూగుల్ అసిస్టెంట్ , యాపిల్ సిరి, అమెజాన్ అలెక్సా వంటి వర్చువల్ అసిస్టెంట్లతోపాటు చాలా రకాల యాప్స్ ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీతో రూపొందించినవే కావడం గమనార్హం.

ప్రత్యేకంగా కోర్సులు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఉన్న డిమాండ్‌ను గుర్తించిన ఐఐటీ హైదరాబాద్ వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీటెక్‌లో ఏఐ కోర్సును ప్రవేశపెడుతోంది. ఐఐటీ ఖరగ్‌పూర్ ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో 6 నెలల సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తోంది. మైక్రోసాఫ్ట్, ఐబీఎం, ఇన్ఫోసిస్ వంటి కంపెనీలు సైతం పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేసి ఏఐపై శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. డేటా సైన్సెస్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఇంటెలిజెంట్ క్లౌడ్ హబ్ వంటి అంశాల్లో వచ్చే మూడేళ్లలో 5 లక్షల మందికి శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్టు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కన్ సంస్థ హైదరాబాద్‌లో ఏఐ పరిశోధన కేంద్రాన్ని నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఇటీవల ఒప్పందం చేసుకుంది.

కేంద్రం నుంచీ ప్రోత్సాహం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, దానికి సంబంధించిన టెక్నాలజీల ఫలాలను సామాన్యులకు అందించడమే లక్ష్యంగా.. జాతీయ కార్యక్రమాన్ని చేపడతామని ఇటీవలి బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటిని 'సెంటర్ ఆఫ్ ఏఐ హబ్'లుగా మారుస్తామన్నారు. త్వరలోనే ఏఐ వెబ్ పోర్టల్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. ఐదేళ్లలో లక్ష గ్రామాలను డిజిటల్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. దీంతో దేశంలో ఏఐ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం దేశ జీడీపీలో 8 శాతంగా ఉన్న టెక్నాలజీ ప్రభావం.. నాలుగైదేళ్లలో 60 శాతానికి పెరుగుతుందని మైక్రోసాఫ్ట్ ఇండియా హెడ్ అనంత్ మహేశ్వరి అంచనా వేశారు. అంటే రాబోయే ఐదేళ్లలో టెక్నాలజీ ఏ స్థాయిలో విస్తరిస్తుందో, ఎంత మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయో దీంతో అర్థం చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

గ్రౌండ్ వర్క్ చేయాలె

టెక్నాలజీ ప్రతి రోజూ మారుతుంటుంది. మారుతున్న టెక్నాలజీని ఆకళింపు చేసుకుంటూ అప్డేట్‌గా ఉండే వారికి ఐటీ రంగంలో అవకాశాలకు కొరతలేదు. ఏదో ఒక కోర్సు నేర్చుకుంటే ఉద్యోగాలు రావు. గ్రౌండ్ వర్క్ చేయాలి. రియల్ టైమ్ ఎక్స్‌పీరియన్స్ ఉన్నవారితో క్లాసులు చెప్పించుకోవడంతో పాటు శాంపిల్ ప్రాజెక్టు తీసుకుని సొంతంగా ఎగ్జిక్యూట్ చేయాలి. ఎగ్జిక్యూషన్‌లో వచ్చే సమస్యలను పరిష్కరించగలిగి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉంటే హెచ్‌ఆర్‌ను ఎదుర్కోవడం సులువవుతుంది. ప్రస్తుతం ఏఐ, సీసీ, ఏఎల్ నైపుణ్యాలున్న ఫ్రెషర్స్‌కు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. భవిష్యత్ ఐటీ వాటి చుట్టే తిరుగుతుంది.

– **నరేష్ యాదవ్, ఐటీ నిపుణుడు**

ఈ నైపుణ్యాలు ఉండాలె

జావా, పైథాన్, అమెజాన్ వర్క్ స్పేస్ (ఏడబ్ల్యూఎస్), సాప్ హనా, యూఐ డెవలప్‌మెంట్, డెవాప్స్, బిగ్ డేటా అనాలసిస్, డిజిటల్ మార్కెటింగ్ తదితర కోర్సుల్లో సర్టిఫికెట్లు ఉండి.. లాజికల్ థింకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, కోడింగ్, ప్రోగ్రామింగ్ నైపుణ్యాలున్న ఫ్రెషర్స్‌కు ప్రస్తుతం ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఐటీ కోర్సుల అంగడి అమీర్‌పేట్‌లోని పలు ఇనిస్టిట్యూట్లు 45 నుంచి 70 రోజుల వ్యవధితో రూ.10 నుంచి 15 వేల ఫీజుతో ఏఐ కోర్సులను అందిస్తున్నాయి. ఇప్పటికే అక్కడి ఇనిస్టిట్యూట్లన్నీ వేల మంది విద్యార్థులతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఏటా వేలాది మంది విద్యార్థులు బీటెక్ పూర్తి చేస్తున్నారు. అందులో చాలా మంది ఐటీవారే ఉంటుండటం గమనార్హం. అలాంటివారితోపాటు ఇప్పటికే ఐటీ ఉద్యోగాలు చేస్తున్నవారు సైతం కొత్త టెక్నాలజీ నేర్చుకునేందుకు ఇనిస్టిట్యూట్స్‌లో చేరుతున్నారు.

ఆశలకు రెక్కలు

- పేదింటి బిడ్డలకు అంబేద్కర్ విద్యానిధి వరం
- విదేశాల్లో చదువులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్
- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ విద్యార్థులకు వర్తింపు
- పథకం కింద ఒక్కొక్కరికీ రూ. 20 లక్షల సాయం

'నాలాంటి పేదింటి బిడ్డ విదేశాలకు వెళ్లి చదువుకోవడం ఓ కల. నా కలను నిజం చేసింది అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ ఫెడరేషన్ యూనివర్సిటీలో ఎంటర్‌ప్రైజెస్ సిస్టంలో మాస్టర్స్ చేశా. స్పెక్ట్ సేవర్స్‌లో ఉద్యోగం వచ్చింది. అమెరికాతో పోల్చితే ఆస్ట్రేలియాలో చదువుకు ఖర్చు ఎక్కువ. ప్రభుత్వ చొరవతోనే నా కల నెరవేరింది. తెలంగాణ బిడ్డగా గర్వపడుతున్న..'

ఇది పులి వందన ఆనందం.

'నా సక్సెస్‌కు అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్పే కారణం. మాది పేద కుటుంబం. అయినా ఇబ్బంది లేకుండా అమెరికాలోని డల్లాస్ బాప్టిస్ట్ వర్సిటీలో మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ చేశా. నాలాంటి ఎంతో మంది గోల్స్ రీచ్ కావడానికి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దోహద పడుతున్నది. ప్రభుత్వం నాకు అందించిన తోడ్పాటును జీవితాంతం గుర్తుంచుకుంటా. నాలాంటి స్టూడెంట్స్‌కు సాయపడుతా. ఇప్పుడు డెల్‌లో వర్క్ చేస్తున్న. చాలా హ్యాపీగా ఉన్న..'

కొల్లబత్తుల సింధూజ సంబురమిది



హైదరాబాద్, వెలుగు:

ఈ ఇద్దరే కాదు.. ఎందరో పేదింటి బిడ్డలకు అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం బాసటగా నిలుస్తోంది. వారి ఆశలకు రెక్కలు తొడుగుతోంది. విదేశాల్లో చదు వుకోవాలనే యువతీయువకుల ఆకాంక్షకు ఈ పథకం ఊతమిస్తోంది. ఇప్పటివరకు వందలాది మంది ఈ స్కీం కింద లబ్ధిపొంది వివిధ సంస్థల్లో లక్షల రూపాయలు వచ్చే కొలువుల్లో సెటిలయ్యారు. తొలుత ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకే ప్రారంభించినా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మైనారిటీలు, బీసీలకూ వర్తించేలా ప్రభుత్వం మార్పులు చేసింది. ఇప్పటివరకు 405 మంది ఎస్సీ విద్యార్థులు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, ఇటలీ, సింగపూర్, యూకే, యూఎస్‌ఏలోని వివిధ యూనివర్సిటీల్లో మాస్టర్స్, డాక్టోరల్ కోర్సుల్లో చేరారు. ఇందులో 2013-14 విద్యా సంవత్సరం నుంచి 201-516 విద్యా సంవత్సరం వరకు చదివిన 257 మంది తమ కోర్సులు పూర్తి చేశారు. వంద మంది వరకు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధించారు.

కల ఇలా సాకారం

విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించి.. ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో స్థిరపడాలన్నది విద్యార్థుల కల. పేదరికం కారణంగా ఎందరో అందుకు దూరమయ్యే పరిస్థితి గతంలో ఉండేది. కానీ.. 2013-14 విద్యా సంవత్సరంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధిని ప్రారంభించారు. మొదట ఒక్కో విద్యార్థికి రూ.10 లక్షల స్కాలర్‌షిప్ ఇచ్చేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక కేసీఆర్ ప్రభుత్వం ఈ సాయాన్ని రూ. 20 లక్షలు చేసింది. అంతేకాదు.. ఈ పథకాన్ని 2015-16 నుంచి మైనార్టీలకు, 2016-17 నుంచి బీసీ విద్యార్థులకు కూడా వర్తింపజేయడం మొదలుపెట్టింది. 3లక్షల వరకు ఉన్న వార్షిక ఆదాయ పరిమితిని రూ. 5 లక్షలకు పెంచింది. ఇప్పటివరకు అన్ని కులాల నుంచి 1,773 మంది ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లతో వివిధ దేశాల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. యేటా గరిష్ఠంగా ఎస్సీలకు 500, మైనార్టీలకు 500, బీసీలకు 300, ఎస్టీలకు వంద స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. బీసీలకు కేటాయించిన స్కాలర్‌షిప్‌ల్లో ఐదు శాతం ఈబీసీలకు రిజర్వ్ చేశారు. మొత్తం స్కాలర్‌షిప్ లలో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. విదేశీ వర్సిటీల్లో అడ్మిషన్ దక్కించుకున్న విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తారు. ల్యాండింగ్ పర్మిట్, ఇమ్మిగ్రేషన్ కార్డు వచ్చిన అనంతరం రూ. 10 లక్షలు, సెకండ్ సెమిస్టర్ రిజల్ట్స్ వచ్చిన తర్వాత మిగతా రూ. 10 లక్షలు స్టూడెంట్స్ ఖాతాల్లో జమ అవుతాయి.

ఎంపికైన విద్యార్థులు వర్గాల వారీగా

కులం	ఏడాదికి స్కాలర్‌షిప్‌లు	ఎంపికైన విద్యార్థులు
ఎస్సీ	500	405 (నాలుగేళ్లలో)
ఎస్టీ	100	95 (నాలుగేళ్లలో)
బీసీ	300	475 (రెండేళ్లలో)
మైనార్టీ	500	798 (మూడేళ్లలో)
మొత్తం	**1400**	**1,773**

ఏడాదిలో రెండుసార్లు నోటిఫికేషన్

పథకానికి దరఖాస్తు చేసుకోడానికి 2 సార్లు నోటిఫికేషన్ విడుదలవుతుంది. జనవరి నుంచి ఫిబ్రవరి మధ్య ఒకసారి, జూన్ నుంచి జూలై మధ్య మరోసారి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ అభివృద్ధి సంక్షేమ శాఖ నోటిఫికేషన్లు ఇస్తారు. తెలంగాణ ఇపాస్ ద్వారా విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ అప్లికేషన్‌లు స్వీకరించి ఇంటర్వ్యూ చేసి అర్హులను ఎంపిక చేస్తున్నారు.

వీరు అర్హులు

ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పొందాలంటే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ విద్యార్థుల కుటుంబ వార్షికాదాయం రూ. 5 లక్షలకు మించకూడదు. గరిష్ఠ వయోపరిమితి 35ఏళ్లు. బీసీ విద్యార్థులు టోఫెల్ స్కోర్ 80, ఐఈఎల్‌టీఎస్ 6.5, జీఆర్‌ఈ 280, జీ మ్యాట్ 550 స్కోర్ సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు మొదట్లో టోఫెల్ స్కోర్ 60, ఐఈఎల్‌టీఎస్ 6.0, జీఆర్‌ఈ 260, జీమ్యాట్ 500 స్కోర్ సాధించాలనే నిబంధన ఉన్నా.. తర్వాత కొన్ని సడలింపులు ఇచ్చారు.

ఈ బాధ్యత సంతృప్తినిస్తోంది

విద్యార్థుల ఎంపిక పాదర్శకంగా నిర్వహిస్తున్నాం. ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరికీ అవకాశమిస్తున్నాం. రానున్న రోజుల్లో పథకం మరెందరికో ఉజ్వల భవిష్యత్ ఇస్తుంది.

- **కరుణాకర్, ఎస్సీ అభివృద్ధి శాఖ డైరెక్టర్**

మోడీ.. దీదీ ఢీ

కోల్‌కతా సీపీ ఇంట్లో సోదాలకు వెళ్లిన సీబీఐ అధికారులు ■ వారిని అదుపులోకి తీసుకున్న బెంగాల్ పోలీసులు

కోల్‌కతా:

మోడీ వర్సెస్ దీదీ లొల్లి పీక్స్‌కు చేరింది. సీబీఐని తన ఇలాకాలోకి అనుమతించేది లేదని తేల్చిచెప్పిన పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ.. ఇప్పుడు మరింత దూకుడు పెంచారు. కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఇంట్లో సోదాలకు వచ్చిన సీబీఐ అధికారులను అదుపులోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వానికి సవాల్ విసిరారు. అంతే కాదు సీపీ ఇంటి ముందు ధర్నాకు దిగారు. ఆదివారం సాయంత్రం మొదలైన హై డ్రామా అర్ధరాత్రి వరకు కొనసాగింది.

సోదాలకు రాగానే..

బెంగాల్‌ను కుదిపేసిన రూ. వేల కోట్ల రోజ్ వ్యాలీ, శారదా చిట్‌ఫండ్‌స్కాంలను గతంలో బెంగాల్ పోలీసుల తరఫున కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ విచారించారు. ఈ క్రమంలో ఆయనపై అనేక ఆరోపణలు వచ్చాయి. విచారణను తప్పుదోవ పట్టించేందుకు కీలక పత్రాలను మాయం చేశారని సీబీఐ ఆరోపిస్తున్నది. దీనిపై కోర్టు సీబీఐ ఆశ్రయించగా.. తన ఎదుట హాజరుకావాలని రాజీవ్‌ను కోర్టు ఆదేశించింది. ఆ ఆదేశాలను రాజీవ్ పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఆయన ఇంట్లో సోదాలకు ఆదివారం ఐదుగురు సభ్యులతో కూడిన సీబీఐ బృందం బయలుదేరింది. కోల్‌కతాలోని రాజీవ్ నివాసానికి సీబీఐ అధికారులు చేరుకోగానే.. అక్కడి పోలీసులు అడ్డుకున్నారు. రాజీవ్ లేరని, వారెంట్ చూపాలని నిలదీశారు. కోర్టు ఆదేశాల మేరకే తాము వచ్చామని సీబీఐ అధికారులు చెప్పినా పోలీసులు వినలేదు. ఈ క్రమంలో రాష్ట్ర పోలీసులకు, సీబీఐ అధికారులకు నడుమ వాగ్వాదం జరిగింది. ఐదుగురు సీబీఐ అధికారులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాజీవ్‌ను అరెస్టు చేసేందుకే సీబీఐ అధికారులు వచ్చారని వార్తలు వ్యాపించాయి. దీంతో రాత్రి 8 గంటల ప్రాంతంలో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆయన ఇంటికి చేరుకున్నారు. రాజీవ్‌కు మద్దతుగా నిలిచారు. సీబీఐ, కేంద్రం తీరుకు నిరసనగా అక్కడే ఆమె 'సేవ్ డెమోక్రసీ' పేరుతో ధర్నాకు దిగారు.

మీ కెంత ధైర్యం?: మమత

సీబీఐ సోదాలపై మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వారెంట్ లేకుండా ఎలా వస్తారని ప్రశ్నించారు. సీబీఐతోపాటు కీలక వ్యవస్థలను ధ్వంసం చేసేందుకు కేంద్రంలోని దొంగల పార్టీ బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బెంగాల్‌ను నాశనం చేయాలని చూస్తున్నారని, శనివారం ప్రధాని మోడీ మాట్లాడిన తీరును చూస్తేనే అర్థమవుతోందని ఆమె ధ్వజమెత్తారు. మోడీ చెప్పినట్లు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఆడుతున్నారని, ఏం చేస్తారో చేయని చూద్దామని అన్నారు. 'మా రాష్ట్ర పోలీసులను కాపాడుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. వారెంట్ లేకుండా పోలీస్ కమిషనర్ ఇంటికి ఎలా వస్తారు? మీకెంత ధైర్యం?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీబీఐ అధికారులను అదుపులోకి తీసుకుంది నిజమేనని, అయితే.. అటు తర్వాత విడుదల చేశామని



ఆదివారం కోల్‌కతాలో రాజీవ్ కుమార్ ఇంటి నుంచి బయటికి వస్తున్న పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ

ఆమె స్పష్టం చేశారు. రాజీవ్ కుమార్ ప్రపంచంలోనే అత్యుత్తమ పోలీస్ అని అంతకు ముందు ఆమె ట్విటర్‌లో కితాబిచ్చారు. ఆయన రోజుకు 24గంటలు ప్రజా సేవలోనే ఉంటారని, కావాలనే రాజీవ్‌పై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అర్ధరాత్రి వరకు మమత ధర్నాలో కూర్చున్నారు. రాత్రంతా ధర్నాను కొనసాగించాలని నిర్ణయించారు. కాగా, బెంగాల్‌లో మమతా బెనర్జీ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని బీజేపీ నేతలు ఆరోపించారు. కోర్టు ఆదేశాల మేరకు విచారణకు వచ్చిన సీబీఐ అధికారులను అదుపులోకి తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల బీజేపీ చీఫ్ అమిత్ షా ర్యాలీకి అనుమతివ్వలేదని, తాజాగా యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ పర్యటనను కూడా అడ్డుకున్నారని మండిపడ్డారు.

సుప్రీంకు సీబీఐ!

బెంగాల్ సర్కారు తీరుపై సుప్రీం కోర్టుకు వెళ్లేందుకు సీబీఐ సిద్ధమైంది. కోర్టు ఆదేశాల మేరకే తాము రాజీవ్ ఇంట్లో సోదాలకు వెళ్లామని, కావాలనే తమను అదుపులోకి తీసుకున్నారని సీబీఐ అధికారులు అంటున్నారు. బెంగాల్ సర్కార్ తీరును సీబీఐ తాత్కాలిక చీఫ్ నాగేశ్వరరావు తప్పుబట్టారు. కీలక కేసుల విచారణలో రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదన్నారు. రాష్ట్ర గవర్నర్‌ను కలవనున్నట్లు చెప్పారు.

అజ్ఞాతంలో రాజీవ్

కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్ కొన్నిరోజులుగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. రోజ్ వ్యాలీ, శారదా చిట్‌ఫండ్ స్కాంల్లో తనపైనే ఆరోపణలు రావడంతో ఆయన తప్పించుకుని తిరుగుతున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ స్కాంలలో అధికార టీఎంసీ నేతలకు కూడా ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే పలువురిని సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఇటీవల బెంగాల్‌లో జరిగిన బుక్‌ఫెయిర్‌లో మాత్రమే రాజీవ్ కనిపించారు. నాలుగురోజుల క్రితం కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్వహించిన ఎన్నికల సమావేశానికి బెంగాల్ ప్రభుత్వం తరఫున హాజరుకావాల్సి ఉన్నా ఆయన వెళ్లలేదు. దీనిపై ఎలక్షన్ కమిషన్ సీరియస్‌అవగా.. మమతా బెనర్జీ సారీ చెప్పారు.

ఇదీ రోజ్ వ్యాలీ స్కాం

- పశ్చిమ బెంగాల్‌లో రోజ్‌వ్యాలీకి 30 కంపెనీలున్నాయి. కాజల్‌కుందు ఈ సామ్రాజ్యాన్ని సృష్టించాడు. రోజ్‌వ్యాలీ చైన్ మార్కెటింగ్‌ను ప్రారంభించి, 2002లో ఎల్ఐసీకి కార్పొరేట్ ఏజెంట్‌గా మారాడు.
- 2003లో కాజల్ చనిపోవడంతో మొత్తం కంపెనీ గౌతమ్‌కుందు చేతికి వచ్చింది.
- తర్వాత పోంజీ పథకం మొదలు పెట్టారు. భారీ రాబడి వస్తుందని చెప్పడంతో వేలాది మంది ప్రజలు డిపాజిట్లు చేశారు.
- పోంజీ చైన్‌విషయంలో ఎలాంటి అడ్డంకులు తలెత్తకుండా పొలిటీషియన్లకు కంపెనీ లంచాలిచ్చింది. డిపాజిట్లలో ఎక్కువ మొత్తాన్ని ఇందుకే ఖర్చు పెట్టారని తెలిసింది.
- ఈడీ లెక్కల ప్రకారం పోంజీ స్కీమ్‌పేరుతో దేశవ్యాప్తంగా డిపాజిటర్ల నుంచి రూ.15 వేల కోట్లు వసూలు చేశారు.
- 2015 మార్చిలో రోజ్‌వ్యాలీ గ్రూప్‌చైర్మన్ గౌతమ్‌కుందును ఈడీ అరెస్టు చేసింది.
- కుంభకోణం మొత్తం విలువ రూ.60 వేల కోట్లపైనే ఉండొచ్చని అంచనా.

ఇదీ శారద స్కాం

- 200 ప్రైవేటు కంపెనీలు శారదా గ్రూప్‌గా ఏర్పడ్డాయి. పోంజీ స్కీమ్ పేరుతో లక్షలాది మంది నుంచి డిపాజిట్లు స్వీకరించాయి.
- 2013 ఏప్రిల్‌లో వెలుగులోకి వచ్చిన ఈ కుంభకోణం విలువ రూ.10 వేల కోట్లు
- 2013 ఏప్రిల్ 23న గ్రూప్‌చైర్మన్, ఎండీ సుదిప్త సేన్‌ను అరెస్టు చేశారు.
- తృణమూల్‌కాంగ్రెస్‌కు చెందిన ఎంపీల హస్తం ఈ కుంభకోణంలో ఉందని సుదిప్త సేన్ రాతపూర్వకంగా అంగీకరించారు.

కాలేజీల గుర్తింపు దరఖాస్తులకు 12 చివరి తేదీ

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో జూనియర్ కాలేజీల గుర్తింపు కొనసాగింపునకు ఈనెల 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ కుమార్ చెప్పారు. రూ.3వేల లేట్ ఫీజుతో ఈ నెల 25 వరకు, రూ.10వేల లేట్ ఫీజుతో మార్చి 20 వరకు గడువుందన్నారు. జనరల్, ఒకేషనల్ కోర్సులకు అనుమతి, కాలేజీ స్థలాల మార్పు, సొసైటీలు, కాలేజీల పేర్ల మార్పుతో పాటు అదనపు సెక్షన్లు, సీట్ల పెంపు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జనవరి 31తోనే గడువు ముగియగా.. ప్రైవేటు కాలేజీల విజ్ఞప్తి మేరకు ఇంటర్ బోర్డు గడువు పెంచింది.



షర్మిల కేసులో నిందితుడికి రిమాండ్

హైదరాబాద్, వెలుగు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సోదరి షర్మిలపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన కేసులో నిందితుడు పెద్దిశెట్టి వెంకటేశ్‌కు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. నిందితుడిని పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. యూట్యూబ్‌తో పాటు పలు వెబ్‌సైట్లలో 60 పోస్టులుపెట్టి అసభ్యకర కామెంట్లు చేసిన ఏపీలోని ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం వేముల గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావును సీసీఎస్ పోలీసులు శనివారం గుంటూరులో అరెస్టు చేశారు. మంచిర్యాలలో ఓ నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ఐదుగురి కోసం గాలిస్తున్నట్లు తెలుస్తోంది.

రైల్‌లో ప్రసవం.. తల్లీ, బిడ్డ క్షేమం

హైదరాబాద్, వెలుగు: నడుస్తున్న రైల్‌లో ఓ మహిళ ఆదివారం పండంటి బాబుకు జన్మనిచ్చింది. సప్న దేవి అంగ ఎక్స్‌ప్రెస్‌లో బగల్‌పూర్ నుంచి యశ్వంత్‌పూర్ వెళ్తోంది. తుని స్టేషన్ దాటాక దేవికి పురిటి నొప్పులు రావడంతో రైల్వే టీటీ సనత్ తర్వాతి స్టేషన్ యలమంచిలి అధికారికి సమాచారమిచ్చి అంబులెన్స్‌ను సిద్ధం చేయించారు. ఈ లోపే దేవి రైల్‌లోనే ప్రసవించింది. యలమంచిలి చేరిన వెంటనే తల్లీ, బిడ్డలను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు అధికారులు చెప్పారు.



జిల్లా జైళ్లలోనూ 'ఆనంద ఆశ్రమాలు'!

- యాచకుల్లో మార్పు కోసం జైళ్ల శాఖ కృషి
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- హైదరాబాద్‌లో ఫలిస్తున్న కార్యక్రమం

హైదరాబాద్, వెలుగు:

మొన్నటివరకు వాళ్లు హైదరాబాద్‌లో ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద 'అమ్మా.. అయ్యా..' అంటూ యాచించారు. చేయి చాచి అడుక్కున్న చోటనే ఇప్పుడు చిన్న చిన్న వస్తువులు అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నారు. వ్యాపారులుగా మారారు. రాష్ట్ర జైళ్ల శాఖ రాష్ట్ర రాజధానిలో చేపట్టిన 'ఆనంద ఆశ్రమాల' కార్యక్రమం ఈ మార్పును తెచ్చింది. వేల మంది యాచకులకు కొత్త జీవితం ఇచ్చింది. దీంతో జిల్లా జైళ్లలోనూ ఆనంద ఆశ్రమాలను ఏర్పాటు చేయాలని జైళ్ల శాఖ డీజీ వినయ్ కుమార్ సింగ్ భావిస్తున్నారు. వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, నల్లగొండ, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాల్లోని జైళ్లలో ఆశ్రమాల ఏర్పాటుకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వ ఆమోదం లభిస్తే మార్చిలో ఆశ్రమాలను ప్రారంభిస్తామని జైళ్లశాఖ అధికారులు అంటున్నారు.

హైదరాబాద్‌లో సత్ఫలితాలు

హైదరాబాద్‌లో చర్లపల్లి జైలులో మహిళల కోసం, చంచల్‌గూడ జైల్లో పురుషుల కోసం 'ఆనంద ఆశ్రమాలు' నడుస్తున్నాయి. ఇప్పటివరకు 12వేల మందికి పైగా యాచకులను నగర పోలీసులు పట్టుకొని ఆశ్రమాలకు తరలించారు. ఇందులో 7,589 మంది పురుషులు, 4,589 మంది మహిళలు ఉన్నారు. వీరి పూర్తి వివరాలు, వేలి ముద్రలను పోలీసులు భద్రపరుస్తున్నారు. బిచ్చగాళ్ల అవతారమెత్తి నేరాలు చేసే వారిని పట్టుకునేందుకు ఈ డేటా సాయపడుతుంది. ఆశ్రమాలకు తరలించినవారికి కొత్త బట్టలు ఇచ్చి, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తుంటారు. రెండు, మూడ్రోజులు ఆశ్రయం కల్పించి, కౌన్సిలింగ్ ఇస్తారు. ఆ తర్వాత బంధువులకు అప్పగిస్తారు. ఇలా ఇప్పటివరకు 7396 మంది పురుషులు, 4569 మంది మహిళలను ఆశ్రమాల నుంచి పంపించారు. వీరిలో కొంతమంది జైళ్లశాఖ ఉత్పత్తులనే అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. యాచిస్తూ రెండోసారి కూడా పట్టుబడితే.. ఆశ్రమంలోనే ఉంచి చదువు చెప్పించడంతోపాటు, కుట్లు, అల్లికలు, ప్లాస్టిక్ వస్తువుల తయారీ, మ్యాట్ల తయారీ వంటి స్వయం ఉపాధి కోసం శిక్షణ ఇస్తుంటారు. అవసరాన్ని బట్టి కొందరిని జైళ్లశాఖ పరిధిలోని బంకుల్లో, ఆయుర్వేద చికిత్సాలయంలో ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

ఆబ్కారీలో జియో ట్యాగింగ్

- లిక్కర్ తరలించే వాహనాలకు ట్యాగ్
- పర్యవేక్షణకు కమాండ్ కంట్రోలింగ్ సిస్టం
- రవాణాలో అక్రమాలకు చెక్

హైదరాబాద్, వెలుగు:

ఆబ్కారీ శాఖలో కొత్త విధానం తేవడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎక్సైజ్ ఆధునీకరణపై దృష్టిపెట్టిన అధికారులు తాజాగా జియో ట్యాగింగ్‌ను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా సమావేశమై దీని అమలు సాధ్యాసాధ్యాలపై చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 15 లిక్కర్ డిపోల్లో త్వరలోనే జియో ట్యాగింగ్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్టు తెలుస్తోంది. ఆయా డిపోల నుంచి లిక్కర్ ఇతర ప్రాంతాలకు రవాణా చేసేటప్పుడు ప్రతి వాహనానికి జియోట్యాగింగ్ చేస్తారు. దీంతో వాహనం ఎక్కడ ఉంది. ఎక్కడికి వెళ్తోందనేది ఈజీగా తెలుసుకోవచ్చు. ఒకవేళ వాహనం తప్పుడు రూట్‌లో వెళ్లినా తెలిసిపోతుంది. డిపో నుంచి బయలుదేరిన సరుకు గమ్యం చేరే దాకా వాహనం కదలికలపై నిఘా ఉంటుంది.

పర్యవేక్షణకు కమాండ్ కంట్రోలింగ్..

లిక్కర్ రవాణాను పర్యవేక్షించడానికి ప్రతీ డిపోలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, జియో ట్యాగింగ్‌ను దీనికి అనుసంధానం చేస్తారు. వాహనం ఎక్కడైనా నిలిపి డ్రైవర్ టీ తాగడానికి కొంచెం ఎక్కువ టైం తీసుకున్నా కంట్రోల్ రూమ్‌కు మెసేజ్ వెళ్తుంది. దీన్నిబట్టి అక్కడి ఇన్‌చార్జి బండి సరైనరూట్‌లోనే వెళ్తుందా.? ఎందుకు ఆగిందనే కారణాలను తెలుసుకుంటారు. తప్పుడు దారిలో వెళ్లినట్లు గుర్తిస్తే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. డిపోనుంచి బయలుదేరిన వాహనాలు చేరాల్సిన చోటుకు కాకుండా మధ్యలో వేరే ప్రాంతాలకు వెళ్లి నకిలీ మద్యం తెస్తున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీన్ని అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జియో ట్యాగింగ్ తీసుకురానున్నట్టు తెలుస్తోంది. లిక్కర్ రవాణాలో అక్రమాలకు చెక్ పెట్టడానికి ఎక్సైజ్ శాఖ టెక్నాలజీని వాడుకుంటోంది.

బండ్లు మస్తు అయితున్నయ్..

రాష్ట్రంలో ఏటా పెరుగుతున్న వాహనాలు | రహదారులపై కోటి 15 లక్షలకుపైగా బండ్లు | 85.5 లక్షల వరకూ టూవీలర్లే.. గ్రేటర్‌లోనే ఎక్కువ

7,46,168.. 2014లో రిజిస్ట్రేషన్ అయిన వాహనాల సంఖ్య.

10,87,859 .. 2018లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వెహికల్స్.

3,41,691.. గత ఐదేళ్లలో పెరిగిన రిజిస్ట్రేషన్లు.

45,39,887.. రాష్ట్రంలో ఐదేళ్లలో పెరిగిన బండ్లు.

1,15,07,113.. ప్రస్తుతం రాష్ట్రంలోని మొత్తం వాహనాలు.



గత ఐదేళ్లలో కేటగిరీల వారీగా వాహనాల రిజిస్ట్రేషన్లు(2014–-2018)

సంవత్సరం	టూవీలర్లు	ఫోర్‌వీలర్లు	ఇతర బండ్లు	మొత్తం
2014	5,75,235	89,211	81,722	7,46,168
2015	6,00,767	1,01,914	90,282	7,92,963
2016	6,76,607	1,26,810	1,05,494	9,08,911
2017	7,53,079	1,32,744	1,18,163	10,03,986
2018	8,06,074	1,40,091	1,41,694	10,87,859
మొత్తం	34,11,762	5,90,770	5,37,355	45,39,887

హైదరాబాద్, వెలుగు:

రాష్ట్రంలో వాహనాలు ఎంత వేగంగా పెరుగుతున్నాయో ఈ నంబర్లు చూస్తే అర్థమైపోతుంది. ఏటా బైకులు, కార్లు, ఇతర వాహనాల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కోటీ 15 లక్షల వాహనాలున్నాయి. ఇందులో సగం జీహెచ్ఎంసీ పరిధిలోనివే. ఇక ప్రతి రోజూ మూడు వేలకుపైగా వాహనాలు రిజిస్టర్ అవుతున్నాయి. ఒక్క 2018లోనే 10.87 లక్షల వాహనాలు రిజిస్టరయ్యాయి. వాహనాల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతుండటం పర్యావరణంపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది.

గ్రేటర్‌లో 58 లక్షల వెహికల్స్

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1,15,07,113(2019 జనవరి నాటికి) వాహనాలు ఉన్నాయి. ఇందులో టూవీలర్లు 85,52,524. కార్లు 13,70,369. మోటార్ క్యాబ్స్ 1,17,045. మ్యాక్సీ క్యాబ్స్ 28,492. స్కూల్ బస్సులు 25806. ఆటో రిక్షాలు 4,00,021. గూడ్స్ క్యారేజ్‌లు 4,63,874. ట్రాక్టర్ ట్రేలర్స్ 4,53,526 ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 58,93,193 వాహనాలు ఉన్నాయి. ఇందులో బైక్‌లు 43,39,581. మోటార్ కార్లు 10,05,461. గూడ్స్ క్యారేజ్‌లు 2,46,048. ఆటో రిక్షాలు 1,12,447 ఉన్నాయి. రాష్ట్రంలో ఐదేళ్లలో 45,39,887 వాహనాలు రిజిస్టరయ్యాయి. 2018లో 10,87,859 బండ్లు రిజిస్ట్రేషన్‌అయ్యాయి.

ఎందుకు పెరుగుతున్నయంటే..

ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగి అయినా, వ్యాపారులైనా ఇప్పుడు వెహికల్‌ఉండటం తప్పనిసరైంది. దీంతో వీరంతా ఏదో ఒక వాహనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఐటీ ఉద్యోగులు కార్లపై మక్కువ చూపుతుంటే.. ప్రభుత్వ ఉద్యోగులు సొంత వాహనాలకు మొగ్గు చూపుతున్నారు. చిరుద్యోగులు బైక్‌లను కొంటున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు, టైమ్ కలిసి వస్తుందనే కారణాలతో ఎక్కువ మంది సొంత వాహనాలవైపే మొగ్గుచూపుతున్నారు. దీంతో వాహనాల సంఖ్య ఏటా పెరుగుతోంది.

కాలుష్యం ఎక్కువైతోంది

రాష్ట్రంలో వాహనాల సంఖ్య పెరగడం వాతావరణంపైనా ప్రభావం చూపుతోంది. డీజిల్, పెట్రోల్‌తో నడిచే వాహనాలు భారీగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. దీంతో కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ గాలిలో పెరుగుతోంది. వాహనాల రణగొణధ్వనులతో శబ్ద కాలుష్యం పెరుగుతోంది. అధికంగా వాయు, శబ్ద కాలుష్యంలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉన్నట్లు పలు సంస్థలు చెప్పాయి.

ప్రతి ఇంట్లో నాలుగు బండ్లు

రాష్ట్రంలో వాహనాల సంఖ్య పెరుగుతోంది. నిత్యం మూడు వేలకుపైగా బండ్లు రిజస్టరవుతున్నాయి. ప్రస్తుతం ప్రతి ఇంట్లోనూ రెండు నుంచి నాలుగు బండ్లు ఉంటున్నాయి. కొంతమంది ప్రెస్టేజీ కోసం ఎక్కువ వాహనాలు వాడుతున్నారు.

- రమేశ్, జేటీసీ(ఐటీ)



అడవుల రక్షణకు యువ దళాలు

- మెరికల్లాంటి యువకులతో ప్రొటెక్షన్ ఫోర్స్
- త్వరలో 222 మంది నియామకం

హైదరాబాద్, వెలుగు: అడవులు, వ్యనప్రాణాలు సంరక్షణకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. చిరుతల్లా కదిలే మెరికల్లాంటి యువకులతో ప్రత్యేక దళాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీరి నియామకానికి అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. వణ్య ప్రాణులు అధికంగా ఉండే అమ్రాబాద్, కవ్వాల్ రిజర్వ్ ఫారెస్టుల్లో వీరి సేవలను వినియోగించుకుంటామని అటవీశాఖ ఓఎస్డీ శంకరన్ తెలిపారు.

రెండు దళాలు

ప్రస్తుతం దేశంలో13 టైగర్ ప్రొటెక్షన్ దళాలున్నాయి. అస్సాం, మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లోని అడవులు, వన్య ప్రాణుల సంరక్షణకు ఆ దళాలు పనిచేస్తున్నాయి. ఈ దళాల నిర్వాహణకు అయ్యే ఖర్చులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం భరిస్తాయి. ఒక్కో దళంలో 111 మంది సాయుధులు ఉంటారు. 25 ఏండ్ల లోపు ఉన్న యువకులు మాత్రమే దళాల్లో చేరేందుకు అర్హులు. రాత పరీక్ష, ఫిజికల్ టెస్టుల ద్వారా వీరిని ఎంపిక చేస్తారు. అనంతరం పోలీస్ శాఖలోని గ్రేహౌండ్స్ మాదిరి వీరికి ట్రైనింగ్ ఇస్తారు. తుపాకులు, ఇతర ఆయుధాల వాడకంలోనూ శిక్షణ ఇస్తారు. శిక్షణ ముగిశాక ఒక్కో దళాన్ని 3 ప్లటూన్లుగా విభజిస్తారు. ఈ మూడు ప్లటూన్లు అసిస్టెంట్ ఫారెస్ట్ కన్జర్వేటర్(ఏసీఎఫ్) సారథ్యంలో పనిచేస్తాయి. ప్లటూన్‌లో 27 మంది టైగర్ గార్డ్స్, 9 మంది టైగర్ వాచర్స్ ఉంటారు. ఒక్కో ప్లటూన్‌కు ఒక్కో రేంజ్ ఆఫీసర్ నాయకత్వం వహిస్తాడు. ఆయన ఆధ్వర్యంలో వీరు అడవిలో నిరంతరం గస్తీ నిర్వహిస్తారు. కలప స్మగ్లర్లు, వేటగాళ్లపై ఉక్కుపాదం మోపడంలో వీరు కీలక పాత్ర పోషిస్తారు. ఇలాంటి దళాల ఏర్పాటుకు కేంద్ర అటవీ శాఖ 2015లో రాష్ట్రానికి అనుమతిచ్చింది. రాష్ట్రప్రభుత్వం అంగీకారంతో త్వరలోనే ఈ దళాలను అటవీశాఖ ఏర్పాటు చేయనుంది. ఒక్కో దళంలో 111 మంది.. రెండు దళాల్లో 222 మంది ఉంటారు. ఒక దళం సేవలను 6.5 లక్షల ఎకరాల్లో విస్తరించిన అమ్రాబాద్ రిజర్వ్ ఫారెస్టులో, మరో దళం సేవలను 5.5 లక్షల ఎకరాల్లో విస్తరించిన కవ్వాల్ ఫారెస్టులో వినియోగించుకోనున్నారు. ఈ దళాల్లో పనిచేసేవారికి అడవుల్లోనే నివాస సముదాయాలను ఏర్పాటు చేస్తారు. ఒక్కో ప్లటూన్‌కు ఒక్కో నివాస సముదాయాన్ని అప్పగిస్తారు. అక్కడ్నుంచే ఆయా ప్లటూన్లు విధులు నిర్వహిస్తాయి.

40 చెక్‌పోస్టుల ఏర్పాటు

అడవుల సంరక్షణపై సీఎం కేసీఆర్ సూచనలతో ఆయా జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన 'ఫారెస్ట్ ప్రొటెక్షన్ కమిటీ'లు ఏర్పాటయ్యాయి. జిల్లాలో ఉన్న అటవీ విస్తీర్ణం, ఆక్రమణ తదితర లెక్కలను కలెక్టర్లు వెలికి తీస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కలప స్మగ్లింగ్ జరుగుతున్న ప్రాంతాలను గుర్తించిన అధికారులు, ఆయా ప్రాంతాల్లో 54 చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఈ నెల 1 నాటికి 40 చెక్ పోస్టులను ప్రారంభించారు. వాటిల్లో సాయుధ పోలీసులు, అటవీశాఖ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. గడిచిన మూడు వారాల్లో 554 గ్రామాలు, 387 కట్టెకోత మిల్లుల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు రూ. 70 లక్షల విలువైన కలపను సీజ్ చేశారు. కలప స్మగ్లింగ్, వన్య ప్రాణుల వేటకు సంబంధించి 449 కేసులు నమోదు చేశారు. తరచుగా కలప స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్టు 33 మందిని విచారించి, ఆదిలాబాద్‌లో ఇద్దరు, కొత్తగూడెంలో ముగ్గురిపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. అడవుల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై అరణ్య భవన్‌లో జిల్లాల అధికారులతో సమావేశం నిర్వహించారు.

బాధిత విద్యార్థులకు ఎన్నారైల సాయం

- డిటెన్షన్ సెంటర్లకు వెళ్లి మాట్లాడుతున్న తెలుగు అసోసియేషన్లు
- ఇమిగ్రేషన్ జడ్జీలు లేక విడుదలలో జాప్యం

హైదరాబాద్, వెలుగు: ఫార్మింగ్టన్ యూనివర్సిటీ వ్యవహారంలో అమెరికన్ పోలీసులు అరెస్టు చేసిన తెలుగు విద్యార్థులకు అక్కడి తెలుగు అసోసియేషన్లు సాయం చేస్తున్నాయి. జనవరి 30న అరెస్టు చేసిన 50 మంది తెలుగు విద్యార్థులను న్యూజెర్సీలోని ఎలిజబెత్ ప్రాంతంలో ఉన్న డిటెన్షన్ సెంటర్లో ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న నార్త్ అమెరికన్ తెలుగు సొసైటీ బృందం అటార్నీ (న్యాయవాది) శ్రీనివాసరావుతో కలిసి ఆ సెంటర్‌కు వెళ్లారు. తెలుగు విద్యార్థులను కలిసి మాట్లాడారు. అనంతరం ఈ వివరాలు వెల్లడించారు. ఒక్కో విద్యార్థి నుంచి 5000 డాలర్ల వ్యక్తిగత బాండ్‌తోపాటు చట్టబద్ధంగా అమెరికా ఇమిగ్రేషన్ ఉన్న ఇద్దరి నుంచి పూచీ తీసుకుని షరతులతో కూడిన తాత్కాలిక బెయిల్ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు తాము ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. డిటెన్షన్ సెంటర్‌లోని ఒక్కో రూమ్‌లో ఇద్దరు తెలుగు స్టూడెంట్లతోపాటు మెక్సికో, ఇతర దేశాలకు చెందినవారిని ఉంచినట్టు చెప్పారు. ఆ రూముల్లో బెడ్స్‌తోపాటు అటాచ్డ్ బాత్రూం, టీవీ, ఫోన్ సౌకర్యం కూడా ఉందని తెలిపారు. ఇమిగ్రేషన్ జడ్జీలు అందుబాటులో లేనందున మరికొన్ని రోజులు స్టూడెంట్లు డెటెన్షన్ సెంటర్‌లో ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. మిగతా చోట్ల కూడా వివిధ తెలుగు సంఘాలు విద్యార్థులకు తమ వంతు సాయం అందిస్తున్నాయి.



అమెరికాలోని ఎలిజబెత్ డిటెన్షన్ సెంటర్‌లో తెలుగు స్టూడెంట్లను కలిసి వస్తున్న ఎన్నారైలు



పట్నాలోని గాంధీ మైదాన్‌లో 'జన ఆకాంక్ష ర్యాలీ' వేదికపై రాహుల్ తదితరులు

దేశమంతటా రుణమాఫీ

కాంగ్రెస్‌చీఫ్ రాహుల్‌గాంధీ ప్రకటన

- రాజస్థాన్, ఎంపీ, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో అమలు చేశాం
- క్రాప్‌ఇన్సూరెన్స్ పేరుతో కేంద్రం రైతులను దోచుకుంటోంది
- బడా వ్యాపారవేత్తల జేబు నింపుతోందని ఆరోపణ

పట్నా: కాంగ్రెస్‌చీఫ్‌రాహుల్‌గాంధీ మరో సంచలన ప్రకటన చేశారు. పేద ప్రజలకు కనీస ఆదాయ పథకాన్ని తీసుకొస్తామని ఇటీవల హామీ ఇచ్చిన ఆయన, తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా ఉన్న రైతులందరి రుణాలను మాఫీ చేస్తామని తాజాగా ప్రకటించారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వాలు కొద్ది రోజుల్లోనే రుణమాఫీ చేశాయని, దీన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తామని వెల్లడించారు. కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో రైతులకు ఏడాదికి రూ.6 వేలు పంపిణీ చేస్తామన్న కేంద్రం ప్రకటన నేపథ్యంలో రాహుల్ రుణమాఫీ హామీ ప్రాధాన్యం సంతరించుకుంది.

రైతులే సమాధానం చెబుతారు..

ఆదివారం బీహార్ రాజధాని పట్నాలో కాంగ్రెస్ పార్టీ మెగా ర్యాలీ చేపట్టింది. కాంగ్రెస్‌ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా రాహుల్ అక్కడికి వెళ్లారు. రాహుల్‌మాట్లాడుతూ, బీహార్ సహా దేశంలోని రైతులను ప్రధాని మోడీ అవమానించారని విమర్శించారు. రైతులను అవమానిస్తే వారే మీకు సరైన సమాధానం చెబుతారని చెప్పారు. 'మాకు కాంగ్రెస్ పార్టీ కావాలి. బీజేపీ వద్దు' అని రైతులు కోరుకుంటున్నారని రాహుల్‌అన్నారు. తాము అధికారంలోకి వస్తే రైతు సమస్యలు, నిరుద్యోగంపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వారికి ఉద్యోగాల్లేకుండా చేస్తున్నారు

వెనుకబడిన వర్గాలకు యూనివర్సిటీల్లో ఉద్యోగ అవకాశాలు లేకుండా మోడీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. 'సీట్లను తగ్గించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు విద్యా అవకాశాలు లేకుండా చేశారు. రోహిత్ వేముల వంటి యువకులపై దాడి చేశారు'అని ట్వీట్‌చేశారు. వెనుకబడి వర్గాలను ప్రధాన స్రవంతి నుంచి బయటికి పంపి, తన మిత్రులైన పారిశ్రామిక వేత్తల అభివృద్ధికి మోడీ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

"గాలి మావైపు వీస్తోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు మాదే. భాగస్వామ్య పక్షాలతో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం. బీహార్‌లోనూ మా కూటమి అధికారంలోకి వస్తుంది" - రాహుల్

మోడీ తెలివైన సేల్స్ మ్యాన్

'ప్రధాని మోడీ తెలివైన సేల్స్ మ్యాన్. 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో బట్ట తల ఉన్న వారికి కూడా దువ్వెనలు అమ్మారు. దువ్వెనలు మాకెందుకు? అని వాళ్లు అడిగితే, 'ఇప్పుడు వీటిని కొనండి, తర్వాత మీ జుత్తు పెరిగేలా నేను చేస్తా' అని మోడీ చెప్పారని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ దుయ్యబట్టారు.

చౌకీదార్ చోర్‌హై

'చౌకీదార్‌చోర్‌హై' (కాపలాదారే దొంగ) అంటూ పరోక్షంగా మోడీని విమర్శించారు. రాఫెల్ ఒప్పందం విషయంలో ఎన్డీయే ప్రభుత్వం అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. రైతులు కష్టపడి సంపాదించుకున్న కాస్త ఆదాయాన్ని దోచి, పెద్దపెద్ద వ్యాపారవేత్తల జేబు నింపేందుకే కేంద్రం క్రాప్ ఇన్సూరెన్స్ పథకం తెచ్చిందని రాహుల్ విమర్శించారు. మోడీ మాదిరే, బీహార్ సీఎం నితీశ్‌కుమార్ ఉత్తుత్తి హామీలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు.

మళ్లీ నేనే



ప్రతిపక్షాలు ఎంత హంగామా చేసినా వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

- జమ్మూలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మళ్లీ వచ్చి వీటన్నింటినీ ప్రారంభిస్తా
- దేశ భద్రతపై రాజీ పడేదే లేదు
- లేహ్ బహిరంగ సభలో మోడీ

లేహ్: 'మహా కూటమి' పేరుతో ప్రతిపక్షాలు ఎంత హంగామా చేసినా వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. జమ్మూకాశ్మీర్ లో ఆదివారం ఆయన పర్యటించి అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. 'ఇవాళ ఎన్నో కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశాను. ఈ ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవాలు కూడా నేనే చేస్తాను' అని అన్నారు. పరోక్షంగా మళ్లీ ప్రధాని కుర్చీలో కూర్చునేది తానేనని మోడీ తేల్చి చెప్పారు. జమ్మూ కాశ్మీర్‌లో ఎంతో ముఖ్యమైన లేహ్ ప్రాంతాన్ని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. 'ఇది కాంగ్రెస్ సంస్కృతి' అని ఆయన కామెంట్ చేశారు. ఈ కల్చర్‌కు బీజేపీ చరమగీతం పాడిందని చెప్పారు.

నూతన టెర్మినల్ భవనానికి శంకుస్థాపన

లేహ్‌లో కుషోక్ బకుల రింపోచి ఎయిర్ పోర్టులో నూతన టెర్మినల్ భవనానికి ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. ఈ టెర్మినల్ లో అత్యాధునిక వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజలు ఇబ్బందికర పరిస్థితుల్లో బతుకుతున్న తీరు మరింత శ్రమించడానికి తనకు స్ఫూర్తి నిస్తోందన్నారు.

లడఖ్‌లో తొలి యూనివర్సిటీకి..

లడఖ్ ప్రాంతంలో తొలి యూనివర్సిటీకి ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకు జమ్మూలో నాలుగు విశ్వవిద్యాలయాలు, కాశ్మీర్ లోయలో మూడు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. లడఖ్‌లో ఇదే తొలి యూనివర్సిటీ కానుంది. దేశవ్యాప్తంగా విద్యారంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం చేపట్టిన అనేక చర్యలను ప్రధాని వివరించారు.

ఏసీ రూముల్లో కూర్చునే వారికి రైతు కష్టాలు పట్టవు

ఏసీ రూముల్లో కూర్చునే వారికి ఆరుగాలం కష్టపడే రైతుల కష్టాలు పట్టవని ప్రతిపక్షాలనుద్దేశించి ప్రధాని మోడీ విమర్శించారు. రైతుల సంక్షేమానికి మధ్యంతర బడ్జెట్ లో కేంద్రం పెద్ద పీట వేసిందన్నారు. 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పథకాన్ని ఆయన ప్రస్తావించారు. లేహ్ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు.

కాశ్మీరీ పండిట్లకు అండగా నిలుస్తాం

కాశ్మీరీ పండిట్లకు కేంద్రం అండగా నిలుస్తుందని ప్రధాని మోడీ చెప్పారు. పండిట్ల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాశ్మీర్ లో హింస, టెర్రరిజం చెలరేగిన సమయంలో ఇక్కడి పండిట్లు పొట్ట చేత పట్టుకుని మిగతా ప్రాంతాలకు వలస వెళ్లారని గుర్తు చేశారు. 'భారతదేశ చరిత్రలో నే అదొక చీకటి అధ్యాయం' అని కామెంట్ చేశారు. పండిట్లు ఆత్మ గౌరవంతో మళ్లీ కాశ్మీర్‌కు రావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని విజయపూర్ సభలో మోడీ చెప్పారు.

సౌభాగ్య పథకం కింద నూరు శాతం విద్యుదీకరణ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సౌభాగ్య పథకం కింద వంద శాతం విద్యుదీకరణ సాధించిన రాష్ట్రాల్లో జమ్మూకాశ్మీర్ చేరింది. కిష్త్ వార్‌లో 624 మెగావాట్ల సామర్థ్యంగల కిరు హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్‌తో పాటు పలు ఇతర పథకాలకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

రూసా పథకం ప్రారంభం

కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రూసా పథకాన్ని శ్రీనగర్ లో ప్రధాని మోడీ ప్రారంభించారు. కాశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో డిజిటల్ లాంచింగ్‌కు శ్రీకారం చుట్టారు. దేశంలోని అనేక వర్సిటీలు, 70 నూతన మోడల్ డిగ్రీ కాలేజీలు, 11 వృత్తి విద్యా కళాశాలలను ఈ పథకానికి కేంద్రం ఎంపిక చేసింది. డిజిటల్ లాంచింగ్ తర్వాత యూనివర్సిటీల వీసీలతో మోడీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

విద్యారంగం, హెల్త్ కేర్ కు ప్రయారిటీ

మోడీ తన పర్యటనలో విద్య, ఆరోగ్య రంగాలకు టాప్ ప్రయారిటీ ఇచ్చారు. వీటికి సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. రెండు ఎయిమ్స్ నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. వీటిలో ఒకటి జమ్మూలోనూ మరొకటి శ్రీనగర్ లోనూ ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాని కిందటేడాది మే 19న జమ్మూ కాశ్మీర్‌లో పర్యటించారు. దాదాపు 10 నెలల తర్వాత ఆయన మరోసారి రాష్ట్రంలో పర్యటించారు.

దాల్ సరస్సులో ప్రధాని విహారం


రోజంతా అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో బిజీగా ఉన్న ప్రధాని మోడీ కాసేపు వాటికి విరామమిచ్చారు. దాల్ సరస్సులో విహరించారు. సరస్సు అందాలను ఆస్వాదిస్తూ రిలాక్స్ అయ్యారు. బోటు లో వెళ్తూ దూరంగా ఉన్న ప్రజలను చూసి చేతులూపారు.

ఇంటర్నెట్ సర్వీసుల నిలిపివేత

ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా రాష్ట్రంలో ఇంటర్నెట్ సర్వీసులను నిలిపివేశారు. మోడీ రాకను నిరసిస్తూ వేర్పాటు వాదులు బంద్ పిలుపునిచ్చారు. అయితే ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లు సమాచారం అందలేదని అధికారులు చెప్పారు.

కాంగ్రెస్ రుణమాఫీ ఓ జిమ్మిక్కు

కాంగ్రెస్ అమలు చేస్తున్న రైతు రుణమాఫీలను ఓ జిమ్మిక్కుగా ప్రధాని మోడీ పేర్కొన్నారు. లోక్ సభ ఎన్నికల్లో గెలుపుకోసమే రుణాలను మాఫీ చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి రైతులను చిన్నచూపు చూస్తోందన్నారు. అనేక సంవత్సరాల పాటు అధికారంలో ఉండి కూడా రైతులకు కాంగ్రెస్ చేసిందేమీ లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ విధానాల వల్లనే రైతులు ఇప్పటికీ కష్టాలు పడుతున్నారన్నారు.



దాల్ లేక్‌లో మోడీ పడవవిహారం

సర్జికల్ స్ట్రైక్స్ తో మనమేంటో చెప్పాం

సర్జికల్ స్ట్రైక్స్, భారతదేశ విదేశాంగ విధానానికి కొత్త రూపు నిచ్చిందన్నారు. కయ్యానికి కాలుదువ్వే పొరుగుదేశాల పట్ల మనం ఎలా ఉంటామో సర్జికల్ స్ట్రైక్స్ ప్రపంచానికి వివరించిందని ప్రధాని మోడీ చెప్పారు. టెర్రరిజాన్ని ఎదుర్కోవడానికి సంబంధించి సర్జికల్ స్ట్రైక్స్ ఒక సంప్రదాయంగా మారిందన్నారు. భారత్, మౌలికంగా శాంతికాముక దేశమన్నారు. అయితే భారత్ ను ఆక్రమించడానికి ఏ పొరుగుదేశమైనా ప్రయత్నిస్తే సర్జికల్ స్ట్రైక్స్ ఫలితాలు ఉంటాయన్నారు. భద్రతను కట్టుదిట్టం చేయడంలో భాగంగా జమ్మూ సరిహద్దుల్లో 14 వేల బంకర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మోడీ చెప్పారు. దేశ భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. సైనికుల కోసం ' ఒన్ ర్యాంక్ ఒన్ పెన్షన్ ' విధానాన్ని తీసుకువచ్చిన ఘనత ఎన్డీయే సర్కార్ దేనన్నారు. మన భద్రతా బలగాలకు సీమాంతర టెర్రరిజాన్ని అదుపు చేసే సత్తా ఉందన్నారు. జమ్మూ కాశ్మీర్ నుంచి టెర్రరిజాన్ని పూర్తిగా తరిమేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ప్రధాని మోడీ చెప్పారు.

నాకేమైనా జరిగితే ప్రధానిని జనం నిలదీస్తారు

సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే

రాలేగావ్ సిద్ధి: అవినీతికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో తనకేమైనా జరిగితే ప్రధాని నరేంద్ర మోడీని ప్రజలు నిలదీస్తారని సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే అన్నారు. లోక్ పాల్, లోకాయుక్త నియామకాల్లో జాప్యాన్ని నిరసిస్తూ మహారాష్ట్రలోని తన సొంతూరు రాలేగావ్ సిద్ధిలో బుధవారం ఆయన నిరాహార దీక్ష చేపట్టారు. లోక్‌పాల్, లోకాయుక్తల నియామకాలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవస్థలు ఏర్పాటైతే ప్రధాని, ముఖ్యమంత్రిపై కూడా విచారణ జరిపే అవకాశం ఉంటుందన్నారు. కాగా, అన్నా హజారే నాలుగు రోజులుగా చేస్తున్న నిరాహార దీక్షను పట్టించుకోవడం లేదంటూ ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ)పై రాలేగావ్‌సిద్ధి గ్రామస్తులు మండిపడ్డారు.



పట్టాలు తప్పిన 'సీమాంచల్'

వైశాలీ దగ్గర్లో బోల్తాపడిన 11 బోగీలు ● ఆరుగురు మృతి.. 29 మందికి గాయాలు



బోల్తాపడిన బోగీల వద్ద రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు

సోనాపూర్: బీహార్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. జోగ్బానీ నుంచి ఆనంద్‌విహార్‌వెళ్తున్న సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ వైశాలి జిల్లా దగ్గర్లో పట్టాలు తప్పింది. ఆ దివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు చనిపోగా.. మరో 29 మందికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే రైల్వే సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఒక జనరల్‌బోగీ, బీ3 ఏసీబోగీ, ఎస్ 8, 9, 10తో సహా మొత్తం పదకొండు బోగీలు పట్టాలు తప్పాయని ఈస్ట్‌డివిజన్‌రైల్వే అధికారులు చెప్పారు. గాయప డిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని, వారిని పాట్నాలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. ఈ ప్రమాదంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన శంషుద్దిన్(25), అన్సర్‌ఆలం(21), సాయిద్‌ఖతూన్ (45), బీహార్‌కు చెందిన ఇందిరా దేవి (65), సుదర్శన్‌దాస్(60), ఎలీచా దేవి(60) చనిపోయినట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేంద్ర రైల్వే మంత్రి పీయూష్‌గోయల్‌స్పందించారు. ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.ఐదు లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి లక్ష, గాయప డిన వారికి యాభైవేల రూపాయల పరిహారం అందించనున్నట్లు ప్రకటించారు. బీహార్ సీఎం నితీశ్‌కుమార్‌సహాయక చర్యలు జరుగుతున్న తీరును సమీక్షించారు. అధికారులు రైలు సర్వీసులను పునరుద్ధరించి ప్యాసింజర్లను దానాపూర్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకునేందుకు హెల్ప్‌లైన్‌నెంబర్లను ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తుకు ఆదేశించినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

అదృష్టం కొద్ది బయట పడ్డాం

అదృష్టం కొద్ది తామంతా బతికి బయటపడ్డామని సీమాంచల్ ఎక్స్‌ప్రెస్‌లోని కొందరు ప్రయాణికులు చెప్పారు. నిద్రలో ఉన్న తమకు ఒక్క సారి గా బాంబు పేలిన శబ్దం వినిపించిందని చెప్పారు. ఏమైందో అని తేరుకుని చూస్తే బోగీ తలకిందులై ఉందని, ఎవరో వచ్చి తనని కాపాడి బయటికి తీశారని దేవీ అనే ప్రయాణికురాలు చెప్పారు. తెల్లవారుజామున పెద్ద శబ్దం వచ్చిందని, బాంబు పేలిందేమో అనుకుని చాలా భయపడ్డామని స్థానికులు చెప్పారు. ఏమైందో చూసేందుకు వెళ్లగా బోగీలు పక్కకు పడి ఉన్నాయి అని రైల్వే ట్రాక్‌కు దగ్గర్లో నివసిస్తున్న స్థానికులు చెప్పారు.

ప్రమాదంపై ప్రధాని విచారం

రైలు ప్రమాదంపై ప్రధాని మోడీ, కాంగ్రెస్‌చీఫ్ రాహుల్‌గాంధీ విచారం వ్యక్తం చేశారు. 'రైలు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు తొందరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని మోడీ ట్వీట్‌చేశారు. ప్రమాదం ఘటన తనను బాధించిందని రాహుల్‌గాంధీ చెప్పారు. ప్రమాద బాధిత కుటుంబాలకు ఆయన సంతాపం తెలిపారు. కేంద్ర మంత్రి పాశ్వాన్, యూపీ సీఎం ఆదిత్యనాథ్, రైల్వే మాజీ మంత్రి, ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్‌యాదవ్ స్పందించారు. ప్రమాద ఘటన దురదృష్టకరమని, బాధితులకు సంతాపాన్ని తెలియజేశారు.

'వందే భారత్'పై రాళ్లదాడి

న్యూఢిల్లీ: దేశంలోనే అత్యంత వేగంగా ప రుగులు తీసే రైలుగా గుర్తింపు పొందిన వందే భారత్‌ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి జరిగింది. ఢిల్లీ-వారణాసి మధ్య ట్రయల్ రన్‌నిర్వహిస్తున్న సమయంలో శనివారం అర్ధరాత్రి కొందరు ఆకతాయిలు రైలుపై రాళ్లు విసిరారు. ఢిల్లీలోని సకూర్‌బస్తీకి చెందిన వారు ఈ దాడి చేసినట్లు అధికారులు భావిస్తున్నారు.

తమిళనాడు పీసీసీ చీఫ్‌గా అళగిరి

చెన్నై: లోక్ సభ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేయడంలో భాగంగా కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ అనేక కీలక నియామకాలు చేశారు. తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్‌గా కడలూరు మాజీ ఎంపీ కెఎస్ అళగిరిని నియమించారు. హెచ్.వసంత్ కుమార్, కె. జయకుమార్, ఎంకే విష్ణుప్రసాద్, మయూర జ యకుమార్ లను వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నియమించారు.

యోగి ర్యాలీకి దీదీ బ్రేక్

- హెలికాప్టర్‌కు అనుమతివ్వని మమత సర్కార్
- ఫోన్ ద్వారా ప్రసంగించిన యూపీ సీఎం యోగి

కోల్ కతా: ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ హెలికాప్టర్ ల్యాండ్ కావడానికి పశ్చిమ బెంగాల్ సర్కార్ అనుమతి నిరాకరించింది. పశ్చిమ బెంగాల్లో ఆదివారం ఏర్పాటుచేసిన రెండు కార్యక్రమాల్లో పాల్గొనడానికి యోగి ఆదిత్యనాథ్ హెలికాప్టర్ లో బయల్దేరారు. అయితే ముందుగా సమాచారం ఇవ్వలేదన్న కారణం చూపిస్తూ ఆయన హెలికాప్టర్ ల్యాండింగ్‌కు బెంగాల్ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. దీంతో ఫోన్ ద్వారానే బాలార్ ఘట్ ర్యాలీనుద్దేశించి యోగి ఆదిత్యనాథ్ ప్రసంగించారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నియంతృత్వ వైఖరితో పాలన సాగిస్తున్నారని యోగి మండిపడ్డారు. తన హెలికాప్టర్‌కు అనుమతి ఇవ్వకపోవడమే దీనికి నిదర్శనమన్నారు. బెంగాల్లో ప్రజాస్వామ్యానికి పాతర వేస్తున్నారన్నారు. 'బాలార్ ఘట్ ర్యాలీకి వెళ్లకుండా నన్ను ఆపగలరు కానీ నా గొంతు నొక్క లేరు' అని అన్నారు. మమత పాలనకు రోజులు దగ్గరపడ్డాయన్నారు. రాష్ట్రంలో బీజేపీకి పెరుగుతున్న ఆదరణ చూసి మమత భయపడుతున్నారని చెప్పారు. కొన్నిరోజుల కిందట బీజేపీ ప్రెసిడెంట్ అమిత్ షా హెలికాప్టర్ ల్యాండింగ్‌కు కూడా మమత సర్కార్ అనుమతి ఇవ్వలేదు.

బీజేపీ కార్యకర్తల నిరసన

యోగి ఆదిత్యనాథ్ హెలికాప్టర్‌కు ప్రభుత్వం అనుమతివ్వకపోవడంపై బీజేపీ కార్యకర్తలు మండిపడ్డారు. దక్షిణ దీనాజ్ పూర్ జిల్లా కలెక్టర్ నివాసం ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. మమతా బెనర్జీ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

దుబాయ్‌లో మనోడికి 19 కోట్ల జాక్‌పాట్

దుబాయ్: అదృష్టం అంటే ఇదే! బతుకు దెరువు కోసం దుబాయ్ వెళ్లిన ఇండియన్‌కు యూఏఈలో జాక్‌పాట్ తగిలింది. ఆదివారం ఓపెన్ చేసిన బిగ్ టికెట్ లాటరీలో ప్రశాంత్‌పండరతిల్ అనే వ్యక్తికి ఏకంగా 10 మిలియన్ దిర్హామ్స్(రూ.19.45కోట్లు) దక్కాయి. గత నెలలో శరత్ పురుషోత్తం అనే ఇండియన్ 15 మిలియన్ దిర్హామ్స్ గెలుచుకున్నారు. అబుదాబి ఇంటర్‌నేషనల్ ఎయిర్ పోర్టులో 5 వందల దిర్హామ్ లకు ఈ లాటరీ టికెట్లను అమ్ముతారు. ఆన్‌లైన్ ద్వారా కూడా కొనొచ్చు. దీంతో అక్కడున్న మనోళ్లు వాటాలు వేసుకుని టికెట్లు కొంటూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు.

'చౌకీదార్'ను ఓడించాలి



- సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి
- కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో భారీ ర్యాలీ

కోల్‌కతా: దోపిడీ, మతోన్మాదం పెరిగిపోతోందని, వాటిని చూసి కూడా పట్టించుకోని చౌకీదార్ (వాచ్‌మన్) నరేంద్ర మోడీని ఓడించి, దేశాన్ని కాపాడాలని ప్రజలకు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. కేంద్రంలో ప్రత్యామ్నాయ డెమొక్రటిక్ ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందన్నారు. "వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో చౌకీదార్ మోడీని ఓడించాలి. తన ఎదుటే దోపిడీ జరుగుతున్నా పట్టించుకోని ఇలాంటి చౌకీదార్ మనకు అవసరం లేదు. మతన్మోద విషాన్ని వారు దేశమంతా విస్తరించారు" అని ఆరోపించారు. ఆదివారం పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లు దేశాన్ని లూటీ చేసిన బీజేపీ ప్రభుత్వం, త్వరలో ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో రాయితీలు, పథకాలు ప్రకటిస్తోందన్నారు. "మోడీ మాకు నచ్చలేదన్న కారణంతో ఆయన్ను ఓడించాలని కోరడంలేదు. మేం మార్పు కోరుకుంటున్నాం. అలా జరిగితేనే ప్రత్యామ్నాయ పాలసీలు ఉంటాయి" అని అని కోరారు. కాషాయ పార్టీ, మమతా బెనర్జీ పార్టీ దొందూ దొందేనని, నాణేనికి రెండు ముఖాలన్నారు.

అన్ని సంస్థలను నాశనం చేస్తున్నారు: సురవరం

కేంద్రం ప్రవేశ పెట్టినది 'జుమ్లా' బడ్జెట్ అని, దేశంలోని అన్ని సంస్థలను బీజేపీ నాశనం చేస్తోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. పార్లమెంటును కూడా సజావుగా నడపడం లేదని, ప్రజా సమస్యలు చర్చకు రాలేదని మండిపడ్డారు.




న్యూఢిల్లీలో ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఉద్దేశించిన వాహనాలను ఆదివారం ప్రారంభిస్తున్న రాజ్‌నాథ్, షా

బీజేపీ మేనిఫెస్టో కోసం మెగా కసరత్తు

'భారత్ కే మన్ కీ బాత్, మోడీ కే సాత్' పేరుతో సలహాల సేకరణ

న్యూఢిల్లీ: లోక్ సభ ఎన్నికలకు మేనిఫెస్టో తయారు చేయడానికి బీజేపీ పెద్ద ఎత్తున కసరత్తు మొదలెట్టింది. 'భారత్ కే మన్ కీ బాత్, మోడీ కే సాత్' పేరుతో దేశవ్యాప్తంగా పది కోట్ల మంది సలహాలు, సూచనలు సేకరించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. బీజేపీ ప్రెసిడెంట్ అమిత్ షా, సీనియర్ నేత, కేంద్ర హోంమంత్రి రాజ్ నాథ్ సింగ్ ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఎన్నికల ప్రణాళికను తయారు చేయడానికి ఇంత పెద్ద సంఖ్యలో ప్రజల అభిప్రాయాలు సేకరించడం దేశచరిత్రలో ఇదే తొలిసారి అని అమిత్ షా చెప్పారు. బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్న నవభారత నిర్మాణంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. నెలరోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో సోషల్ మీడియాను కూడా ఉపయోగించుకుంటామన్నారు. 300 వాహనాల్లో దేశమంతా తిరిగి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. ఈ సందర్భంగా తొలి సలహా ఇచ్చే అవకాశాన్ని పార్టీ నేతలు ఓ హోటల్ బేరర్‌కు కల్పించారు. మేనిఫెస్టోలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేయాలని భావిస్తున్నట్లు 'మేనిఫెస్టో కమిటీ' చైర్మన్ రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. రైతులకు మేలుచేయడానికి మోడీ సర్కార్ చేపట్టిన పథకాలను వివరించారు. నూటికి నూరు శాతం ప్రజల ఆశయాలకు అనుగుణంగా మేనిఫెస్టోను రూపొందిస్తామని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.


ఓఆర్ఆర్-గుమ్మడిదల మధ్యలో ఫోర్ లైన్ రోడ్ విస్తరణ పనులు

ఇదేం హైవే.!

62 కి.మీ.లలో 15 కి.మీ.లే ఫోర్‌లైన్ | **మిగతా అంతా 10 మీటర్ల వెడల్పే** | **డేంజర్ మూలమలుపుల విస్తరణ లేనట్లే..** | **రూ.426 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు తీరిది**

నేషనల్ హైవే అంటే... ఆసాంతం రోడ్డు ఒక్క తీరుగా నాలుగు వరుసలుగా ఉంటుంది. అటు రెండు బండ్లు, ఇంటు రెండు బండ్లు పోయేట్టుగా ఉండి యాక్సిడెంట్‌లు కాకుండా మధ్యలో డివైడర్ కడ్తరు. ముఖ్యంగా మూల మలుపులు సరిచేసి ఎదురుంగ వచ్చే వెహికిల్స్ కనిపించేటట్టు రోడ్డు సక్కగ నిర్మిస్తరు. అయితే రూ.426 కోట్లతో బాలానగర్-మెదక్ రూట్ల కొత్తగా నిర్మిస్తున్న నేషనల్ హైవేలో కొంతదూరమే నాలుగు లైన్ల రోడ్డు నిర్మిస్తున్నరు. మిగితా అంతా రెండు లైన్‌ల రోడ్డే వేస్తరట. ఫారెస్ట్ పర్మీషన్ రాలేదని డేంజర్‌గ ఉన్న మూల మలుపులు అట్లనే ఉంచుతున్నరు. దీంతోటి వందల కోట్లు వెట్టి హైవే నిర్మిస్తున్నా పెద్దగ లాభం లేకపోగా, యాక్సిడెంట్లు మరింత ఎక్కువయ్యే అవకాశం ఉందని వాహనదారులంటున్నరు.

మెదక్, వెలుగు:

హైదరాబాద్ నగర శివార్లలోని బాలానగర్ నుంచి నిర్మల్ జిల్లా భైంసా వరకు 238 కి.మీ. దూరం ఉన్న 6వ నెంబరు స్టేట్ హైవేను నేషనల్ హైవేగా డెవలప్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపగా 2016 జనవరిలో కేంద్రం నుంచి ఆమోదం లభించింది. ఫస్ట్ ఫేజ్‌లో నగర శివార్లలోని గండిమైసమ్మ ఔటర్ రింగ్ రోడ్డు దగ్గర నుంచి మెదక్ వరకు సుమారు 62 కి.మీ. దూరం నేషనల్ హైవే నిర్మించేందుకు రూ.426 కోట్లు మంజూరయ్యాయి. కొత్తగా నిర్మించే ఈ హైవేకు '765-డి' అనే నెంబరు కేటాయించారు. నేషనల్ హైవే అంటే ఆసాంతం రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరిస్తారని, మూల మలుపులు తొలగించి రోడ్డును సక్కగ చేస్తారని అందరూ అనుకున్నారు. అయితే పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. టెండర్ ప్రక్రియ పూర్తి కాగా గత సెప్టెంబరులో హైవే పనులు ప్రారంభమై ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నాయి. ఓఆర్ఆర్ నుంచి మెదక్ వరకు మొత్తం 62 కి.మీ. మేర నేషనల్ హైవే నిర్మిస్తుండగా అందులో కేవలం 15 కి.మీ. మాత్రమే 4 లైన్ రోడ్డు ఉండనుంది. మిగితా 47 కి.మీ. 10 మీటర్ల వెడల్పు రోడ్డు మాత్రమే నిర్మించనుండటం గమనార్హం. గండిమైసమ్మ ఓఆర్ఆర్ నుంచి సంగారెడ్డి జిల్లా పరిధిలోని గుమ్మడిదల వరకు 12 కి.మీ. దూరం నాలుగు వరుసల రోడ్డు నిర్మిస్తున్నారు. అలాగే రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నర్సాపూర్ టౌన్‌లో 2 కి.మీ. దూరం ప్రస్తుతం ఉన్న ఫోర్ లైన్ రోడ్డును డెవలప్ చేస్తారు. ఆ తర్వాత మండల కేంద్రమైన కౌడిపల్లి, కొల్చారం మండలం అప్పాజిపల్లి, రాంపూర్ వద్ద ఒక కి.మీ. మేర మాత్రమే నాలుగు వరుసల రోడ్డు నిర్మిస్తారు. మొత్తం 15 కి.మీ. మాత్రమే నాలుగు వరుసల రోడ్డు వస్తుంది. ఆయా ప్రాంతాల్లో మాత్రమే ఇరువైపులా 50 ఫీట్లమేర రోడ్డు విస్తరించి మధ్యలో డివైడర్, రెండు వైపులా డ్రైనేజీ, ఫుట్‌పాత్‌లు నిర్మిస్తారు.

47 కి.మీ. 10 మీటర్ల వెడల్పే

ఓఆర్ఆర్ నుంచి మెదక్ వరకు 62 కి.మీ.లలో 15 కి.మీ. పోగా మిగిలిన 47 కి.మీ. దూరం 10 మీటర్ల వెడల్పు రోడ్డు మాత్రమే నిర్మిస్తారు. ప్రస్తుతం ఉన్న 7 మీటర్ల రోడ్డును అటు ఒకటిన్నర, ఇటు ఒకటిన్నర మీటర్ల చొప్పున విస్తరించి 10 మీటర్ల రోడ్డును హైవే స్టాండర్డ్స్‌తో అభివృద్ధి చేస్తారు. బీటీ రోడ్డు తర్వాత ఇరువైపులా 5 ఫీట్లమేర సైడ్‌బర్మ్ నిర్మిస్తారు. కాగా గుమ్మడిదల నుంచి నర్సాపూర్ టౌన్ వరకు ఆ తర్వాత కౌడిపల్లి-కొల్చారం మండల కేంద్రాల మధ్య అటవీ ప్రాంతంలో, అలాగే కొల్చారం మండల పరిధిలోని హనుమాన్ బండల్-కిష్టాపూర్ మధ్యలో చాలా ప్రమాదకరమైన మూల మలుపులు 35 వరకు ఉన్నాయి. అయితే ఫారెస్టు డిపార్ట్‌మెంట్ పర్మిషన్ లభించకపోవడంతో ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న 7 మీటర్ల రోడ్డును కేవలం 10 మీటర్ల మేరే వెడల్పు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో మలుపులు అలాగే ఉండనున్నాయి. బాలానగర్ నుంచి గుమ్మడిదల వరకు రోడ్డును నాలుగు వరుసలుగా నిర్మిస్తుండటంతో వెహికిల్స్ స్పీడ్‌గా వస్తాయి. ఆ తర్వాత ఒక్కసారిగా రోడ్డు ఇరుకుగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడతారు. యాక్సిడెంట్‌లు ఎక్కువయ్యే అవకాశం ఉంది.

గుమ్మడిదల వరకే ఫోర్ లైన్..

ఓఆర్ఆర్ నుంచి మెదక్ వరకు కొత్త నేషనల్ హైవే పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. గుమ్మడిదల వరకు మాత్రమే ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని అక్కడి వరకు మాత్రమే నాలుగు వరుసల రోడ్డు మంజూరు చేశారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఒప్పుకోకపోవడంతో గుమ్మడిదల-నర్సాపూర్ మధ్యలో ప్రస్తుతం ఉన్న 7 మీటర్ల బీటీ రోడ్డును 10 మీటర్లకు మాత్రమే విస్తరిస్తున్నాం. ఆ ప్రాంతంలో మూల మలుపులు ఎక్కువగా ఉన్నందున నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ పర్మిషన్ కోసం ప్రయత్నం చేస్తున్నాం. ఈ మేరకు ఓ రిపోర్టు కూడా సబ్మిట్ చేశాం. వాళ్లు దాన్ని చెన్నైకి పంపిస్తారట. ఫారెస్ట్ ఏరియాలో రోడ్డు విస్తరించాలంటే ఢిల్లీ నుంచి పర్మిషన్ రావాలి.

- చంద్రశేఖర్, నేషనల్ హైవే డీఈఈ


ఫారెస్ట్ ఏరియాలో పది మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న రోడ్డు



8న పేపర్ మిల్ షురూ



- ఎస్పీఎం ఉత్పత్తికి ముహూర్తం ఖరారు
- కార్మికులు, ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం

కాగజ్‌నగర్, వెలుగు : నాలుగేళ్ల క్రితం మూతపడిన సిర్పూర్ పేపర్ మిల్లులో మళ్లీ కాగితం ఉత్పత్తికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 8న ఉదయం 7వ నెంబర్ మిషన్ ద్వారా ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు జేకే కంపెనీ యూనిట్ ప్రతినిధి పేర్కొనడంతో కంపెనీ కార్మికులు, ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 1938లో ఎస్పీఎం కంపెనీకి అంకురార్పణ చేయగా 1943 నుంచి కాగితం ఉత్పత్తిని ప్రారంభించింది. అనంతరం బిర్లా కంపెనీ ఆధీనంలోకి వెళ్లింది. అనంతరం యాజమాన్యం చేసిన అప్పులు, ఇతర పరిస్థితులతో 2014 సెప్టెంబర్ 27న కంపెనీ మూతపడింది. దీంతో ఐదువేల పైచిలుకు ఉద్యోగ, కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

జేకే కంపెనీకి బాధ్యతలు

సిర్పూర్ పేపర్ మిల్లు మూతపడి కుటుంబాలు రోడ్డున పడడంతో దానిని తిరిగి తెరిపించడానికి టీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కార్మికుల దీనస్థితిని స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సైతం సీఎం కేసీఆర్, అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌కు వివరించారు. దీంతో వారు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ద్వారా న్యాయపరమైన చిక్కులు అధిగమించేలా ప్రయత్నించారు. తర్వాత గత ఏడాది ఆగస్టు 2న కేటీఆర్ ఎస్పీఎం పునరుద్ధరణకు పూజలు నిర్వహించారు. పదేళ్లపాటు ప్రత్యేక రాయల్టీలు కల్పించి జేకే కంపెనీకి మిల్లు నడిపే బాధ్యతలు అప్పగించారు. ఆరు నెలలుగా అవిశ్రాంతంగా కంపెనీ ప్రతినిధులు ప్రత్యేక నిపుణులతో మరమ్మతులు నిర్వహించారు. పేపర్ ఉత్పత్తికి ముహూర్తం ఖరారు చేశారు. ఈ నెల 8న పేపర్ ఉత్పత్తి కోసం కార్మిక కుటుంబాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.



సినిమాకు మాతృక రంగస్థలమే

- హీరో శ్రీకాంత్



భద్రాచలం, వెలుగు: నేటి సినిమాకు మాతృక రంగస్థలమేనని ప్రముఖ సినీ హీరో శ్రీకాంత్ అన్నారు. 17వ అంతరాష్ట్ర భద్రాద్రి కళాభారతి తెలుగు నాటకోత్సవాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎస్వీ రంగారావు, ఎన్టీఆర్, ఏఎన్ఆర్, సూర్యకాంతం వంటి రంగస్థల నటులే తెలుగు సినీరంగానికి మూలస్తంభాలయ్యారని గుర్తు చేశారు. 'మా' కూడా నాటకరంగాన్ని పరిరక్షించాలన్న ఉద్దేశంతో పరుచూరి సోదరుల నేతృత్వంలో గత ఏడాది నుంచి రవీంద్ర కళాభారతిలో నాటక ప్రదర్శనలను నిర్వహిస్తోందన్నారు. తాను నాటకాల్లో నటించలేదని, కానీ నాటికలంటే ప్రాణమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా కళాకారులకు సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. భద్రాద్రి కళాభారతి వంటి సంస్థ తెలుగు రాష్ట్రాలకే గర్వకారణం అని ప్రశంసించారు. మూడుసార్లు గతంలో తనను ఈ నాటికలకు ఆహ్వానించినా అవుట్‌డోర్ షూటింగ్‌ల కారణంగా రాలేకపోయానని అన్నారు. ఈసారి రాకపోతే చాలా మిస్ అయ్యేవాడినని ఇక్కడికి వచ్చాక అందరి ఆదరాభిమానాలు, వాత్సల్యం చూసి అనిపించిందని తెలిపారు. అనంతరం ఆకెళ్ల రచనలో 'జరుగుతున్న కథ' నాటిక ప్రదర్శించారు. భద్రాద్రి కళాభారతి అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్‌అధ్యక్షతన జరిగిన ఈ ఉత్సవాల్లో పంచాక్షరయ్య, చావా లక్ష్మీనారాయణ, జీఎస్.శంకర్‌రావు, తాండ్ర వెంకటరమణ, పాకాల భరత్, సోమరౌతు శ్రీనివాసరావు, టీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. కర్నాటకు చెందిన నేహాశ్రీ అనే చిన్నారి కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంది.

క్విక్ బైట్స్


అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న రాములు

పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు సన్మానం

మల్లేశం సినిమా పోస్టర్ ఆవిష్కరణ

రాజన్నసిరిసిల్ల , వెలుగు : పద్మశ్రీ పురస్కార గ్రహీత, నేతన్న చింతకింది మల్లేశం బయోపిక్ సినిమాను ఆదరించి విజయవంతం చేయాలని బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆదివారం మల్లేశం సినిమా పోస్టర్ ఆవిష్కరణతో పాటు పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన పద్మశ్రీ పురస్కారగ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య, చింతకింది మల్లేశంను సత్కరించారు. ఆలయ ఫౌండేషన్ , కలయిక ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, గాయకులు గోరేటి వెంకన్న, కథా రచయిత పెద్దింటి ఆశోక్ కుమార్, సినీ నటుడు ప్రియదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఒకరి మృతదేహం దొరికింది

- మరో ఇద్దరి కోసం గాలింపు
- శనివారం గోదావరిలో గల్లంతైన ముగ్గురు యువకులు

భద్రాచలం, వెలుగు: గోదావరిలో గల్లంతైన యువకుల్లో ఒకరి మృతదేహం ఆదివారం లభ్యమైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెంనకు చెందిన కుందూరు శ్రీనివాసరెడ్డి, కారంపూడి దుర్గాశేషు, తిరుమలరెడ్డి శివారెడ్డి శనివారం గోదావరిలో స్నానానికి దిగి గల్లంతయ్యారు. యువకుల మృతదేహాల కోసం ఆదివారం పాల్వంచ డీఎస్పీ మధుసూదనరావు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు అధునాతన అండర్ వాటర్ నావిగేషన్ డిటెక్టివ్ పరికరాల సాయంతో గాలింపు చేపట్టారు. మొత్తం ఎనిమిది డెత్‌స్పాట్లను గుర్తించి గాలించడంతో సాయంత్రం వరకు కుందూరు శ్రీనివాసరెడ్డి మృతదేహం లభ్యమైంది. మిగిలిన ఇద్దరి మృతదేహాల కోసం గోదావరి కిన్నెరసాని సంగమ ప్రదేశంలో గాలిస్తున్నారు. పిల్లల ఆచూకీ లభించకపోవడంతో వారి కుటుంబసభ్యుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. సోమవారం తిరిగి రెస్క్యూ ఆపరేషన్ చేపడుతామని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు తెలిపాయి.





కొమురవెల్లిలో భక్తుల సందడి

సిద్దిపేట, వెలుగు: కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మూడునెల్ల జాతరలో మూడో ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనానికి తరలివచ్చారు. సుమారు 25 వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ సంఖ్యలో భక్తులు రావడంతో స్వామి దర్శనానికి రెండు గంటలకు పైగా సమయం పట్టింది. ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తులు భారీగా బారులు తీరారు. ఆలయ పరిసరాలతో పాటు ఎల్లమ్మగుట్ట వద్ద భక్తుల రద్దీ నెలకొంది. ముఖమండపం, గంగరేణి చెట్టు వద్ద భక్తులు పట్నాలు వేసి, ఓడిబియ్యాలతో మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు భారీ సంఖ్యలో భక్తులు రావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హుస్నాబాద్ ఏసీపీ మహేందర్ స్వయంగా పరిస్థితిని సమీక్షించారు. ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్‌లను ఏర్పాటు చేశారు.


స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులు

ఇంటి బిల్లు కట్టు.. డ్రాలో బైక్ పట్టు

- బకాయిలు వసూలు చేసేందుకు కొత్త సర్పంచ్ వినూత్న పథకం

కమ్మర్‌పల్లి, వెలుగు: 'ఒక వస్తువు కొంటే మరో వస్తువు ఉచితం' ఇవి రోజు ప్రకటనలో చూస్తాం. కానీ గ్రామ పంచాయతీలో ఉన్న రూ. 8 లక్షల ఇంటి బకాయిలను వసూలు చేయడానికి సర్పంచ్ వినూత్న పథకానికి శ్రీకారం చుట్టారు. వివరాల్లోకి వెళ్తే... నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కొనసముందర్ గ్రామంలో 920 కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామంలో ఎన్నో ఏండ్ల నుంచి రూ. 8 లక్షల ఇంటి బకాయిలు పేరుకుపోయాయి. వీటిని వసూలు చేసేందుకు అధికారులు గ్రామాల్లో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించినా పూర్తి స్థాయిలో బకాయిలను వసూలు చేయలేకపోయారు. దీంతో శనివారమే ప్రమాణ స్వీకారం చేసిన సర్పంచ్ ఇంద్రాల రూప బకాయిలను వసూలు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇంటి బిల్లు చెల్లించిన వారి పేర్లను డ్రా తీసి బైక్ గిఫ్ట్‌గా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇంటి బిల్లులు మొత్తం వసూలైన తర్వాత డ్రా తీయనున్నట్లు తెలిపారు. బైక్‌కు అవసరమైన డబ్బులను పంచాయతీ నిధుల నుంచి కాకుండా తానే సొంతంగా ఖర్చు చేస్తానని ప్రకటించారు. వసూలైన నిధులను గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామన్నారు.

క్యాన్సర్ టెస్ట్‌కు 'గిన్నిస్'లో చోటు


గిన్నిస్ బుక్ సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రతినిధులు



క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరైన ప్రజలు

- సర్టిఫికెట్ అందజేసిన ప్రతినిధులు
- 4,578 మందికి పరీక్షలు
- ప్రజల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

మహబూబాబాద్, వెలుగు: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌నకు గిన్నిస్ బుక్‌లో చోటు లభించింది. ప్రపంచ క్యాన్సర్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, కలెక్టివ్ పవర్ ఆఫ్ వన్ అమెరికా సహకారంతో డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాంకిషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్, ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి, ఢిల్లీ అధికార ప్రతినిధి రామచంద్రునాయక్‌లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ శిబిరంలో 4,578 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడంతో గిన్నిస్ బుక్‌లో చోటు లభించింది. ఇంతకుముందు ఈ రికార్డు 2,499 మందికి పరీక్షలు చేసిన రికార్డు ఉంది. అంతకుముందు డెంటిస్ట్‌లు పలు సూచనలు చేశారు. చాలా మంది అవగాహన లేకుండా దంతాలను శుభ్రపరచడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు.

1100 మంది సిబ్బంది

జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి స్క్రీనింగ్ పరీక్షల కోసం వచ్చే వారికి రవాణా ఇబ్బందులు కలుగకుండా ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు, ఉచిత భోజన వసతిని కల్పించారు. ఈ శిబిరంలో 300 డాక్టర్లు, 500 మంది నర్సులు, వలంటీర్లు, ఇతర టెక్నీషియన్లు కలిపి మొత్తం 1100 మంది సేవలు అందించారు. పరీక్షల కోసం పేర్లు నమోదు చేసుకున్న వారికి కోడ్ తెలిసేలా టీ షర్ట్, ట్యాగ్‌లను ఇచ్చారు. అమెరికాలోని క్యాన్సర్ డాక్టర్లు, అపోలో ఆస్పత్రి వైద్యులు చిన్నబాబు, హేమంత్, సురేశ్‌తో పాటు పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.



రాజకీయాలపై ఇంట్రెస్ట్ లేదు

భద్రాచలం, వెలుగు : రాజకీయాలపై తనకు అవగాహన ఉందని, కానీ ఇంట్రెస్ట్ లేదని ప్రముఖ హీరో శ్రీకాంత్ అన్నారు. ఆదివారం భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాసేవ చేయాలంటే రాజకీయాల్లోకే రానవసరం లేదని అన్నారు. మా అసోషియేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. గతంలో దేవుళ్ల, సంక్రాంతి సినిమాల కోసం భద్రాచలం వచ్చానని, భద్రాద్రి కళాభారతి తెలుగు నాటకోత్సవాలను తిలకించేందుకు ఈసారి వచ్చానని తెలిపారు.

మల్లు రవి ఇంట్లో కాంగ్రెస్ నేతల భేటీ

హైదరాబాద్, వెలుగు: సీఎల్పీ నేతగా మల్లు భట్టి విక్రమార్క ఎన్నికైన సందర్భంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన సోదరుడు, మాజీ ఎంపీ మల్లు రవి ఇంట్లో ఆదివారం కాంగ్రెస్ నేతలు భేటీ అయ్యారు. తాజా రాజకీయాలు, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై ముచ్చటించారు. ఈ భేటీలో భట్టితో పాటు పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ విజయశాంతి, ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్, అద్దంకి దయాకర్, పలువురు పీసీసీ నేతలు, డీసీసీ అధ్యక్షులు, పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు.

స్కూల్‌గ్రాంట్స్ విడుదల చేయండి

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాములు డిమాండ్

హైదరాబాద్, వెలుగు: సర్కారు స్కూళ్లకు ఏటా ఇచ్చే గ్రాంట్లు విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ రాములు డిమాండ్ చేశారు. ప్రారంభంలోనే ఇవ్వాల్సిన స్కూల్‌గ్రాంట్స్ విద్యాసంవత్సరం ముగిసేందుకు వచ్చినా విడుదల చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఆదివారం టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు 35 శాతం ఐఆర్ ఇవ్వాలని, పీఆర్సీ అమలు చేయాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ భాషాపండితులు, పీఈటీ పోస్టులన్నింటినీ స్కూల్ అసిస్టెంట్‌గా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నర్సిరెడ్డి, దుర్గాభవాని, సోమశేఖర్, మాణిక్‌రెడ్డి, కిష్టయ్య పాల్గొన్నారు.

నరికేస్తుండ్రు

స్మగ్లర్ల గొడ్డలి వేటుతో అడవులన్నీ ఆగమవుతున్నాయి. మస్తు ట్రాక్టర్లు, లారీలు కలపతో రాత్రికి రాత్రే జిల్లా బాడర్ దాటుతున్నాయి. ఎకరాల కొద్దీ భూములు కబ్జాకు గురవుతున్నాయి. కొంత మంది అధికారుల అండదండలతోనే ఈ తతంగం జరుగుతోందనే ఆరోపణలున్నాయి. దీంతో అక్రమాలకు అలవాటు పడిన వ్యాపారులు 'ఆడేందే ఆట, పాడిందే పాట'గా నడుస్తోంది. ఇది నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని అడవుల్లో నిత్యం జరుగుతున్న 'వ్యాపారం'.



కామారెడ్డి జిల్లా కొయ్యగుట్ట అటవీలో చెట్లను నరికి తగలబెట్టిన ప్రాంతం

- స్మగ్లర్ల గొడ్డలి వేటుతో అడవుల అన్యాక్రాంతం
- లారీల కొద్దీ బడర్ దాటుతున్న వైనం
- ఎకరాలకొద్దీ భూముల కబ్జా
- 'మాముళ్లు'గా అధికారులు
- రెచ్చిపోతున్న వ్యాపారులు

నిజామాబాద్/బాన్సువాడ, వెలుగు:

అక్రమ కలప వ్యాపారం నిజామాబాద్ జిల్లా కేంద్రంతోపాటు ఆర్మూర్, భీమ్‌గల్, సిరికొండ, బోధన్, బాల్కొండ, డిచ్‌పల్లి, కమ్మర్ పల్లి, మోర్తాడ్ తదితర ప్రాంతాల్లో జోరుగా సాగుతోంది. పాత గుడిసెల్లో, పశువుల కొట్టాల్లో, గడ్డి వాముల్లో, ఊరికి దూరంగా ఉన్న పాడుబడ్డ ఇండ్లు అద్దెకు తీసుకుని అక్రమ కలపను దాచుకునే స్థావరంగా ఉపయోగిస్తున్నారు. గతంలో చాలా సందర్భాల్లో భీమ్‌గల్ , కోనాసముందర్, నర్సాపూర్, మెండోరా, పురాణీపేట్, సిరికొండ, వాల్గోట్ తదితర గ్రామాల్లో భారీగా కలప స్వాధీనం కాగా పలువురిపై కేసులు కూడా నమోదయ్యాయి. కామారెడ్డి జిల్లాలోని బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలంలోని బొప్పాస్పల్లి, సంగెం, హాజీపూర్, బొమ్మన్దేవ్‌పల్లి, నస్రుల్లాబాద్ తదితర గ్రామాల అటవీ భూములు అన్యాక్రాంతమువుతున్నాయి. అదేవిధంగా బాన్సువాడ మండలంలోని కోనాపూర్, హన్మాజీపేట్, కొయ్యగుట్ట, సంగోజీపేట్, కాద్లాపూర్ తదితర గ్రామాల్లో అటవీ భూములు కబ్జా, కలప అక్రమ రవాణ జోరుగా సాగుతోంది. బాన్సువాడ మండలంలోని కొయ్యగుట్ట ప్రాంతంలో సుమారు 50ఎకరాల వరకు అటవీ భూమి అన్యాక్రాంతమైంది. ఈ మధ్యనే విజిలెన్స్ అధికారులు దాడులు చేసి, పలువురిపై కేసులు నమోదు చేశారు.

ఆదిలాబాద్ టు నిజామాబాద్..

ఆదిలాబాద్ ఫారెస్ట్‌లో దొరికే టేకు దుంగలకు, ఇతర కలపకు జిల్లాలో చాలా డిమాండ్ ఉంది. ఆదిలాబాద్ ఫారెస్ట్ లో టేకు చెట్లు నరికి అక్రమంగా నిలువ ఉంచి నిజామాబాద్ జిల్లాలోని వ్యాపారులకు విక్రయించే ముఠాలు చాలా ఉన్నాయని, ఈ విషయం ఎప్పటి నుంచో కొంత మంది అధికారులకు తెలుసనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా ఫారెస్ట్ నుంచి కలపను అక్రమంగా తరలిస్తున్న నిజామాబాద్ జిల్లాకు చెందిన కలప స్మగ్లర్లను నిర్మల్ పోలీసులు వెంబడించి పట్టుకోవడంతో కలప స్మగ్లింగ్ ముఠా గుట్టు రట్టయ్యింది. రూ. 16 లక్షల పైచిలుకు విలువైన కలప పట్టుబడటం, 11మంది నిందితులపై కేసులు నమోదు చేశారు. కలప స్మగ్లింగ్ కేసులో జిల్లాకు చెందిన ఓ అధికారి, మరో ప్రజాప్రతినిధి ఉండడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎం ఆదేశాలతో తనిఖీలు ముమ్మరం...

'మాకు ప్రజలే ముఖ్యం. వారి భవిష్యత్తు బాగుండడమే లక్ష్యం. భావితరాలు బాగుండాలంటే అడవులను కాపాడుకోవాలి. స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలి. విస్తృతంగా తనిఖీలు నిర్వహించి అక్రమార్కులు భరతం పట్టాలి' అని ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తనిఖీలు ముమ్మరమయ్యాయి.



కేసులు నమోదు చేస్తున్నాం...

అడవులను అక్రమంగా నరుకుతున్నవారిపై, అటవీ భూములను కబ్జా చేస్తున్న వారిపై దాడులు చేసి, కేసులు నమోదు చేస్తున్నాం. అక్రమ కలప తరలకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 40మందిపై కేసులు నమోదు చేశాం. అడవుల రక్షణకు తమవంతు కృషి చేస్తున్నాం.

– గంగాధర్, బాన్సువాడ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్

రాష్ట్ర పథకాలు దేశానికే ఆదర్శం

- ప్రభుత్వ తోడ్పాటుతో రికార్డుస్థాయి పంటదిగుబడి
- పుస్తకావిష్కరణలో అసెంబ్లీ స్పీకర్‌పోచారం

హైదరాబాద్, వెలుగు:

రాష్ట్రంలో అమలవుతున్న రైతు బంధు, రైతు బీమా పథకాలను ఐక్యరాజ్యసమితి గుర్తించిందని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప థకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, ఇతర రాష్ట్రాలు కూడా మన పథకాలను అమలు చేస్తున్నాయని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన రాసిన 'తెలంగాణలో సుస్థిర వ్యవసాయం' వ్యాసాల సంపుటిని స్పీకర్ ఆవిష్కరించారు. వ్యవసాయ రంగంపై అవగాహన, చర్చలకు అవకాశం కలిగించేలా రచనలు చేసినందుకు చెన్నమనేనిని అభినందించారు. రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సీఎం కేసీఆర్ తీసుకున్న సాహసోపేత నిర్ణయం వల్ల భూరికార్డుల ప్రక్షాళన జరిగిందని స్పీకర్ అన్నారు. ప్రభుత్వ తోడ్పాటుతో విద్యావంతులు కూడా వ్యవసాయంలోకి వస్తున్నారన్నారు. నిర్మాణంలో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులు పూర్తి అయితే 1.2లక్షల ఎకరాల్లో పంట సాగులోకి వస్తుందని, తద్వారా రూ 1.5లక్షల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పారు. పండిన పంటల ప్రాసెసింగ్‌కు ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందన్నారు.



ఫెడరల్ ఫ్రంట్ ఎంతో అవసరం

- ఎస్సీ జేఏసీ, బీసీ జనసభ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

హైదరాబాద్, వెలుగు: ఫెడరల్ ఫ్రంట్ ఆలోచన దేశానికి సరైన మార్గనిర్దేశం చేసేదని, రాజకీయాలకు అతీతంగా మద్దతు పలకాలని ఎస్సీ జేఏసీ, బీసీ జనసభ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో "భారతదేశ రాజ్యాంగం, సమాఖ్య స్ఫూర్తి, ఫెడరల్ ఫ్రంట్ ఆవశ్యకత" అంశంపై ఈ సమావేశం నిర్వహించారు. దేశం అభివృద్ధి చెందాలంటే ఈ ఫ్రంట్ ఎంతో అవసరమని ఈ సందర్భంగా శాసన మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి చెప్పారు. దేశంలో అధికార వికేంద్రీకరణ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

క్విక్ బైట్స్



చీరను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

చేనేత కార్మికులకు తోడ్పాటు

గద్వాల, వెలుగు : గద్వాల చేనేత కార్మికులకు ప్రభుత్వ పరంగా తోడ్పాటు అందిస్తామని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. ఆదివారం హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ సహాయ సంచాలకులు శరణ్యతో కలిసి గద్వాలలోని రాఘవేంద్ర కాలనీలో కార్మికుల ఇండ్లల్లో చీరల తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత పరిశ్రమను అన్ని విధాలా ఆదుకుంటోందన్నారు. గద్వాలలో చేనేత పార్కు ఏర్పాటుకు అన్ని విధాల సహకరిస్తాని చెప్పారు. కావున చేనేత, గద్వాల చీర తయారీ పరిశ్రమపై అవగాహన కల్పించుకోడానికి సందర్శించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గద్వాల జరీ చీరల తయారీ మాస్టర్ వీవర్ అసోషియేషన్ అధ్యక్షుడు అక్కల శ్రీనివాసులు, సలహాదారు గోవిందరావు, చేనేత కార్మికుల సంఘం అధ్యక్షుడు అక్కల శాంతారామ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను తరిమేయాలి

- స్వేరోస్ లైఫ్ లైన్ లీగ్‌ఆధ్వర్యంలో 2కె రన్
- అవగాహన కార్యక్రమం

కోదాడ, వెలుగు : ప్రస్తుతం మారిన మానవ జీవన విధానంతో పలువురు ప్రమాదకర క్యాన్సర్‌వ్యాధి బారిన పడుతున్నారని, దానిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోదాడ రూరల్‌సీఐ రవికుమార్, స్వరోస్ జాతీయ నాయకుడు బల్లూరి దుర్గయ్య కోరారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కోదాడ పట్టణంలో లైఫ్‌లైన్‌లీగ్, స్వేరోస్‌సంస్థల ఆధ్వర్యంలో క్యాన్సర్‌వ్యాధిపై అవగాహనకు 2కె రన్, సమావేశాలు నిర్వహించారు. ఈ రన్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల నుంచి వారు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులలర్పించి ప్రారంభించి మాట్లాడారు. క్యాన్సర్‌ను నిర్మూలించడంతో పాటు అందరికీ ఆరోగ్యం చేకూర్చాలని స్వేరొస్ వ్యవస్థాపకుడు డాక్టర్‌ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆశయమని, దానికనుగ/నంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు, స్వేరోస్‌సంఘం నాయకులు పాల్గొన్నారు.





చెరుకు తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ ధర్మారెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి

సేంద్రియ ఎరువులతో లాభాలు

మెదక్, వెలుగు: సమీకృత వ్యవసాయం లాభదాయకమని జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి అన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం హవేలి ఘనపూర్ మండలం కూచన్‌పల్లిలోని సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్‌రెడ్డి అన్న శేరి నారాయణరెడ్డి అవలంభిస్తున్న సమీకృత వ్యవసాయ విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆయన సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్న అరటి, జామ, మలబారు, వేప, చెరుకు తోటలను పరిశీలించి సాగు విధానాలు, నీటి యాజమాన్య పద్ధతుల గురించి తెలుసుకున్నారు. వ్యవసాయ క్షేత్రంలో ప్రయోగాత్మకంగా సాగుచేసిన ఆలుగడ్డ పంట దిగుబడులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి సమస్య ఉన్నందున రైతులు తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేయడంపై దృష్టి సారించాలన్నారు. రసాయనిక ఎరువులతో పెట్టుబడి వ్యయం పెరగడంతోపాటు భూసారం దెబ్బతింటుందన్నారు.



పిల్లల మర్రికి ప్రాణమొచ్చింది

- చెదలు పట్టిన చెట్టుకు చిగురొస్తోంది
- కలెక్టర్ ఆదేశాలతో ట్రీట్‌మెంట్ చేయించిన అధికారులు

మహబూబ్ నగర్, వెలుగు : పాలమూరు అంటేనే గుర్తుకు వచ్చే పిల్లల మర్రి.. అలాంటి పిల్లల మర్రికి ఊడలకు చెదలు పట్టి.. మర్రిచెట్టు కొమ్మలు విరిగిపోయి ఇక మర్రిచెట్టు ఆనవాళ్లు ఉండవనే ఆందోళన వ్యక్తమయ్యాయి. దీంతో జిల్లా కలెక్టర్ రొనాల్డ్‌రోస్ ప్రత్యేక చొరవ తీసుకుని అటవీశాఖ అధికారులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టడంతో చెట్టుకు పూర్వ వైభవాన్ని వచ్చింది. మర్రిచెట్టు చెదలుకు ప్రత్యేక డాక్టర్లను రప్పించి ఆధునిక చికిత్స చేశారు. రోగికి ఎలా సెలైన్లు ఎక్కిస్తారో అలా చెట్టు నుంచి చెదలను తీసేశారు. దీంతో మర్రిచెట్టు తిరిగి కాండం పెరిగి కొత్త ఆకులు చిగురించాయి. సుమారు 700 సంవత్సరాల క్రితం నాటి ఈ మర్రి వృక్షం భారతదేశంలోనే మూడోది.

ప్రత్యేక ట్రీట్‌మెంట్


జిల్లాకే తలమానికమైన పిల్లమర్రికి ఆరునెలల క్రితం నుంచి ప్రత్యేక చర్యలు చెపట్టామని జిల్లా అటవీ శాఖ అధికారి గంగిరెడ్డి తెలిపారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో రక్షణ చర్యలు చేపట్టడంతో పిల్లలమర్రి బతికిందన్నారు. చెదలు పట్టిన చెట్టుకు ప్రత్యేక రూట్ కేనాల్ ద్వారా మందులను పిచికారి చేయించామన్నారు. భవిష్యత్ లో మరిన్ని ప్రత్యేక రక్షణ చర్యలు చేపడతామన్నారు. మర్రిచెట్టుకు చెదలు, ఫంగస్ సోకకుండా బయోకెమికల్ లను వాడాలని భావిస్తున్నామన్నారు. ఇక నుంచి చెట్టుకు ఎలాంటి తెగుళ్లు అంటకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.



ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు



వనదుర్గామాత విగ్రహం



ఏడుపాయల ఆలయం

- నేడే మాఘ అమావాస్య జాతర
- నదీ పాయల్లో నీటి ప్రవాహం లేక భక్తుల నిరాశ
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన పాలకమండలి

మెదక్, వెలుగు:

మాఘ అమావాస్య ఉత్సవాలకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయం ముస్తాబైంది. ఎండోమెంట్ అధికారులు, ఆలయ పాలక మండలి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మాఘ అమావాస్య రోజు ప్రవహించే నదిలో పవిత్ర స్నానాలు చేస్తే పుణ్యం లభిస్తుందన్నది భక్తుల నమ్మకం. ఈ మేరకు నదీ తీరాల్లో వెలసిన ప్రముఖ ఆలయాల వద్ద భక్తులు పవిత్ర స్నానాలు చేసేందుకు ఆసక్తి చూపుతారు. ఈ క్రమంలో మెదక్ జిల్లాలో గరుడగంగగా పేరుగాంచిన పవిత్ర మంజీరా నది ఏడుపాయలుగా చీలి ప్రవహిస్తుంది. దీంతో వనదుర్గా భవాని మాత వెలసిన ఏడుపాయల్లో ప్రతి ఏటా మాఘ అమావాస్య సందర్భంగా పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుగుతాయి. ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు, పొరుగు జిల్లాలు, హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి సుమారు 75 వేల మంది సోమవారం తెల్లవారు జాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు తరలివస్తారు. అనంతరం వనదుర్గాభవాని మాతను దర్శించుకుని పూజలు చేస్తారు. భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని ఈవో మోహన్‌రెడ్డి, పాలకమండలి చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేశారు.

సింగూరు నీరు రాక ఇబ్బంది

ప్రతి ఏటా మాఘ అమావాస్య సందర్భంగా ఎగువన సంగారెడ్డి జిల్లాలోని సింగూర్ ప్రాజెక్టు నుంచి 0.25 టీఎంసీల నీటిని ఏడుపాయల ప్రాంగణంలోని ఘనపూర్ ఆనకట్టకు విడుదల చేసేవారు. ఈసారి సింగూర్‌లో తగినంత నీటి నిల్వ లేకపోవడంతో దిగువకు నీరు విడుదల చేయలేదు. అటు సింగూరు నుంచి నీరు రాక ఇటు ఘనపూర్ ఆనకట్టలో నీటినిల్వ అడుగంటి పోవడంతో మాఘ స్నానాలకు ఇబ్బందికరంగా మారింది.

మోటార్లు పెట్టి నీటిని తోడి

గత్యంతరం లేకపోవడంతో ఆలయ అధికారులు, పాలకవర్గం ఘనపూర్ ఆనకట్టలోని మడుగుల్లో ఉన్న నీటిని మోటార్ల ద్వారా ఆనకట్ట దిగువన ఉన్న నదీ పాయల్లోకి ఎత్తిపోసే ఏర్పాటు చేశారు. ఆలయ సమీపంలో నదీ పాయపై నిర్మించిన చెక్‌డ్యాం జలకళను సంతరించుకుంది. మంజీరా నదీ పాయల్లో పలు చోట్ల ఏర్పాటు చేసిన షవర్‌లకు కనెక్షన్ ఇచ్చి అక్కడ భక్తులు స్నానాలు చేసేందుకు ఏర్పాటు చేశారు. కాగా మాఘ అమావాస్య రోజు సహజంగా ప్రవహించే నదీ నీటిలో స్నానం ఆచరిస్తే పుణ్యప్రదమని భావిస్తారు. అయితే నీటి కొరత కారణంగా ఈ సారి అందుకు అవకాశం లేకపోవడం భక్తులను నిరాశకు గురిచేస్తోంది. వేలాది మంది భక్తులు తరలిరానుండగా షవర్ల కింద, చెక్‌డ్యాంలో, నదీ పాయాల మడుగుల్లో నిల్వ ఉన్న నీటిలో స్నానాలు చేయడం ఇబ్బందికరమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఏసీపీ

సిద్దిపేట, వెలుగు: సిద్దిపేట మండలం పుల్లూరులో ప్రారంభమయ్యే జాతర సందర్భంగా ఏర్పాట్లను ఏసీపీ రామేశ్వర్ పరిశీలించారు. ఆదివారం పుల్లూరు శ్రీలక్ష్మినరసింహాస్వామి ఆలయాన్ని సందర్శించి క్యూలైన్లను పరిశీలించారు. ఆలయ పరిసరాలను పరిశీలించి సలహా సూచనలు చేశారు. ఏసీపీ మాట్లాడుతూ జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

మినీ పార్క్ పనుల ప్రారంభం

పుల్లురూ బండపై మినీ పార్క్ ఏర్పాటుపై ఆదివారం పనులను ప్రారంభించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు సుడా అధికారులు భూమిని చదును చేసి మొక్కలు నాటారు. జాతర ప్రారంభం నాటికి ఆలయ పరిసరాల్లో పచ్చదనం వెల్లివిరిసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వెంకటనరసింహాచార్యులు, కృష్ణమాచార్యులు, రంగాచారి, సర్పంచ్ నరేష్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

వనం.. ఈమెకు ఆరో ప్రాణం



గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ప్రచారానికి దూరంగా ప్రకృతి సేవ చేస్తున్నవారికి పద్మశ్రీ దక్కింది. తెలంగాణకు చెందిన వనం రామయ్యకు పోయినసారి పద్మశ్రీ ప్రకటించగా, ఈ ఏడాది జార్ఖండ్‌లో అడవుల సంరక్షణ, మొక్కల పెంపకం జరుపుతున్న జమున తుడుకి లభించింది. స్థానిక ప్రజలు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేలా జమున ఉద్యమిస్తున్నారు.

ఈ ఏడాది పద్మశ్రీ అందుకున్నవారిలో ఆదివాసీ పర్యావరణ ఉద్యమకారిణి 'జమున తుడు' కూడా ఒకరు. అడవుల రక్షణకు కృషి చేస్తున్న ఆమెను ఈ అవార్డు వరించటం అడవిలో ఒక పద్మం వికసించడంగా భావించవచ్చు. ప్రకృతిని అమితంగా ప్రేమించే జమునకు అడవి అంటే ఆరో ప్రాణం. జార్ఖండ్‌లో చెట్లను నరికి, అక్రమంగా రవాణా చేసే ముఠాలకు, దుండగులకు ఆమె పేరు చెబితే హడల్.

టింబర్ మాఫియా ఆగడాలకు దీటుగా అడ్డుకట్ట వేస్తున్న జమునను 'జార్ఖండ్ లేడీ టార్జాన్'గా పిలుచుకుంటారు. పర్యావరణ పరిరక్షణ కోసం సాహసాలు చేసేందుకు సైతం ఆమె ఏమాత్రం వెనకాడరు. అడవి తల్లికి హాని తలపెట్టేవారిని రెడ్ హ్యాండెడ్‌గా ప్రభుత్వానికి పట్టిస్తారు. జమునలోని ఈ చైతన్యం, ధైర్యం ఉద్యమం దిశగా సాగాయి. వన రక్షణ దళాల ఏర్పాటుకు పురికొల్పాయి. ఆమె సేవలకు గుర్తుగా దేశంలోనే నాలుగో అత్యున్నత పౌర పురస్కారం దక్కటం సంతోషించాల్సిన విషయం.

జమున స్వరాష్ట్రం ఒడిశా అయినా పెళ్లయిన తర్వాత జార్ఖండ్‌లోని ఈస్ట్ సింగ్బం జిల్లా ముతుర్ఖామ్ గ్రామంలో స్థిరపడ్డారు. సుమారు 300 మహిళా సంఘాలను ఏర్పాటు చేసి అడవులను పరిరక్షిస్తున్నారు. ఒక్కో గ్రూపులో 30 మంది ఆడవాళ్లు ఉంటారు. ఆ టీమ్‌లను మూడు కేటగిరీలుగా విభజించి బాధ్యతలను అప్పగిస్తారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో వాళ్లు బాణాలు, కర్రలు చేతపట్టుకొని అడవికి కాపలా కాస్తుంటారు. వాళ్ల తెగింపు చూసి దుంగల దొంగలు తోక ముడవాల్సిందే.

జమున పుట్టింది పెరిగింది గిరిజన ప్రాంతం కావటంతో అడవుల వల్ల గిరిజనులకు, సమాజానికి, పర్యావరణానికి కలిగే ప్రయోజనాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల్లోని భారీ చెట్లను ఇష్టమొచ్చిన రీతిలో తెగనరికి, ఆ కలపను ఇల్లీగల్‌గా తరలిస్తుండటాన్ని చూసి ఆమె చలించిపోయారు. అడవులను స్మగ్లర్ల హస్తాల నుంచి కాపాడే బాధ్యతను తన భుజాల మీద వేసుకున్నారు. ఆడపిల్ల పుడితే 18 చెట్లను నాటాలని స్థానిక ప్రజలకు సూచించారు. పెళ్లయ్యే నాటికి కనీసం పది మొక్కలను పెంచాలనే పద్ధతిని ప్రవేశపెట్టారు.


1998లో 'వన సురక్షా సమితి'ని ఐదుగురు స్త్రీలతో ప్రారంభించారు. రెండు దశాబ్దాలకుపైగా వీటిని విజయవంతంగా నడిపిస్తున్నారు. సమితి ఏర్పాటు సమయంలో జమునకు ఎన్నో బెదిరింపులు వచ్చాయి. దుండగులు ఓసారి ఆమె ఇంటిని దోచుకున్నారు. మరోసారి జరిగిన దాడిలో జమున ప్రాణాలు పోయే పరిస్థితి ఎదురైంది. తృటిలో బయటపడ్డారు. ఈ విధంగా ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఆమె వెనుదిరిగి చూడలేదు. భయపడలేదు. చివరి శ్వాస వరకు చెట్ల రక్షణ కోసమే పనిచేస్తానని చెబుతున్నారు. జమున పోరాటం అందరికీ ఆదర్శం.

- గుమ్మడి లక్ష్మీనారాయణ
ఆదివాసీ రచయితల సంఘం



మీరూ రాయొచ్చు!
సమాజాన్ని ప్రభావితం చేసే వేర్వేరు అంశాలమీద మీ అభిప్రాయాలను ఆర్టికల్ రూపంలో పంపవచ్చు. openpage@v6velugu.com

పెద్ద కులాల్లోని పేదలకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల పది శాతం కోటాను ప్రకటించింది. దీనికి దీటుగా తమను గెలిపిస్తే పేదలందరికీ కనీస ఆదాయం కల్పిస్తామని కాంగ్రెస్ ప్రెసిడెంట్ రాహుల్ గాంధీ అంటున్నారు. దేశంలో పేదరిక నిర్మూలనకు ఇప్పటికే చాలా పథకాలు అమలవుతున్నాయి. ఫలానా వాళ్లు పేదలు అనటానికి ఒక్కో స్కీంలో ఒక్కో స్కేల్‌ని లెక్కలోకి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 'అసలు.. పేదలంటే ఎవరు' అనే ప్రశ్న రాకమానదు. 'పావర్టీ లైన్ కాన్సెప్ట్' పుట్టుపూర్వోత్తరాలను పరిశీలిస్తే గానీ ఒక అవగాహన రాదు.



అసలు.. పేదలంటే ఎవరు?

ప్రపంచంలోని మొత్తం పేదల్లో మూడో వంతుకు పైగా ఇండియాలోనే ఉన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలోని పూర్ పీపుల్‌ని కూడా కలిపితే వరల్డ్‌లోని దాదాపు సగం దారిద్ర్యం కేవలం ఈ మూడు దేశాల్లోనే కనిపిస్తుంది. మన దేశంలో పావర్టీ ఎస్టిమేషన్ వివాదాస్పద అంశంగా మిగిలిపోతోంది. చారిత్రకంగా చూస్తే మొదటిసారిగా 19వ శతాబ్దంలో 'గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా' దాదాభాయ్ నౌరోజీ పావర్టీ లైన్ అంచనాకి ఒక ప్రక్రియ మొదలుపెట్టారు. అయితే, ఆయన పావర్టీ లైన్ అనే పదాన్ని మాత్రం వాడలేదు.

దాదాభాయ్ నౌరోజీ

విద్యావేత్త, మేధావి, వ్యాపారి, తొలి తరం సోషియో పొలిటికల్ లీడర్ అయిన నౌరోజీ.. పావర్టీ ఎస్టిమేషన్‌కి ఎంతో కృషి చేశారు. ఎన్నో అంశాలను లోతుగా చదివారు. 1867-68 నాటి ధరలను పరిగణనలోకి తీసుకొని 'జీవన ఆధారిత పేదరిక రేఖ (సబ్సిస్టెన్స్ బేస్డ్ పావర్టీ లైన్)'పై క్లారిటీకి వచ్చారు. బతకడానికి కావలసిన ఆహార పదార్థాలైన ఉప్పు, పప్పు, బియ్యం, కూరగాయలు, మాంసం, నూనె, పాలు, పెరుగు, నెయ్యి వంటి సరకుల రేట్లను బేస్ చేసుకున్నారు. అప్పట్లో దేశంలో తలసరి వార్షికాదాయం రూ.16 నుంచి రూ.35 వరకు ఉన్నట్లుగా గుర్తించారు. ఇది దేశమంతా ఒక్క తీరుగా లేదు. బ్రిటిషర్ల దేశమైన ఇంగ్లాండ్‌లో సంవత్సరానికి పర్ క్యాపిటా ఆదాయం 450 రూ.లుగా ఉంది. అంటే, బ్రిటిషర్ల హయాంలో ఇండియన్ల కొనుగోలు శక్తి దాదాపు 15 రెట్లు తక్కువనే చెప్పాలి. ఇండియాలో పరిస్థితులు, ఆహారపు అలవాట్ల రీత్యా 100-150 రూ.లు నడుమ పర్ క్యాపిటా ఆదాయం ఉండాలని కోరుకున్నారు. అంతకన్నా తక్కువ ఉన్నవాళ్లను కొనుగోలు శక్తి లేని పేదలుగా గుర్తించాలని సూచించారు.

నేషనల్ ప్లానింగ్ కమిటీ

1938లో కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ సుభాష్ చంద్ర బోస్ దీన్ని ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా జవహర్‌లాల్ నెహ్రూ, సెక్రటరీగా ప్రొఫెసర్ కేటీ షా వ్యవహరించారు. పేదలకు తగిన జీవన ప్రమాణాలను అందించటానికిగాను ఎకనామిక్ ప్లాన్ సూచించటమే ఈ కమిటీ లక్ష్యం. యుద్ధం ముందు నాటి ధరలను (ప్రీ-వార్ ప్రైసెస్) బట్టి కనీస తలసరి నెలవారీ ఆదాయం రూ.15 నుంచి రూ.25 వరకు (వార్షికాదాయం సుమారుగా 300 రూ.లు పర్ క్యాపిటా) ఉండాలని, అంతకన్నా తక్కువ ఉన్నవాళ్లను పేదలుగా గుర్తించాలని సిఫారసు చేసింది. ఈ కమిటీ కూడా దారిద్ర్య రేఖపై కచ్చితమైన అంచనాకు రాలేకపోయింది.

ఫస్ట్ ప్లానింగ్ కమిషన్ వర్కింగ్ గ్రూప్

పావర్టీ లైన్ కాన్సెప్ట్‌ని తొలిసారిగా ఈ గ్రూపే 1962లో ప్రవేశ పెట్టింది. 1979లో ఓ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైంది. 1960-61 ధరలను బట్టి ఐదుగురు సభ్యులున్న కుటుంబానికి నెలకు కనీస తలసరి ఆదాయం గ్రామాల్లో రూ.100; పట్టణాల్లో రూ.125 ఉండాలని రికమెండ్ చేసింది. ఇందులో ఆరోగ్యం, విద్యకు అయ్యే ఖర్చులను మినహాయించింది. వాటిని ప్రభుత్వమే అందించాలని సూచించింది.

వై.కె.అలగ్ కమిటీ

1979 వరకు పేదరికం అంచనాకి సంబంధించి... కనీస ఆదాయం లేకపోవటం అనే కోణంలోనే వ్యవహరించేవారు. కానీ, ఈ సంఘం ఒక కొత్త అంశాన్ని తెరపైకి తెచ్చింది. ఎంత మందికి తిండి దొరుకుతోంది? ఎంత మంది ఆకలితో అలమటిస్తున్నారు? అనే ప్రమాణాల ఆధారంగా పేదరికాన్ని కరెక్ట్‌గా అంచనా వేయొచ్చని ప్రతిపాదించింది. పట్టణ ప్రజలు 2100 క్యాలరీల కన్నా ఎక్కువ, పల్లె జనాలు 2400 క్యాలరీల కన్నా ఎక్కువ పోషకాలను తీసుకోలేకపోతే వాళ్లను పేదలుగా నిర్ధారించింది. అర్బన్ పీపుల్‌తో పోల్చితే రూరల్ ఏరియా వాళ్లు శారీరకంగా శ్రమిస్తారు కాబట్టి 300 క్యాలరీలు ఎక్కువ తీసుకుంటారని వివరించింది. ఆరోగ్యం, విద్య అందించాల్సిన బాధ్యతను ఈ కమిటీ కూడా సర్కార్‌పైనే వేసింది. ఈ విధంగా వై.కె.అలగ్ కమిటీ తొలిసారిగా దారిద్ర్య రేఖ (పావర్టీ లైన్)కి ఒక నిర్వచనం చెప్పింది.

లక్డావాలా ఫార్ములా

1993లో లక్డావాలా కమిటీ ఇచ్చిన ప్రతిపాదనల ఆధారంగానే 2011 వరకు అధికారిక పావర్టీ లైన్‌ని అమలు చేశారు. అలగ్ కమిటీ చెప్పిన క్యాలరీల లెక్కలతోపాటు గూడు, గుడ్డ కూడా సమకూర్చుకోగలిగేవాళ్లు పేదలు కాదని లక్డావాలా సూత్రీకరించారు. కుటుంబ తలసరి కొనుగోలు శక్తిని బట్టి దారిద్ర్య రేఖను నిర్వచించారు. 'కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ లేబర్స్ (సీపీఐ-ఐఎల్)', 'కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ అగ్రికల్చరల్ లేబర్స్ (సీపీఐ-ఏఎల్)'లను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ సూత్రం ప్రకారం దేశంలో పేదల సంఖ్య దాదాపు రెట్టింపవుతోంది. 1993-94లో పావర్టీ లైన్‌కి దిగువన 16 శాతం మంది ఉండగా, లక్డావాలా లెక్కల్లో ఆ పర్సంటేజీ 36.3కి చేరింది.

సురేష్ టెండూల్కర్ కమిటీ

ఈ కమిటీని ప్లానింగ్ కమిషన్ 2005లో నియమించింది. ఇది పేదరికాన్ని గుర్తించటానికి జీవన వ్యయాన్ని అడాప్ట్ చేసుకుంది. ప్రస్తుతం పేదరికం అంచనాలకు ఈ సిఫారసులనే ఆధారంగా చేసుకుంటున్నారు. పావర్టీ ఎస్టిమేషన్‌కి ఈ కమిటీ క్యాలరీ బేస్డ్ మోడల్‌ని లెక్కలోకి తీసుకోలేదు. దానికి బదులుగా ఒక కుటుంబం విద్య, ఆరోగ్యం, విద్యుత్, రవాణాలకు నెలవారీగా చేస్తున్న ఖర్చును పరిగణనలోకి తీసుకుంది. రూరల్, అర్బన్ రీజియన్లకు ఒకే రకమైన పావర్టీ బాస్కెట్ లైన్ ఉండాలని సూచించింది. రోజువారీ తలసరి వ్యయం గ్రామాల్లో రూ.27, పట్టణాల్లో రూ.33 చేయలేనోళ్లు పేదలని ఈ ప్యానెల్ తేల్చింది. దీని ప్రకారం 22 శాతం మంది దారిద్ర్య రేఖ దిగువ (బీపీఎల్ కేటగిరీ)కి వచ్చారు.

విదేశాల్లో ఎలా లెక్కిస్తున్నారు?

యూరోపియన్ దేశాల్లో కుటుంబ నికరాదాయంలో కనీసం 60 శాతానికి మించి ఖర్చు చేయలేనివాళ్లను పేదలుగా పరిగణిస్తారు. అమెరికాలో ఒక కుటుంబం తిండికి పెట్టే ఖర్చును మూడుతో గుణిస్తే వచ్చే మొత్తం ఆధారంగా దారిద్ర్య రేఖను నిర్ణయిస్తారు. ఆహారానికి చేసే ఖర్చు కంటే మూడింతలు ఎక్కువగా ఆదాయం ఉన్నట్లయితే వారిని పేదలుగా గుర్తించరు.

ఎందువల్ల ఇన్ని తేడాలు?

పేదరికం అనే అంశం ఆర్థికంగానే కాకుండా రాజకీయంగా కూడా చాలా సున్నితమైంది. కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం అన్నట్లు ఉంటుంది. పేదలను నిర్ణయించేందుకు సంపాదనని ఎక్కువగా చూపితే నిజమైన అర్హులను వదిలేసినట్లవుతుంది. ఒకవేళ తక్కువ తీసుకుంటే ప్రభుత్వ ఖజానాపై భారం పడుతుంది. రాష్ట్రాల మధ్య దారిద్ర్య నిర్వచనంపై ఏకాభిప్రాయం లేకపోవటమూ ఒక సమస్య. ఒడిశా, పశ్చిమ బెంగాల్ టెండూల్కర్ కమిటీ సిఫారసులకు ఓకే అంటుంటే... ఢిల్లీ, జార్ఖండ్, మిజోరాం తదితర రాష్ట్రాలు రంగరాజన్ రికమండేషన్లు కావాలంటున్నాయి. పిల్లి మెడలో గంట కట్టేందుకు నీతిఆయోగ్ కూడా ముందుకు రాలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రంగరాజన్ కమిటీ

టెండూల్కర్ కమిటీ పేదల సంఖ్యను తక్కువగా చూపటంపై అన్ని వర్గాలు మండిపడ్డాయి. ఆ డేటా వాస్తవ విరుద్ధమంటూ తోసిపుచ్చాయి. దీంతో ప్రభుత్వం మరో కమిటీని ఏర్పాటు చేసింది. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ సి.రంగరాజన్ ఆధ్వర్యంలోని ఈ కమిటీ పావర్టీ ఎస్టిమేషన్ మెథడాలజీని సమీక్షించింది. టెండూల్కర్ కమిటీ చెప్పిన రోజువారీ తలసరి వ్యయాలను రంగరాజన్ కమిటీ గ్రామాల్లో రూ.32, పట్టణాల్లో రూ.47కి పెంచింది. దీంతో పేదల సంఖ్య 30 శాతానికి వచ్చింది. కొత్త కమిటీ ఈక్వేషన్‌ని బట్టి 2011-12లో దేశంలో పేదలు 36.3 కోట్లుగా తేలింది.

అర్వింద్ పనగరియా టాస్క్‌ఫోర్స్

రంగరాజన్ కమిటీ రికమండేషన్లపైనా విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఎన్‌డీఏ గవర్నమెంట్ ఈ కమిటీ రిపోర్ట్‌ని బుట్టదాఖలు చేసింది. దారిద్ర్య రేఖకు యాక్చువల్ డెఫినిషన్ ఇవ్వటానికి నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అర్వింద్ పనగరియా ఆధ్వర్యంలో 14 మంది సభ్యులతో టాస్క్‌ఫోర్స్‌ని ఏర్పాటు చేసింది. ఈ బృందం ఏడాదిన్నరపాటు పనిచేసి చేతులెత్తేసింది. స్పెషలిస్టులతో మరో ప్యానెల్‌ని నియమించాలని 2016 సెప్టెంబర్‌లో సూచించింది. పనగరియా టాస్క్‌ఫోర్స్ కూడా టెండూల్కర్ కమిటీ సూచనలనే సపోర్ట్ చేసినట్లు సమాచారం.

తెలంగాణ సాహిత్యానికి సరికొత్త వెలుగు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత భాష, సంస్కృతి, సాహిత్య విషయాల్లో మరింత లోతుగా తరచి చూసుకోవాల్సిన సందర్భం వచ్చింది. ఆ బాధ్యతను తెలంగాణ సాహిత్య అకాడెమీ భుజానకెత్తుకుంది. తెలంగాణ సాహిత్యం గొప్పదనాన్ని శోధించడం, రికార్డు చేయడం, విస్తరింపజేయడం వంటి లక్ష్యాలతో ముందుకెళుతోంది. హిందీ, ఇంగ్లిషు సహా అనేక భాషల్లోకి అనువదించి తెలంగాణ సాహిత్యాన్ని, సమాజాన్ని ప్రపంచ పాఠకులకు పరిచయం చేయదలిచింది.

సాహిత్యం.. సమాజానికి అద్దం పడుతుంది. సమాజానికి దారి చూపుతుంది. ఇలాంటి సందర్భాలు సాహిత్య చరిత్రలో ఎన్నో. 1917 సోవియట్ బోల్షివిక్ విప్లవం, 1949 రెడ్ ఆర్మీ లాంగ్ మార్చ్ అంతర్జాతీయ ఉదాహరణలు కాగా.. నక్సల్‌బరీ, గోదావరి లోయ పోరాటాలు, 1945-50 సాయుధ పోరాటం, మలి దశ తెలంగాణ ఉద్యమం దేశీయ, స్థానిక ఉదాహరణలు. మార్క్స్ మిగులు విలువ సిద్ధాంతం భాషలకతీతంగా సాహిత్యకారులను ప్రభావితం చేసింది. సామాజిక ఉద్యమాలకు ఊతమిచ్చింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మన మూలాల్ని మరింత లోతుగా తరచి చూసుకోవాల్సిన సందర్భం వచ్చింది. దానికి గుర్తుగా ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించారు. వాస్తవ కార్యాచరణ కోసం తెలంగాణ సాహిత్య అకాడెమీ పనిచేస్తోంది. 2017 మే 2న ఏర్పడిన ఈ అకాడెమీ తెలంగాణ సాహిత్యం గొప్పదనాన్ని శోధించడం, రికార్డు చేయడం, విస్తరింపజేయడం వంటి లక్ష్యాలతో ముందుకెళుతోంది. తెలంగాణ మలి దశ ఉద్యమంలో సాహిత్యకారులకు దిశానిర్దేశం చేసిన డాక్టర్ నందిని సిధారెడ్డి.. అకాడెమీకి నాయకత్వం వహిస్తున్నారు.

జిల్లాల సాహిత్య చరిత్రలు: జిల్లాల పునర్విభజన రాష్ట్ర పాలనలో గొప్ప మార్పు. నూతన జిల్లాలకు ప్రజలు మానసికంగా చేరువవుతున్నారు. ఈ నేపథ్యంలో 31 జిల్లాలకు నూతన సాహిత్య చరిత్రలు అవసరమయ్యాయి. వాటిని రాయించే కార్యక్రమాన్ని అకాడెమీ చేపట్టి, ప్రముఖ రచయితలకు ఆ బాధ్యతలను అప్పగించింది. ఏ జిల్లా సాహిత్య చరిత్రను ఆ జిల్లా రచయితతోనే రాయిస్తుండటం వల్ల అవి ఆత్మీయంగా, సమగ్రంగా ఉంటాయి.

అనువాదాలు: తెలంగాణ కవిత్వాన్ని, కథలను ఎంపిక చేసి హిందీ, ఇంగ్లిష్ భాషల్లోకి అనువాదం చేయించే పని మొదలైంది.. తద్వారా జాతీయ, అంతర్జాతీయ పాఠకులకు కూడా రాష్ట్ర సాహిత్యం పరిచయం కానుంది. మరిన్ని భాషల్లోకి తెలంగాణ సాహిత్యం విస్తరించాలనేది అకాడెమీ ఆకాంక్ష. ఈ దిశగా చాలా కృషి జరుగుతోంది. ఈ ఏడాదిలో పూర్తి అవుతుంది.

సాహిత్య సూచీ: ఇప్పటివరకు తెలుగు సాహిత్యంలో వచ్చిన అన్ని గ్రంథాల సమాచారాన్ని సేకరించి, క్రోడీకరించి, భద్రపరచడానికి అకాడెమీ శ్రీకారం చుట్టింది. తద్వారా భవిష్యత్ సాహిత్య పరిశోధనలకు మేలు కలుగుతుంది. రచయిత, పుస్తకం పేరు; సాహిత్య ప్రక్రియ, పుస్తకంలోని పేజీలు, బుక్ రేటు; పబ్లిషింగ్, ప్రింటింగ్ సంస్థలు తదితర వివరాలను నమోదు చేస్తున్నారు.

పబ్లికేషన్లు: అకాడెమీ ప్రధాన లక్ష్యాల్లో పబ్లికేషన్ ఒకటి. మౌలిక గ్రంథాలను పబ్లిష్ చేయటం, అరుదైన గ్రంథాలను రీప్రింట్ చేయటం, పరిశోధనాత్మక రచనలను వెలుగులోకి తేవటానికి పాటుపడుతోంది. మాదిరెడ్డి సులోచన కథలు, నందగిరి ఇందిరాదేవి కథలు ఇలా పబ్లిష్ అయినవే. సర్వజ్ఞ సింగ భూపాలుడి రసార్ణవ సుధాకరం, రాళ్లబండి రాఘవశర్మ రైతు రుణ విముక్తి వంటి అరుదైన గ్రంథాలను రీప్రింట్ చేశారు. తెలంగాణలో భావ కవితా వికాసం, లోక మలహరి నవలలు శోధనాత్మక ప్రచురణలు. తెలంగాణ సాయుధ పోరాట కథలు, హైదరాబాద్ కథలు, హైదరాబాద్ ప్రభుత్వం పబ్లిష్ చేసిన కథలు, గంగాపుర మహాత్మ్యం, వజ్జాలగ్గం వంటి ప్రాచీన కావ్యాలను, ప్రతాపరుద్ర చరిత్రం లాంటి చారిత్రక రచనలను అకాడెమీ వెలుగులోకి తెచ్చింది.

కావ్య పరిమళం: సాహిత్యాభిమానులకు విశిష్ట కావ్యాలను లోతుగా పరిచయం చేయాలనే లక్ష్యంతో ప్రతి నెలా రెండో శుక్రవారం సాయంత్రం ఒక ప్రసిద్ధ కావ్యంపై నిష్ణాతులతో ఉపన్యాసాలను ఏర్పాటు చేస్తోంది. బసవ పురాణం, రంగనాథ రామాయణం, శ్రీమద్భాగవతం, చిత్ర భారతం, యయాతి చరిత్ర, కాపుబిడ్డ, గంగిరెద్దు, రైతు రామాయణం వంటి కావ్యాలపై అనుమాండ్ల భూమయ్య, కసిరెడ్డి వెంకటరెడ్డి, గన్నమరాజు గిరిజా మనోహరబాబు, శ్రీరంగాచార్య, సంగనభట్ల నరసయ్య, రవ్వా శ్రీహరి, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, గుమ్మనగారి బాలశ్రీనివాసమూర్తి, గండ్ర లక్ష్మణరావు తదితరులు ప్రసంగించారు. ఈ ప్రసంగాలను వీడియోల రూపంలో యూట్యూబ్‌లో ఉన్నాయి.

సదస్సులు, శిక్షణలు: కథ, కవిత్వం, నవలల రచనలపై శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. తొలిసారిగా 2018 ఫిబ్రవరి 8, 9 తేదీల్లో రవీంద్ర భారతిలో ఈ కార్యక్రమం జరిగింది. కాలేజీలు, యూనివర్సిటీలు, సాహిత్య, సాంస్కృతిక సంఘాల ద్వారా అనేక శిక్షణ తరగతులను, సదస్సులను నిర్వహించి, పుస్తకాలను పబ్లిష్ చేసింది.

పునాస: యువ రచయితలను, కవులను ప్రోత్సహించేందుకు సృజనాత్మక రచనలతో కూడిన సాహిత్య త్రైమాసిక 'పునాస'ను అకాడెమీ ప్రచురిస్తోంది. ఇందులో కవిత, కథ, వ్యాసం, సమీక్ష, అనువాదాలకు చోటు కల్పిస్తోంది. ప్రముఖ కవుల, రచయితల జయంతులు, వర్ధంతుల సందర్భాల్లో స్ఫూర్తిదాయక సమావేశాలను ఏర్పాటు చేస్తోంది. పండుగ రోజుల్లో కవి సమ్మేళనాలను నిర్వహిస్తోంది. ప్రపంచ తెలుగు మహా సభల స్ఫూర్తి, అకాడెమీ కార్యక్రమాలతో తెలంగాణ రాష్ట్రంలో మంచి సాహిత్య వాతావరణం నెలకొంది.



ఏనుగు నరసింహారెడ్డి
తెలంగాణ సాహిత్య అకాడెమీ కార్యదర్శి

ఏమన్నారంటే



క్యా బడ్జెట్ హై

ఇండియా మధ్యంతర బడ్జెట్ సూపర్. ఖర్చులను ఎంకరేజ్ చేసేలా ఉంది. పాజిటివ్ ఇష్యూలు పుష్కలంగా ఉన్నాయి. టార్గెట్స్ కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.

- నిషా దేశాయ్, యూఎస్ఐబీసీ ప్రెసిడెంట్



'ఆప్'తో పొత్తు నై

లోక్‌సభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)తో పొత్తు పెట్టుకోం. ఇదే మాకు ప్లస్సూ, మైనస్సూ. ఆ విషయాన్ని పార్టీ చూసుకుంటుంది. గెలుపోటములు సహజం.

- షీలాదీక్షిత్, ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్



దు'భాయీ భాయీ'..

ప్రపంచ ప్రజల్లో అన్నదమ్ముల భావనను పెంపొందించే చిహ్నంలా దుబాయ్ నిలుస్తోంది. ఓపికకు, సహనానికీ గుర్తుగా ఉండేందుకు కృషి చేస్తోంది.

- పోప్ ఫ్రాన్సిస్, క్రైస్తవ మత గురువు



గోయెల్.. 'డోల్ బాజే'

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఢిల్లీ బీజేపీ శాఖ అప్పడే శ్రీకారం చుట్టింది. అరవింద్ కేజ్రీవాల్ పాలన నుంచి ఢిల్లీని కాపాడాలని పిలుపునిస్తూ 'డోల్ ఆందోళన్'ను ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని జాతీయ రాజధాని నగర ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళుతోంది. ఇందులో భాగంగా ఆదివారం జేజే క్లస్టర్స్ ఏరియాలో మెడలో డోలు తగిలించుకొని వాయిస్తున్న కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర మాజీ ప్రెసిడెంట్ విజయ్‌గోయెల్.

టాకీస్

గప్‌చుప్



సల్మాన్ ఖాన్ పోలీసాఫీసరుగా నటించిన 'దబాంగ్ 1, 2' చిత్రాలు ఎంత పెద్ద హిట్టయ్యాయో తెలిసిందే. ఇప్పుడు 'దబాంగ్ 3' మొదలవుతోంది. దీనిలో కూడా సల్మాన్, సోనాక్షి సిన్హాయే ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ కోసం కరీనాని సంప్రదించాలనుకుంటున్నారని సమాచారం. 'దబాంగ్ 2'లో ఆమె డ్యాన్స్ చేసిన ఫెవికాల్ సాంగ్ సెన్సేషనల్ హిట్టయ్యింది. ఆ పాటకు కరీనా వేసిన స్టెప్పులకు అప్పట్లో చాలామంది ఫిదా అయిపోయారు. దాంతో ఈ చిత్రంలో కూడా ఆమెతో ఒక పాట చేయించాలనుకుంటున్నారట. నిజమో కాదో. ఒకవేళ నిజమే అయితే కరీనా ఒప్పుకుంటుందో లేదో.

ట్విటర్ టాక్



"ప్రతి అమ్మాయికీ తనకెలాంటి భాగస్వామి కావాలో ఒక అంచనా ఉంటుంది. నాకలాంటి అంచనాలు లేకపోయినా ఒక అద్భుతమైన భాగస్వామి దొరికాడు. తను నా బెస్ట్ ఫ్రెండ్. ఓ మంచి సపోర్ట్. కన్నీళ్లొస్తే తుడవడానికి అతని చెయ్యి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. కానీ ఇంత వరకూ ఆ అవసరమే రాలేదు. ఎందుకంటే అతను నా జీవితంలోకి వచ్చాక నా పెదవులపై నవ్వు ఎప్పుడూ చెరగలేదు."

- జెనీలియా

ఈవెంట్



శివ కంఠంనేని ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'అక్కడొకడుంటాడు'. రామ్ కార్తీక్, శివ హరీష్, అలేఖ్య, రసజ్ఞ దీపిక హీరో హీరోయిన్లు. శ్రీపాద విశ్వక్ దర్శకుడు. లైట్‌హౌస్ సినీ మ్యాజిక్ పతాకంపై కె.శివశంకరరావు, రావుల వెంకటేశ్వరరావు నిర్మించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమాకి లభిస్తోన్న ప్రేక్షకాదరణ గురించి తెలియజేసేందుకు చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఆ సందర్భంగా తీసిన ఫొటో.

1980 బ్యాక్‌డ్రాప్‌తో కల్కి



రాజశేఖర్ హీరోగా ప్రశాంత్ వర్మ రూపొందిస్తోన్న చిత్రం 'కల్కి'. శివానీ శివాత్మిక మూవీస్ సమర్పణలో హ్యాపీ మూవీస్ పతాకంపై సి.కళ్యాణ్ నిర్మిస్తున్నారు. ఈరోజు రాజశేఖర్ పుట్టినరోజు సందర్భంగా ఒకరోజు ముందుగా టీజర్‌ని విడుదల చేసి, బర్త్ డే వేడుక నిర్వహించారు. ఆ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ... 'గరుడవేగ తర్వాత ఏదైనా డిఫరెంట్ మూవీ చేయాలని ఆరు నెలల పాటు స్క్రిప్ట్ కోసం వెయిట్ చేశాం. ఈ సినిమా సెట్టయ్యాక కూడా ప్రశాంత్ వర్మ డేట్స్ కోసం కొన్నాళ్లు ఆగాల్సి వచ్చింది. చాలా గ్యాప్ తర్వాత సి.కళ్యాణ్ బ్యానర్లో నటిస్తున్నాను. దాసరి గారి తర్వాత నన్ను అంత సపోర్ట్ చేసిన వ్యక్తి. ఆయనతో పని చేయడం సంతోషంగా ఉంది. గరుడవేగ సమయంలో సినిమా గురించి నేనేమీ మాట్లాడలేదు. ఆ సినిమా హిట్టయ్యింది. ఈ సినిమా గురించి కూడా ఏమీ మాట్లాడను. హిట్టయ్యాకే మాట్లాడతాను' అన్నారు. సి.కళ్యాణ్ మాట్లాడుతూ... ''కల్కి మొదటి ప్రెస్ మీట్ ఇది. డెబ్భై శాతం షూటింగ్ పూర్తయ్యింది. మిగతాది కూడా మార్చికల్లా పూర్తి చేస్తాం. నెక్స్ట్ షెడ్యూల్ కర్ణాటక, తమిళనాడులో ఉంటుంది. 1980 బ్యాక్ డ్రాప్‌లో సాగే డిఫరెంట్ కాన్సెప్ట్ మూవీ. పూర్తి బాధ్యతలు దర్శకుడు ప్రశాంత్ వర్మపైనే ఉంచాం. రాజశేఖర్, శ్రీహరి వల్లే నేనీ స్థాయికి ఎదగగలిగాను. చిన్న సినిమాలు చేసుకుంటోన్న నన్ను 'గోరింటాకు'తో పెద్ద నిర్మాతని చేశారు రాజశేఖర్. వారి కుటుంబంలో నేనూ సభ్యుడిలాంటోడిని' అన్నారు. ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ... ''అ మూవీ తర్వాత మళ్లీ ఏదైనా డిఫరెంట్ కాన్సెప్ట్ మూవీ చేయాలనుకున్నాను. అదే ఈ 'కల్కి'. అందరూ అనుకున్నట్టు రాజ శేఖర్ సీరియస్‌గా ఉండరు. చాలా జోవియల్. అందుకే స్క్రిప్ట్ రాసినప్పుడు ఆయన పాత్రను సీరియస్‌గా డిజైన్ చేసిన నేను, ఆయనతో కొన్నాళ్లు ట్రావెల్ అయ్యాక కాస్త మార్చాను. ఆయన చాలా పోలీస్ పాత్రలు చేశారు. అవన్నీ సీరియస్‌గానే ఉంటాయి. ఇందులో మాత్రం నవ్వుతూ కనిపిస్తారు. ఈ మూవీ కోసం డెబ్భై డ్రాఫ్ట్స్ రాశాను ఎంతో ఎఫర్ట్ పెట్టి తీస్తున్నాం. ఇది పక్కా కమర్షియల్ సినిమాయే కానీ రెగ్యులర్ ఫార్మాట్‌తో ఉండదు. ఓ ప్రత్యేక ఫార్మాట్ ఉంది. నా మొదటి సినిమా కొందరికి అర్థం కాలేదు. ఈ సినిమా మాత్రం అందరికీ అర్థమవుతుంది. దీనికి సీక్వెల్ కూడా ఉంటుంది. వీలైతే రాజశేఖర్ గారి నెక్స్ట్ బర్త్‌డేకి మొదలు పెడతాం. బర్త్ డే సందర్భంగా ఆయనకి యాంగ్రీ స్టార్ అనే బిరుదునిస్తున్నా' అన్నారు. జీవిత మాట్లాడుతూ... ''అధోపాతాళంలో ఉన్న మమ్మల్ని గరుడవేగ మళ్లీ పైకి తెచ్చింది. ఎన్ని ఆస్తులున్నా కెరీర్‌ని, సక్సెస్‌ని కొనుక్కోలేం. గరుడవేగ సక్సెస్ ప్రవీణ్ సత్తారు మ్యాజిక్. ఇప్పుడున్న పరిస్థితుల్లో సినిమా తీయడం చాలా కష్టం. మహిళగా మరీ కష్టం. అలాంటి సిట్యుయేషన్లో ప్రశాంత్‌ని ఒప్పించడమే నా మొదటి సక్సెస్. ఫైనాన్స్ విషయం కళ్యాణ్‌గారితో మాట్లాడాను. నువ్వు సినిమాలు తీసి చాలా డబ్బు పోగొట్టుకున్నావ్, ఇక వద్దు అంటూ ఆయనే తీయడానికి ముందుకొచ్చారు. అందుకే నేను ఆయన్ని మాత్రమే అన్నయ్యా అని పిలుస్తాను. సినిమాని మే నెలలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం' అన్నారు. రాజశేఖర్ కుమార్తెలు శివాని, శివాత్మిక కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కేక్ తినిపించిన కూతుళ్లను ముద్దాడుతున్న రాజశేఖర్



ఒకే వేదికపై ఇద్దరు లెజెండ్స్

వెయ్యి సినిమాలకు పైగా సంగీతాన్ని అందించిన సంగీత జ్ఞాని ఇళయరాజా డెబ్భై వసంతాలు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా శని, ఆదివారాల్లో అభినందన సభ నిర్వహించింది తమిళ నిర్మాతల మండలి. చెన్నై నందనంలోని వైఎంసీ మైదానం ఇళయరాజా అభిమానులతో నిండిపోయింది. ఆ ప్రాంగణమంతా ఆయన సంగీతంతో హోరెత్తింది. సినీ పరిశ్రమ బంగారు వయొలెన్‌ను రాజాకు పుట్టిన రోజు కానుకగా బహూకరించింది. మహామహులెందరో పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఏఆర్ రెహమాన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. తనకు మార్గదర్శి ఇళయరాజాయే అంటూ ఆయన స్వరపరిచిన సంగీతాన్ని తన చేతులతో వాయించి మురిపించాడు. భారతీయ సినీ సంగీతానికి ప్రపంచ స్థాయిలో గౌరవాన్ని తీసుకొచ్చిన ఈ ఇద్దరు లెజెండ్స్‌ని ఒక వేదికపై చూడటం నిజంగా అపురూప దృశ్యమే.

ఇదొక క్లాసిక్ హారర్



సచిన్ జోషి, నర్గీస్ ఫక్రి నటించిన చిత్రం 'అమావాస్య'. భూషణ్ పటేల్ దర్శకుడు. తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రం ఫిబ్రవరి 8న విడుదల కానున్న సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుక జరిగింది. ఈ సందర్భంగా సి.కళ్యాణ్ మాట్లాడుతూ... 'నాకు హారర్ జానర్ అంటే ఇష్టం. చాలా హారర్ చిత్రాలు నిర్మించాను. సచిన్ మంచి నటుడు. ఎన్నో వ్యాపారాలున్నా ప్యాషన్‌తో సినిమాలు చేస్తున్నాడు. ఆయన భార్య రైనా నిర్మాతగా మంచి విజయాన్ని అందుకోవాలని ఆశిస్తున్నాను. సినిమా ఎంత బాగుంటుందో ట్రెయిలర్ చూస్తేనే తెలుస్తోంది' అన్నారు. సచిన్ మాట్లాడుతూ.. 'హారర్ మూవీ చేయాలని చూస్తున్న నాకు భూషణ్ మంచి కథ చెప్పారు. ఇదో క్లాసిక్ హారర్. కథకు తగ్గట్టు మంచి మ్యూజిక్ కూడా ఉంది' అన్నారు. మంచి టెక్నాలజీని వాడి ఈ సినిమా తీశామని, వీఎఫ్ఎక్స్ వర్క్ ఆకట్టుకుంటుందని దర్శకుడు చెప్పాడు. తన పాత్ర అందరినీ నవ్విస్తుందని కమెడియన్ అలీ అస్గర్ అన్నాడు.



లక్ దక్కేనా?

క్యాథరీన్ త్రెసా ఇండస్ట్రీలో అడుగుపెట్టి చాలా కాలమే అయ్యింది. ఇద్దరమ్మాయిలతో, సరైనోడు, నేనే రాజు నేనే మంత్రి లాంటి చిత్రాల్లో మంచి పాత్రలే దక్కినా... లీడ్ యాక్ట్రెస్‌గా గుర్తింపు తెచ్చుకోలేకపోయింది. కానీ ఇప్పుడొచ్చిన ఆఫర్‌తో ఆమె స్టార్ తిరిగే సూచనలు కనిపిస్తున్నాయి. సెన్సేషనల్ హీరో విజయ్ దేవరకొండతో క్రాంతి మాధవ్ రూపొందించనున్న చిత్రానికి క్యాథరీన్ ఎంపికయ్యింది. నిజానికి ఇప్పటికే ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్లు ఉన్నారు... రాశీ ఖన్నా, ఐశ్వర్యా రాజేష్, ఇజబెల్లా. ఇప్పుడు నాలుగో కథానాయికగా క్యాథరీన్‌ని తీసుకున్నారు. ఈ మూవీలో విజయ్ ప్లే బోయ్ తరహా పాత్ర పోషించనున్నాడు. అందుకే ఇంతమంది హీరోయిన్లను తీసుకుంటూ ఉండొచ్చు. మరి ఇంతమంది మధ్య క్యాథరీన్ పాత్రకి ఎంత ప్రాధాన్యత ఉంటుందో తెలీదు కానీ... విజయ్ సినిమా అంటే హిట్ ఎక్స్‌పెక్ట్ చేస్తాం కాబట్టి క్యాథరీన్‌కి అదృష్టం కలిసొచ్చే అవకాశాలు లేకపోలేదు.



చెడ్డీ గ్యాంగ్ టీజర్ రిలీజ్

క నగాల రమేష్ చౌదరి దర్శకత్వంలో విక్కీరాజ్ నిర్మిస్తున్న చిత్రం 'చెడ్డీ గ్యాంగ్'. శ్రీనివాసరెడ్డి ముఖ్య పాత్రలో నటించాడు. అమర్, ప్రదీప్‌వర్మ, ఉదయ్, అభి, ఖాదర్, లక్ష్మి, జాస్మిన్ ఇతర పాత్రలు పోషించారు. ఈ సస్పెన్స్ థ్రిల్లర్ టీజర్ విడుదల కార్యక్రమం ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శివాజీరాజా మాట్లాడుతూ 'టైటిల్ బాగుంది. తెలుగు సినిమాలో తమిళ నటీనటులు ఉండొచ్చా లేదా అనేది ప్రస్తుతానికి అప్రస్తుతం. కానీ తెలుగువాళ్లు ఉంటే అనువాద చిత్రమనే భావన వచ్చేది కాదు. హీరోయిన్స్ అంటే తప్పదు, చిన్న చిన్న నటీనటుల్ని కూడానా. మన వాళ్లకు ఇంపార్టెన్స్ ఇవ్వండి. కుదరకపోతేనే ఇతర భాషల వారికి తీసుకోండి. అలాగే నటీనటులు కూడా ప్రచారానికి వస్తే దర్శక నిర్మాతలకి, సినిమాకి హెల్ప్ అవుతుంది. ప్రతి సినిమా హిట్టవ్వాలని కోరుకోవడంలోనే మన పాజిటివ్ థింకింగ్ ఉంటుంది. దర్శకుడు రమేష్ చాలా సీనియర్. ఈ సినిమా హిట్టవ్వాలని కోరుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు రమేష్ మాట్లాడుతూ 'మూడు దశాబ్ధాలుగా అసిస్టెంట్ డైరెక్టర్‌గా, కో-డైరెక్టర్‌గా పని చేస్తున్నాను. ఈ సినిమాతో దర్శకుడిగా మారాను. పదిమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కేరళ అడవులకు టూర్‌కి వెళ్లి, అక్కడి కోయవారి నిబంధనలను అతిక్రమించి ఇరుక్కు పోతారు. అక్కడి నుంచి వాళ్లు ఎలా బయటపడ్డారనేదే ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకముంది' అన్నారు. మలేషియాలో తెరకెక్కించిన క్లైమాక్స్ సినిమాకి హైలైట్ అవుతుందని, బాలీవుడ్ బ్యూటీ స్నేహా కపూర్ చేసిన ఐటమ్ సాంగ్ యువతను ఆకట్టుకుంటుందని చెప్పారు నిర్మాత.



బోణీ బాగుంది

ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు. ఇంట గెలివకపోయినా రచ్చ గెలిచేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది రెజీనా. ఆమె నటించిన తొలి బాలీవుడ్ చిత్రం 'ఎక్ లడ్‌కీకో దేఖాతో ఐసా లగా' రీసెంట్‌గా రిలీజైంది. అనిల్ కపూర్, జూహీ చావ్లా, సోనమ్ కపూర్, రాజ్‌కుమార్ రావ్ లాంటి ఫేమస్ ఆర్టిస్టులంతా ఉన్న ఈ చిత్రంలో రెజీనా పాత్ర ఏంటన్నది మొదట తెలీలేదు. ట్రైయిలర్‌లో కూడా సరిగ్గా కనిపించకపోవడంతో ఏదో చిన్న పాత్ర అయివుంటుంది అనుకున్నారంతా. అయితే సినిమా రిలీజయ్యాక మిగతావారితో పాటు రెజీనాని కూడా మెచ్చుకుంటూ కామెంట్లు పెడుతున్నారు నెటిజన్స్. హోమో సెక్సువాలిటీ ప్రధానాంశంగా తెరకెక్కిన ఈ సినిమాలో సోనమ్, రెజీనా లవర్స్‌గా నటించారు. మొత్తానికి బాలీవుడ్‌లో బోణీ అయితే బాగుంది. మరి రెజీనాకి ముందు ముందు మరిన్ని మంచి ఆఫర్లు వస్తాయేమో చూడాలి.



మనోస్థైర్యానికి హ్యాట్సాఫ్

ఇద్దరూ వెండితెరపై మెరిసిన తారలు. కానీ ఇద్దరి జీవితాల్లోనూ అనుకోని చీకట్లు కమ్ముకున్నాయి. క్యాన్సర్ వ్యాధి వారిద్దరి జీవితాలనూ ఊహించని మలుపు తిప్పింది. తనకి క్యాన్సర్ అని తెలియగానే షాక్ తిన్నానని మనీషా కొయిరాలా చెప్పింది. ఆ షాక్ నుంచి తేరుకుని వ్యాధితో పోరాడింది. చివరికి ఆమే గెలిచింది. ప్రస్తుతం తన జీవితాన్ని కొత్తగా జీవించే ప్రయత్నం చేస్తున్నాను అంటోంది. వీలైనంత సంతోషంగా, ప్రశాంతంగా గడుపుతోంది. రీసెంట్‌గా ఇలా బోట్ షికారు చేస్తూ ఎంజాయ్ చేసింది. సోనాలీ బెంద్రే మాత్రం ఇప్పటికీ క్యాన్సర్‌తో పోరాడుతూనే ఉంది. ఆమెకి ఆ వ్యాధి సోకిన విషయం తెలిసి ఇండస్ట్రీ మొత్తం కదిలిపోయినా... సోనాలి మాత్రం స్ట్రాంగ్‌గా నిలబడింది. బాధాకరమైన చికిత్సను కూడా నవ్వుతూ తీసుకుంటోంది. పుస్తకాలు చదువుతోంది. రీసెంట్‌గా మళ్లీ కెమెరా ముందుకు కూడా వచ్చి ఒక యాడ్ ఫిల్మ్‌లో నటించింది. 'మళ్లీ కెమెరా ముందుకు రావడం ఆనందంగా ఉంది. నటన అంటే ఎమోషన్స్‌ని ప్రదర్శించడం. గత కొన్ని నెలలు ఎంతో ఎమోషనల్‌గా గడిచాయి. ఇప్పుడా ఎమోషన్స్‌ని మళ్లీ ప్రొఫెషన్ కోసం వాడుతున్నా' అంటోంది. క్యాన్సర్ డే సందర్భంగా ఈ ఇద్దరి మనోస్థయిర్యానికి ఓసారి హ్యాట్సాఫ్ చెబుదామా!





ఫస్ట్ లుక్

పద్మశ్రీ అవార్డు అందుకున్న చేనేత కార్మికుడు చింతకింది మల్లేశం జీవితం ఆధారంగా ఆయన పేరుతోనే సినిమా తెరకెక్కుతోంది. ప్రియదర్శి లీడ్ రోల్ చేస్తున్నాడు. రాజ్ ఆర్. దర్శకత్వం వహిస్తున్నాడు. ఆ మూవీ ఫస్ట్ లుక్ ఇది.

నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.397	రూ.4.55
వరంగల్	రూ.399	రూ.4.55



క్యూ3 ఫలితాలు కీలకం

ఆర్‌బీఐ పాలసీ కూడా

న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్‌ను ఈ వారం ప్రధానంగా రెండు అంశాలే నిర్ణయించబోతున్నాయి. ఒకటి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పాలసీ, రెండు ప్రస్తుతం నడుస్తున్న కంపెనీల క్వార్టర్ ఫలితాలు అని విశ్లేషకులు చెప్పారు. గ్లోబల్ సంకేతాలు కూడా ఈ వారం స్టాక్‌మార్కెట్‌పై కాస్త ప్రభావం చూపొచ్చని పేర్కొన్నారు. గత వారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ప్రకటనలు కూడా ఈ వారం స్టాక్‌మార్కెట్‌ను ప్రభావితం చేయబోతున్నాయి. 'ఈ వారం మార్కెట్‌కు కీలక అంశాలుగా ఆర్‌బీఐ మానిటరీ పాలసీ మీటింగ్, కార్పొరేట్ కంపెనీల ఫలితాలు, ఎఫ్ఐఐ ఫ్లోస్ నిలువనున్నాయి' అని ఎస్సెల్ మ్యూచువల్ ఫండ్ సీఐఓ విరల్ బేరావాలా చెప్పారు. ఆర్‌బీఐ పాలసీ రివ్యూ ఈ నెల 7న విడుదల కానుంది. సేవా రంగ డేటా కూడా ఈ వారం ప్రారంభంలోనే రాబోతుంది. ప్రస్తుత ఫోకస్ అంతా ఆర్‌బీఐ మీటింగ్‌పైనేనని, సేవా రంగ డేటా కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను నిర్ణయించనుందని ప్రిన్సిపల్ మ్యూచువల్ ఫండ్ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ హెడ్ బెక్సీ కురియాకోస్ తెలిపారు. సీఐఎల్, ఐడీబీఐ, గెయిల్, పీఎన్‌బీ, సిప్లా, లుపిన్ వంటి దిగ్గజ కార్పొరేట్ కంపెనీలు ఈ వారం తమ క్వార్టర్ ఫలితాలను వెల్లడించనున్నాయి. ఈ సారి బడ్జెట్ కార్పొరేట్ కంపెనీల సంపాదనలకు బూస్టప్ ఇస్తుందని, ప్రధానంగా వినియోగం, వ్యవసాయం-గ్రామీణ రంగం, రిటైల్ రుణాలు, గృహ రంగాల కంపెనీలకు మేలు చేకూరుతుందని ఎమ్కే గ్లోబల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఎకనామిస్ట్, స్ట్రాటజిస్ట్ ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ హెడ్ ధనంజయ్ సిన్హా తెలిపారు.

ఇండియా ఈ–కామర్స్‌కు కింగ్ అంబానీ

- కొత్త నిబంధనలతో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ డీలా
- జియో నెట్‌వర్క్‌తో రిలయన్స్‌కు ఎంతో మేలు

న్యూఢిల్లీ: మనదేశంలో ఈ-కామర్స్ సంస్థల పుట్టుక దశాబ్దం కిందటే మొదలయింది. కొన్ని సంస్థలు సింగిల్‌రూమ్ అపార్టుమెంట్లలో కంపెనీల పెట్టి పెట్టుబడులు సంపాదించినా, కొన్నాళ్లకు దుకాణాన్ని సర్దేశాయి. వేగంగా వృద్ధి చెందుతున్న ఈ-కామర్స్‌లో తమకూ వాటా ఉండాలనే ఆలోచనతో ఆదిత్య బిర్లా, గోద్రెజ్, రిలయన్స్, టాటాలు కూడా రంగంలోకి దిగారు. సొంతగా వెబ్‌సైట్లు/యాప్‌లు ఏర్పాటు చేసుకున్నారు. చివరికి చేతులు కాల్చుకోకతప్పలేదు. బిర్లాల ఎబాఫ్‌డాట్‌కామ్, గోద్రెజ్ ఏక్‌స్టాప్, టాటాక్లిక్‌డామ్, రిలయన్స్‌మార్ట్‌డాట్‌ఇన్ కస్టమర్లను ఆకట్టుకోవలడంలో విఫలమయ్యాయి. కొన్ని నష్టాలతో కొనసాగుతుండగా, మిగతావి మూతపడ్డాయి. "టాటా, బిర్లా, రిలయన్స్ వంటి బడా కంపెనీలు చిన్నపిల్లల్లా వ్యవహరించాయి. ఏమాత్రం ఆలోచన లేకుండా కోట్లు గుమ్మరించాయి. తగిన వ్యూహం లేకుండా ఈ-కామర్స్ వ్యాపారంలోకి దిగాయి" అని వజీర్ అడ్వైజర్స్ ఎండీ, వ్యవస్థాపకుడు హర్మిందర్ సహానీ విమర్శించారు. రూల్స్ మారడంతో తన జియో టెలికం సర్వీస్‌ను, రిటైల్ నెట్‌వర్క్‌ను ఏకం చేసి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌కు దీటుగా ఈ-కామర్స్ సంస్థను ఏర్పాటు చేయనున్నట్టు రిలయన్స్ అధిపతి ప్రకటించారు. చిన్న దుకాణదారులతో జియోరిలయన్స్ రిటైల్ కలిపి ఆన్‌లైన్ మార్కెట్ ప్లేస్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గతంలో రిలయన్స్ దెబ్బతిన్నప్పటికీ ఈసారి మాత్రం దూసుకెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.

విదేశీ నిధులే నిలబెట్టాయ్..

విదేశాల నుంచి భారీగా నిధులు పొందిన పేటీఎం, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు మాత్రమే ఈ-కామర్స్ రంగంలో నిలదొక్కుకున్నాయి. అందుకే మనదేశంలోని ఇతర కంపెనీల ఈ-కామర్స్ కంపెనీలు మూటాముల్లె సర్దుకోవాల్సి వచ్చింది. ఇండియా కంపెనీలకు ఉన్న అతిపెద్ద అవరోధం ఏమిటంటే.. నష్టాలు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ మాదిరిగా ఇవి దీర్ఘకాలం నష్టాలను చూపించలేవు. మన దేశ చట్టాల ప్రకారం ఎక్కువ నష్టాలను చూపించిన కంపెనీలను స్టాక్‌మార్కెట్‌లో లిస్ట్ కావడానికి అనుమతించరు. రిలయన్స్‌కు మాత్రం ఈ సమస్యలు లేవు. నిధుల కొరత లేదు కాబట్టి వ్యాపారంలో దూసుకెళ్లవచ్చు. సప్లైచైన్ సిద్ధంగా ఉంది. డెలివరీ నెట్‌వర్క్ కూడా ఉంది. కొత్త నిబంధనల వల్ల అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు లక్షల వస్తువుల అమ్మకాలను నిలిపివేశాయి. స్పీడ్ డెలివరీ సదుపాయాన్ని తొలగించాయి. ఈ పరిస్థితిని రిలయన్స్ తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నంలో ఉంది. తన అనుబంధ విభాగాల సేవలను ఉపయోగించుకోవడం ద్వారా నష్టాలు లేకుండా చేసుకోవచ్చని మార్కెట్ నిపుణుడు ఒకరు అన్నారు.

అమెజాన్ గ్రోసరీ బంద్...

ఈ-కామర్స్ సంస్థల కోసం కొత్తగా తీసుకొచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పాలసీతో అమెజాన్‌కు భారీగా గండికొడుతోంది. బలవంతంగా తన కీలక గ్రోసరీ సర్వీసులను కూడా తాత్కాలికంగా రద్దు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. పలు ప్రొడక్ట్‌లను కూడా అమెజాన్ తన ప్లాట్‌ఫామ్ నుంచి తొలగించింది. 'ప్యాంట్రీ సేవలు ఇండియాలో ప్రస్తుతం అందుబాటులో లేవు. ఈ ప్రొడక్ట్‌లను కొనాలనుకునే వారు ఇతర అమ్మకం దారులను సంప్రదించాలి' అని అమెజాన్ తన ట్విటర్ అకౌంట్ ద్వారా వెల్లడించింది. గ్రోసరీ ప్లాట్‌ఫామ్ పనిచేయడం లేదంటూ కొంతమంది కస్టమర్లు ఫిర్యాదు చేయడంపై అమెజాన్ పైవిధంగా స్పందించింది. అమెజాన్ అతిపెద్ద వెండార్ క్లౌడ్‌టైల్ ప్యాంట్రీని విక్రయించేది.



ఎన్నో అనుకూలతలు..

- అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌కు లేని కొన్ని అనుకూలతలు రిలయన్స్‌కు ఉన్నాయి. ముఖ్యంగా టెలికం కంపెనీ జియోకి దాదాపు 30 కోట్ల మంది కస్టమర్లు ఉన్నారు. 6,500 నగరాల్లో 10 వేల ఔట్‌లెట్లు ఉన్నాయి. జియోకు ఎంటర్‌టైన్‌మెంట్, ఫైనాన్షియల్ సర్వీసెస్, పేమెంట్ గేట్‌వే వంటి విభాగాలు ఉండటం కంపెనీకి కలిసి వస్తుంది.
- రిలయన్స్‌కు ఎఫ్‌డీఐ నిబంధనల ఇబ్బందులు ఉండవు. పెట్టుబడుల కోసం ఎవరినైనా ఆధారపడాల్సిన అవసరం లేదు. ప్రస్తుత నిబంధనలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు ఇబ్బందికరంగా మారాయి. ఎక్స్‌క్లూజివ్ డీల్స్ కుదుర్చుకోవడాన్ని, భారీ డిస్కౌంట్ల ఇవ్వడాన్ని నిషేధించారు.
- లాభాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే రిలయన్స్ ఇండస్ట్రీస్ గత జూన్‌తో ముగిసిన క్వార్టర్‌కు రూ.9,459 కోట్ల నికరలాభం సంపాదించింది.
- జియోకు కోట్లాది మంది కస్టమర్లు ఉన్నందున ప్రచారం కోసం పెద్దగా ఖర్చు చేయాల్సిన పనిలేదు. రిలయన్స్ రిటైల్ స్టోర్లతో కంపెనీకి ఇది వరకే లాజిస్టిక్స్, గోదాములు, సప్లైచైన్ ఉంది.

'జీఎం' ఉంటే లేబుల్ వేయాలె!



- త్వరలో నోటిఫికేషన్
- ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రకటన
- రెస్టారెంట్ల ఉల్లంఘనలపై సీరియస్
- వాటిని మూసివేయిస్తామని వెల్లడి

న్యూఢిల్లీ: జన్యుమార్పిడి (జీఎం) పంటలకు అనుకూలమైన కంపెనీల నుంచి ఎంత ఒత్తిడి వచ్చినప్పటికీ ఇండియా ఆహార భద్రత ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) వీటికి లేబులింగ్‌ను తప్పనిసరి చేసింది. ఇక నుంచి జన్యుమార్పిడి పదార్థాలు ఒక్కశాతం కంటే ఎక్కువ ఉంటే, ఆ వివరాలను పేర్కొంటూ కంపెనీలు లేబుల్ వేయాలి. జీఎం ఆహార పదార్థాల తయారీ, అమ్మకం, పంపిణీ, లేబులింగ్‌కు ఎఫ్ఎస్ఎస్ఏఐ సైంటిఫిక్ కమిటీ ఆమోదం తెలిపిందని సంస్థ సీఈఓ పవన్ కుమార్ అగర్వాల్ తెలిపారు. జీఎం ఆహార నియంత్రణలో జీఎం ఆహార లేబులింగ్ కూడా భాగమని వెల్లడించారు. ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు. జీఎం అవశేషాల పరిమాణం ఐదుశాతం కంటే ఎక్కువగా ఉంటే లేబుల్ వేయించాలని భావించినా, సంబంధిత పక్షాల అభిప్రాయాల మేరకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సైంటిఫిక్ కమిటీ దీనిని ఒక శాతానికి తగ్గించింది. జన్యుమార్పిడి ఆహారానికి ప్రత్యేక లేబుల్ వేయ్యడం. యూరప్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, దక్షిణ కొరియా, బ్రెజిల్, చైనాలో తప్పనిసరి.

యాంటీబయాటిక్స్‌పై త్వరలో నిర్ణయం

పర్యావరణ పరిరక్షణ కోసం ఏర్పడిన స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) గత జూలైలో 65 ఆహార పదార్థాలను పరిశీలించగా, 21 పదార్థాల్లో జన్యుమార్పిడి అవశేషాలు ఉన్నాయి. వీటిలో కొన్ని నవజాత శిశువులకు తినిపించేవి కావడం గమనార్హం. దీనిపై అగర్వాల్ స్పందిస్తూ ఆహార పదార్థాల్లో యాంటీబయాటిక్స్ వాడకాన్ని నిషేధించడం లేదా పరిమితం చేయడంపై రెండు మూడు నెలల్లో అధికార ప్రకటన చేస్తామని చెప్పారు. కొన్ని యాంటీబయాటిక్స్‌కు అనుమతించినా, వాటిలో ఎంఆర్ఎల్ (గరిష్ఠ అవశేష స్థాయి) నిర్దిష్టస్థాయిని మించకుండా చూస్తామని అన్నారు. ఈ-కామర్స్ ఫుడ్ డెలివరీ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్న రెస్టారెంట్లు నిబంధనలను ఉల్లంఘిస్తుండటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. "ఇలాంటి 10,400 రెస్టారెంట్లు నిబంధనలను ఉల్లంఘించినట్టు గుర్తించి సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు జాబితా పంపించాం. వాటిని మూసివేయడం లేదా నిబంధనలను పాటించి లైసెన్సులను కొనసాగించుకునేలా రాష్ట్రాలు చేస్తాయి" అని అగర్వాల్ వివరించారు. మనదేశంలో ఆహార భద్రతా చట్టాలు సరిగ్గా అమలు కావడం లేదని, చాలా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆహార భద్రతాశాఖలే లేవని ఈ అంశంపై ఏర్పాటైన పార్లమెంటరీ సంఘం విమర్శించింది. కొన్ని రాష్ట్రాల్లో తగినన్ని మానవ వనరులు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇప్పుడు పరిస్థితులు మెరుగవుతున్నాయని అగర్వాల్ అన్నారు. కేంద్రం సాయంతో కొన్ని రాష్ట్రాల్లో ఫుడ్ ల్యాబ్‌లు ఏర్పాటవుతున్నాయని వెల్లడించారు. ఇవి ప్రారంభమైతే ఆహార తనిఖీ పటిష్టంగా ఉంటుందని అన్నారు. వీటిలో ఉద్యోగాలు భర్తీ అయ్యేలా రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడుతున్నామని అగర్వాల్ వివరించారు.

లుపిన్ స్కిన్ ట్రీట్‌మెంట్ డ్రగ్ వెనక్కి



న్యూఢిల్లీ : అమెరికా ఫార్మా దిగ్గజం లుపిన్, స్కిన్ ట్రీట్‌మెంట్ డ్రగ్‌ను రీకాల్ చేస్తోంది. చర్మ చికిత్సలకు వాడే 24వేల 180 బాటిళ్ల ఫ్లోసినోలోన్ అసిటోనైడ్ టోపికల్ సొల్యుషన్‌ను అమెరికా, ప్యూర్టో రికో నుంచి లుపిన్ రీకాల్ చేస్తున్నట్టు యూఎస్ఎఫ్‌డీఏ రిపోర్టులో వెల్లడైంది. ఈ డ్రగ్‌ను లుపిన్, నోవెల్ ల్యాబొరేటరీస్‌లో తయారు చేసింది. ఈ డ్రగ్ డీగ్రేడేషన్ స్పెషిఫికేషన్ల విషయంలో విఫలమైందని, దాంతో డ్రగ్ రీకాల్ చేపడుతుందని యూఎస్ఎఫ్‌డీఏ తెలిపింది. స్వచ్ఛందంగా చేపడుతున్న ఈ రీకాల్, క్లాస్ 2 రీకాల్‌గా పేర్కొంది. రీకాల్ చేస్తున్న ఈ ప్రొడక్ట్ వాడితే అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని, ఒక్కోసారి సీరియస్ హెల్త్ సమస్యలు ఏర్పడవచ్చని యూఎస్ఎఫ్‌డీఏ రిపోర్టు చేసింది.



చందా కొచ్చర్‌పై మనీలాండరింగ్ కేసు కూడా

రుణాలు జారీలో అవినీతి, అక్రమాలు : ఈడీ ○ నిందితులకు త్వరలోనే సమన్లు

న్యూఢిల్లీ : ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో చందా కొచ్చర్ చుట్టూ... వీడియోకాన్ రుణాల ఉచ్చు గట్టిగానే బిగుస్తోంది. ఇటీవలే ఆమెకు వ్యతిరేకంగా సీబీఐ క్రిమినల్ కేసు పెట్టిన తర్వాత, తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా మనీలాండరింగ్ కేసు దాఖలు చేసింది. చందాకొచ్చర్‌తో పాటు, ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ గ్రూప్ ప్రమోటర్ వేణుగోపాల్ ధూత్, ఇతరులపై కూడా ఈడీ మనీలాండరింగ్ కింద క్రిమినల్ కేసు పెట్టింది. వీడియోకాన్‌కు బ్యాంక్ రూ.1,875 కోట్ల రుణాలు మంజూరు చేయడంలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్టు శనివారం ఈడీ అధికారులు పేర్కొన్నారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద ఈ కేంద్ర దర్యాప్తు సంస్థ కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు ఇన్‌ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) దాఖలు చేసినట్టు తెలిపారు.

ఈసీఐఆర్ అనేది పోలీసులు దాఖలు చేసే ఎఫ్ఐఆర్‌తో సమానమైనది. ఈసీఐఆర్‌లో పేర్కొన్న నిందితులకు త్వరలోనే ఈడీ సమన్లు కూడా జారీచేయబోతుంది. సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో చందాకొచ్చర్, దీపక్ కొచ్చర్, వేణుగోపాల్ ధూత్, ఆయన కంపెనీలు వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, వీడియోకాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, సుప్రీం ఎనర్జీ, న్యూపవర్ రెన్యూవబుల్స్‌లను నిందితులుగా చేర్చింది. క్రిమినల్ కుట్ర, మోసానికి సంబంధించి ఇండియన్ పీనల్ కోడ్‌లో ఉన్న సెక్షన్లను వీరిపై సంధించింది. అవినీతి నిరోధక చట్టం నిబంధనల కింద కూడా సీబీఐ వీరిందరిన్నీ నిందితులుగా పేర్కొంది. ఈ కేసులో భాగంగా వీడియోకాన్ గ్రూప్, న్యూపవర్ రెన్యూవబుల్స్ ఆఫీసుల్లో సీబీఐ తనిఖీలు చేపట్టింది. వీడియోకాన్ రుణం కేసులో చందా కొచ్చర్ దోషేనని, బ్యాంక్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి తనకు ప్రయోజనం కలిగేలా వ్యవహరించినట్టు జస్టిస్ శ్రీకృష్ణ ప్యానెల్ కూడా తేల్చేసింది. క్విడ్ ప్రోకో విధానం ద్వారా ఐసీఐసీఐ బ్యాంక్ వీడియోకాన్‌కు రుణాలు మంజూరు చేసినట్టు వెల్లడించింది. ప్రతిగా చందాకొచ్చర్ భర్త దీపక్ కొచ్చర్ లబ్ధి పొందారని వెల్లడించింది.

పాత లగ్జరీ కార్లకు ఫుల్లు గిరాకీ



- పాత కార్లకు మాత్రం ఫుల్లు జోష్
- అమ్మకాలలో ఊపు

హైదరాబాద్, వెలుగు

లగ్జరీ కార్ల అమ్మకాలు 2018 లో పదేళ్ల కనిష్ట స్థాయికి నెమ్మదించాయి. అనూహ్యంగా సెకండ్ హ్యాండ్ కార్ల అమ్మకాలు మాత్రం ఊపుమీదున్నాయి. లగ్జరీ కార్ల అమ్మకాలు గతేడాది 34 శాతం వృద్ధి చెందగా, యూజ్డ్ కార్ల అమ్మకాలు మాత్రం 20-30 శాతం దాకా పెరిగాయి. సులభతర ఫైనాన్స్ సదుపాయం, అన్యువల్ మెయింటెనెన్స్ కాంట్రాక్ట్స్, తక్కువ ఎంట్రీ ధరలు వంటివి మార్కెట్‌ను ఆర్గనైజ్డ్ వైపుకు మళ్లిస్తున్నాయి. 2-3 యేళ్లు వాడిన కార్లకు, అదే మోడల్ గల కొత్త కార్ల ధరలతో పోలిస్తే 25-50 శాతం దాకా ధరల వ్యత్యాసం ఉంటోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దీంతో కొత్త కారు కొనేకంటే పాత కారును కొనడానికే కస్టమర్లు ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

లగ్జరీ యూజ్డ్ కార్ల మార్కెట్ 15 శాతం వృద్ధి

దేశీయంగా యూజ్డ్ లగ్జరీ కార్ల మార్కెట్ 2017 తో పోలిస్తే గతేడాది 15 శాతం వృద్ధి చెందింది. 2017 లో 40,800 యూనిట్లు అమ్ముడవగా, 2018 లో 50 వేల యూనిట్లు అమ్ముడయ్యాయి. దీన్లో ఆర్గనైజ్డ్ మార్కెట్ 23 శాతం వృద్ధి చెందినట్లు మహీంద్రా ఫస్ట్ ఛాయిస్ వీల్స్ (ఎమ్ఎఫ్‌సీడబ్ల్యూ) తెలిపింది. మెర్సిడెస్ బెంజ్, బిఎండబ్ల్యూ, జాగ్వర్ లాండ్ రోవర్ (జేఎల్ఆర్) వంటి కంపెనీలకు స్వంత ప్రీ ఓన్డ్ యూనిట్లు ఉన్నాయి. తమ యూజ్డ్ కార్ల బిజినెస్ 2017 తో పోలిస్తే 2018 లో 77 శాతం పెరిగిందని జేఎల్ఆర్ మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ సూరి తెలిపారు. యూజ్డ్ కార్ల మార్కెట్ రెండంకెల వృద్ధిని నమోదు చేస్తోందని, కస్టమర్లను తమ బ్రాండ్‌ను పరిచయం చేయడానికి ఇది గొప్ప అవకాశమని అన్నారు. కంపెనీలు ప్రత్యేక టెక్నికల్ ఇన్‌స్పెక్షన్లతో పాటు రెండేళ్ల వారంటీ వాటిని అందిస్తున్నారు. దీంతో కస్టమర్లలో నమ్మకం పెరిగి అమ్మకాలూ గణనీయంగా పెరుగుతున్నాయి.

అవే ఫీచర్లు ధర తక్కువ

బిఎమ్‌డబ్ల్యూ, ఆడి, మెర్సిడెస్ బెంజ్ వంటి కార్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటోందని మోహన్ మోటార్స్ డైరెక్టర్ గౌరవ్ జైన్ తెలిపారు. తాజాగా వోల్వో కు కూడా డిమాండ్ పెరుగుతూ వస్తోందని అన్నారు. అమ్మకాల్లో యేటా 10-15 శాతం వృద్ధి నమోదు చేస్తోందని, రూ.30 లక్షల నుండి రూ.50 లక్షల రేంజ్‌లో ఎక్కువ కార్లు అమ్ముడవుతున్నాయని అన్నారు. మార్కెట్లో సప్లై ఎక్కువగా ఉండడంతో 3-4 సంవత్సరాలు వాడిన కారు సగం ధరకే లభ్యమవుతుండడం, కొత్త కార్ల ధరలు అధికంగా ఉండడంతో కస్టమర్లు యూజ్డ్ కార్ల వైపు మొగ్గు చూపుతున్నారని చెప్పారు. అదే కారు అదే ఫీచర్లు గల మంచి కండీషన్ గల కారు తక్కువ ధరకే వస్తుండడంతో సెకండ్ హ్యాండ్ కార్లకు డిమాండ్ పెరుగుతోందని అన్నారు.

వాల్యూ ఫర్ మనీ

బిఎండబ్ల్యూ 7 సిరీస్ యూజ్డ్ కారును రూ.89 లక్షలకు కొనేకంటే అదే ధరలో కొత్త మెర్సిడెస్ ఈ క్లాస్, టయోటా కొరొలా వంటి కార్లు వస్తాయి. అయినప్పటికీ యూజ్డ్ బిఎండబ్ల్యూను మంచి వాల్యూ ఫర్ మనీ ఆప్షన్‌గా భావిస్తున్నారని బిగ్ బాయ్ టాయ్జ్ రిటైల్ డీలర్ జతిన్ అహుజ తెలిపారు. గత పదేళ్ల కాలంలో దాదాపు 3 లక్షల కొత్త లగ్జరీ కార్లు రోడ్లపై తిరుగుతున్నాయి. దీంతో చాలా మంది తమ పాత కారును అమ్మి కొత్త వెర్షన్ కార్లకు అప్‌గ్రేడ్ అవడానికి చూస్తున్నారు. యూజ్డ్ కార్ల మార్కెట్ ఊపందుకోవడానికి ఇదో ముఖ్య కారణం. ఇన్సూరెన్స్ ప్రభావంతో కొత్త కార్ల అమ్మకాలు తగ్గినప్పటికీ పాత కార్ల అమ్మకాలు మాత్రం జోరుగా సాగుతున్నాయి.

కలిసి వచ్చిన జీఎస్టీ తగ్గింపు

యూజ్డ్ లగ్జరీ కార్ల పై గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (జిఎస్టి) 28 శాతం నుండి 18 శాతం కు తగ్గించడం కూడా యూజ్డ్ లగ్జరీ కార్ల అమ్మకాలకు మరింత కలిసి వచ్చింది. దీంతో ఆర్గనైజ్డ్, అనార్గనైజ్డ్ డీలర్ల మధ్య ధరల వ్యత్యాసం మరింత తగ్గింది. ఔట్ లెట్ ద్వారా అమ్మకాలు జరుపుతున్నప్పటికీ వారెంటీ లేకుండా అమ్మే సెమీ ఆర్గనైజ్డ్ డీలర్ల వాటా సగానికంటే ఎక్కువ కాగా, ఆర్గనైజ్డ్ వాటా 15 శాతంగా ఉంటుంది. ఇక మిగతాది మార్కెట్ బ్రోకర్స్, ఏజెంట్స్ వంటి అనార్గనైజ్డ్ మార్కెట్ పంచుకుంటోంది. కొత్త కారు కొనేకంటే మూడేళ్లు వాడిన ఆడి, మెర్సిడెస్ బెంజ్ వంటి కార్లను కొనడానికే కస్టమర్లు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. వీటిని డ్రైవర్లే నడిపి ఉంటారు కాబట్టి సరిగ్గా మెయింటైన్ చేసి ఉంటాయనే అభిప్రాయం కస్టమర్లలో ఉంటోందని యూజ్డ్ లగ్జరీ కార్ల అమ్మకందారులు చెబుతున్నారు.

దేవాస్‌కు ఈడీ ఝలక్



- రూ.1,585 కోట్ల పెనాల్టీ విధింపు
- ఫెమా నిబంధనలను ఉల్లంఘించినట్టు ఆరోపణలు

బెంగళూరు : శాటిలైట్ సర్వీసెస్ ప్రొవైడర్ దేవాస్ మల్టిమీడియా లిమిటెడ్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) భారీ జరిమానా విధించింది. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా) 1999ను ఉల్లంఘిస్తూ.. అక్రమంగా రూ.579 కోట్ల విదేశీ పెట్టుబడులను పొందినందుకు దేవాస్‌కు, ఆ కంపెనీ డైరెక్టర్లకు, విదేశీ ఇన్వెస్టర్లకు రూ.1,585 కోట్ల జరిమానా విధించింది. దేవాస్ పొందిన రూ.579 కోట్ల పెట్టుబడులు ఫెమాలోని సెక్షన్ 6(3)కి విరుద్ధమని ఈడీ ప్రకటించింది. ఇస్రోకి చెందిన కొందరు మాజీ ఉద్యోగులు కలిసి ఈ దేవాస్ మల్టిమీడియా లిమిటెడ్‌ను 2004లో ఏర్పాటు చేశారు. తన వాణిజ్య సంస్థ యాంత్రిక్స్ కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుని... డిజిటల్ మీడియా, బ్రాడ్‌కాస్టింగ్ స్పేస్‌లో వాణిజ్యపరమైన సేవల కోసం ఉపగ్రహాల లో బ్యాండ్‌విడ్త్‌ను అందిస్తుంది. 'ఫెమా ప్రొవిజన్లకు విరుద్ధంగా విదేశీ వ్యక్తుల నుంచి దేవాస్ పొందిన పెట్టుబడులపై విచారణ జరిపాం. నిబంధనలకు విరుద్ధంగా పలు విదేశీ కంపెనీల నుంచి రూ.579 కోట్లను కంపెనీలోకి పెట్టుబడులుగా తీసుకున్నారని వెల్లడైంది. అందుకే జరిమానా విధించాం' అని ఈడీ ప్రకటించింది. యాంత్రిక్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందంలో కూడా అవకతవకలు ఉన్నట్టు ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద మరో కూడా కేసు నమోదైంది. ఇస్రో ఉద్యోగులు, యాంత్రిక్స్ కూడా ఒప్పందం కుదుర్చుకోవడంలో దేవాస్‌తో కలిసి కుట్ర పన్నినట్టు ఈడీ పేర్కొంది. మనీ లాండరింగ్‌లో ప్రమేయమున్న రూ. 80 కోట్ల విలువైన కంపెనీ ప్రాపర్టీలను 2017 ఫిబ్రవరి 28న ఈడీ అటాచ్ చేసింది. పీఎంఎల్ఏ స్పెషల్ కోర్టులో దీనిపై ఫిర్యాదు కూడా నమోదైంది.

పిచాయ్‌పై నమ్మకం తగ్గింది!



- ఆయన విజన్‌పై అనుమానాలు
- తగ్గిన సానుకూల స్పందనలు

వాషింగ్టన్ : గూగుల్ సీఈవోగా సుందర్ పిచాయ్ పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ ఆయన నాయకత్వంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. కానీ ఇటీవల పిచాయ్‌కు వ్యతిరేకంగా కంపెనీలో ఉన్న ఉద్యోగుల నుంచే అసంతృప్తి వ్యక్తమవుతున్నట్టు తెలిసింది. ఆయన నాయకత్వం, విజన్‌పై కొందరు ఉద్యోగులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్టు ఇటీవల చేసిన ఉద్యోగుల సర్వేలో వెల్లడైందని అంతర్జాతీయ మీడియా తెలిపింది. గూగుల్‌జైస్ట్‌గా ప్రాముఖ్యం పొందిన యాన్యువల్ ఇంటర్నల్ పోల్‌లో పిచాయ్, ఆయన మేనేజ్‌మెంట్ టీమ్ భవిష్యత్తులో గూగుల్‌ను సమర్థవంతంగా నడిపించగలదని నమ్మకముందా..? అనే ప్రశ్నకు 74 శాతం మందే పాజిటివ్‌గా స్పందించారు. గతేడాది ఇది 92 శాతంగా ఉంది. అంటే గతేడాదితో పోలిస్తే ఇది 14 శాతం తక్కువ. గూగుల్ నాయకత్వంపై ఉద్యోగుల్లో ఉన్న నమ్మకం ఈ ఏడాది ఆరేళ్ల కనిష్టానికి పడిపోయిందని కూడా సర్వేలో వెల్లడైంది. పిచాయ్ విజన్‌లో కంపెనీ సాధించబోయే విజయాలు మీకు స్ఫూర్తిగా నిలువనున్నాయా..? అనే ప్రశ్నకు 78 శాతం 'యస్' చెప్పారు. అయితే ఇది కూడా గతేడాది కంటే 10 శాతం తక్కువ. పిచాయ్ నిర్ణయాలు, వ్యూహాలపై పలు ప్రశ్నలు అడుగగా.. ఉద్యోగుల్లో ఈ నిర్లిప్తత వ్యక్తమైంది. వేతనాల విషయాల్లో కూడా సంతృప్తి తగ్గింది. ఈ ఏడాది కేవలం 54 శాతం మంది మాత్రమే తమకు వచ్చే వేతనాలతో సంతృప్తిగా ఉన్నట్టు చెప్పారు. గతేడాది ఇది 64 శాతం. పలు అంశాల్లో ఉద్యోగులు, మేనేజ్‌మెంట్ నిర్ణయాలను వ్యతిరేకించారు. కాంట్రాక్ట్ స్టాఫ్‌కు అందిస్తున్న ప్రయోజనాల్లో లోపాలు, ఏఐ వాడకంలో నైతికత వంటి పలు విషయాలపై ప్రశ్నించారు. లైంగిక వేధింపుల విషయంలో కూడా ఉద్యోగుల్లో ఆగ్రహం వ్యక్తమైంది.



పాండ్యా హ్యాట్రిక్ సిక్సర్స్

వెల్లింగ్టన్ : న్యూజిలాండ్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లో 22 బాల్స్‌లో 45రన్స్ చేసి ఇండియా విజయంలో కీలక భాగస్వామైన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా హ్యాట్రిక్ సిక్సలతో అలరించాడు. వన్డేల్లో ఇలా హ్యాట్రిక్ సిక్సలు కొట్టడం పాండ్యాకు ఇది ఐదో సారి. లెగ్‌స్పిన్నర్ ఆస్టిల్ వేసిన ఇన్నింగ్స్ 47వ ఓవర్లో పాండ్యా వరుసగా మూడు సిక్సర్లతో అదరగొట్టాడు. నిషేధం తర్వాత అతనికి ఇది మూడో వన్డే. 2017 చాంపియన్స్ ట్రోఫీలో పాకిస్తాన్‌పై ఇలాగే రెండు సార్లు హ్యాట్రిక్ సిక్సర్లు కొట్టాడు.

హౌ ఈజ్ ద జోష్.. హై సర్

న్యూజిలాండ్‌లో సాధించిన విక్టరీతో టీమిండియా ఫుల్ జోష్‌లో ఉంది. మీ జోష్ ఏ లెవల్‌లో ఉందంటే 'హై సర్' అని కూడా జట్టంతా బదులిచ్చింది. బాలీవుడ్ సినిమా 'యూరీ- ద సర్జికల్ స్ట్రైక్'లో విక్కీకౌశల్ తన సైనికులను 'హౌ ఈజ్ ద జోష్' అని ప్రశ్నించగా వారు 'హై సర్' అంటూ నినదిస్తారు. ప్రస్తుతం ఈ సీన్ వైరల్‌గా మారింది. వెల్లింగ్టన్‌లో సిరీస్ ట్రోఫీ అందుకున్న తర్వాత జాదవ్ 'హౌ ఈజ్ ద జోష్' అంటూ మిగిలిన టీమ్‌ను ప్రశ్నించగా.. వారంతా 'హై సర్' అంటూ బదులిచ్చి సందడి చేశారు. ఈ వీడియోను బీసీసీఐ ట్విట్టర్‌లో పోస్ట్ చేయగా, విక్కీ దానిని రీట్వీట్ చేసి టీమిండియాకు శుభాకాంక్షలు చెప్పాడు.

ధోనీ మార్కు రనౌట్

వెల్లింగ్టన్ : ధోనీ మరోసారి తన మార్కు రనౌట్ చేశాడు. న్యూజిలాండ్‌తో చివరి వన్డేలో జట్టును గెలిపించేందుకు పోరాడుతున్న నీషమ్‌ను రనౌట్ చేసి కివీస్ ఆశలపై నీళ్లు చల్లాడు. 32 బాల్స్‌లో 4 ఫోర్లు, రెండు సిక్సలతో 44 రన్స్ చేసి నీషమ్ జట్టును గెలిపించే ప్రయత్నాల్లో ఉన్నాడు. అయితే జాదవ్ వేసిన మ్యాచ్ 37వ ఓవర్ రెండో బంతి నీషమ్ ప్యాడ్‌కు తగిలి వెనక్కు వెళ్లింది. దీంతో ఫీల్డర్లు ఎల్బీకి అప్పీల్ చేశారు. అంపైర్ నిర్ణయం ప్రకటించే లోపు నీషమ్ క్రీజ్ నుంచి బయటకు వచ్చాడు. అయితే ధోనీ ఓ వైపు అప్పీల్ చేస్తూనే మరో వైపు బంతిని మెరుపువేగంతో వికెట్లకు కొట్టాడు. దీంతో నీషమ్ రనౌట్ అయి పెవిలియన్ చేరాడు. ఈ వికెట్‌తో ఇండియా విజయం ఖాయమైంది.



ప్రభాత వెలుగు తెలుగు దినపత్రిక క్రికెట్ టోర్నమెంట్
www.v6velugu.com v6velugu



విజయం సాధించిన మహబూబాబాద్ జట్టు

మహబూబాబాద్, డోర్నకల్ విజయాలు

మహబూబాబాద్/ కామారెడ్డి, వెలుగు: వెలుగు దినపత్రిక, వీ-6 ఆధ్వర్యంలో జరుగుతున్న టీ20 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం జరిగిన పోటీల్లో మహబూబాబాద్, డోర్నకల్ జట్లు విజయం సాధించాయి. మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో పాలకుర్తితో జరిగిన మ్యాచ్‌లో మహబూబాబాద్ 34 రన్స్ తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన మహబూబాబాద్ 19 ఓవర్లలో 133 రన్స్‌కు ఆలౌటైంది. ఛేదనలో 19.2 ఓవర్లు బ్యాటింగ్ చేసిన పాలకుర్తి 99కి ఆలౌటైంది. మహబూబాబాద్ ప్లేయర్ ప్రణయ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఆ తర్వాత డోర్నకల్, పాలకుర్తి జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో డోర్నకల్ ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. 15 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పాలకుర్తి జట్టు 15 ఓవర్లలో 86 పరుగులు చేసింది. అనంతరం డోర్నకల్ జట్టు 14 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

కామారెడ్డిలో ముగిసిన పోటీలు

కామారెడ్డి జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం కామారెడ్డి, ఎల్లారెడ్డి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కామారెడ్డి గెలిచింది. టాస్ గెలిచి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన కామారెడ్డి 20 ఓవర్లలో 160 రన్స్ చేసింది. ఛేజింగ్‌లో ఎల్లారెడ్డి జట్టు 19 ఓవర్లలో 113కి ఆలౌటైంది. హాఫ్ సెంచరీ చేయడంతోపాటు రెండు వికెట్లు తీసిన కామారెడ్డి ప్లేయర్ అరవింద్‌రెడ్డి(54) మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు మౌజమ్ అలీఖాన్, రామకృష్ణ, విపుల్, భిక్షపతి పాల్గొనగా అంపైర్లుగా ఎండీ. రఫీ, మణికుమార్, స్కోరర్‌గా అలీమ్ వ్యవహరించారు.



టీమిండియా వరల్డ్ కప్ రిహార్సల్ అనుకున్నట్టే అద్భుతంగా ముగిసింది. ఇండియన్ క్రికెట్‌లో మునుపెన్నడూ లేనివిధంగా మనోళ్లు విదేశీ గడ్డపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. ఆస్ట్రేలియా మెడలు వంచి సరికొత్త అధ్యాయాన్ని రాసిన కోహ్లీ సేన.. అదే దూకుడుతో న్యూజిలాండ్ గడ్డపై మరో చరిత్ర సృష్టించింది. 4–1తో సిరీస్ గెలిచి కివీస్‌పై అతి పెద్ద విజయం సొంతం చేసుకుంది. 1967 నుంచి న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న ఇండియాకు ఆ జట్టుపై ఇదే బిగ్గెస్ట్ విక్టరీ.

- 4–1 తేడాతో సిరీస్ విజయం
- కివీస్ గడ్డపై కోహ్లీసేన నయా చరిత్ర
- న్యూజిలాండ్‌పై బిగ్గెస్ట్ సిరీస్ విక్టరీ

లాస్ట్ పంచ్ మనదే

రాయుడు, పాండ్యా, చహల్ సూపర్ షో
చివరి వన్డేలో 35 రన్స్ తేడాతో టీమిండియా విజయం

వెల్లింగ్టన్ : పదేళ్ల విరామం తర్వాత టీమిండియా న్యూజిలాండ్‌లో సిరీస్ గెలిచి కాలరెగరేసింది. కోహ్లీ లేకుండా ఆడి నాలుగో వన్డేలో చిత్తయిన టీమిండియా ఆఖరి వన్డేలో ఆల్‌రౌండ్‌షోతో అదరగొట్టింది. కివీస్‌ను 35 రన్స్ తేడాతో ఓడించింది. అంబటి రాయుడు (90: 113 బాల్స్ 8x4, 4x6) సూపర్ హాఫ్ సెంచరీకి తోడు విజయ్ శంకర్ (45: 64 బాల్స్, 4X4), హార్దిక్ పాండ్యా (45: 22 బాల్స్ 2x4, 5x6) అదరగొట్టడంతో మొదట టీమిండియా 49.5 ఓవర్లలో 252కి ఆలౌటైంది. ఆ తర్వాత చహల్ (3/41), షమి (2/35), పాండ్యా (2/50) దెబ్బకు న్యూజిలాండ్ 44.1 ఓవర్లలో 217 రన్స్‌కే కుప్పకూలింది. దీంతో ఐదు మ్యాచుల వన్డే సిరీస్‌ను 4-1తో గెలిచిన ఇండియా, కివీస్ గడ్డపై రెండో సిరీస్ విక్టరీని ఖాతాలో వేసుకుంది. 2009లో 3-1తో కివీస్‌పై విజయం సాధించిన టీమిండియా తాజాగా 4-1తో సిరీస్ గెలిచి అతి పెద్ద విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఐదో వన్డేలో ఆడిన ఇన్నింగ్స్‌తో వరల్డ్ కప్ బెర్త్ దాదాపు కన్ఫమ్ చేసుకున్న తెలుగు క్రికెటర్ రాయుడుకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కగా, సిరీస్‌లో 9 వికెట్లు పడగొట్టిన మహ్మద్ షమి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెలుచుకున్నాడు.

ఆదుకున్న రాయుడు, పాండ్యా

నాలుగో వన్డే తరహాలోనే వెల్లింగ్టన్‌లోనూ ఇండియా తడబడుతూ ఆట మొదలుపెట్టింది. బౌలింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై టాపార్డర్ బ్యాట్స్‌మన్ రోహిత్ (2), ధవన్ (6), శుభ్‌మన్(7), ధోనీ (1) పెవిలియన్‌కు క్యూ కట్టారు. 18 రన్స్‌కే నాలుగు వికెట్లు కోల్పోవడంతో ఘోర పరాజయం తప్పదనిపించింది. అయితే మిడిలార్డర్‌లో రాయుడు వీరోచితంగా పోరాడాడు. శంకర్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను కుదుటపరిచాడు. ఇద్దరూ కలిసి ఐదో వికెటకు 98 రన్స్ జోడించడంతో ఇండియా తేరుకుంది.30 ఓవర్లకు జట్టు స్కోరు వంద దాటింది. హాఫ్ సెంచరీకి చేరువగా వచ్చిన శంకర్ ఇన్నింగ్స్ 32వ ఓవర్లో రనౌటయ్యాడు. వన్డేల్లో పదో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న రాయుడు ఆ తర్వాత జాదవ్(34)తో కలిసి నిలకడగా ఆడాడు. సెంచరీ చేసేలా కనిపించిన రాయుడు 90 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటయ్యాడు.ఆ తర్వాత జాదవ్ - పాండ్యా స్కోరును 200 దాటించారు. జాదవ్ అవుటయ్యాక పాండ్యా లోయరార్డర్ అండతో చెలరేగిపోయాడు. 22 బాల్స్‌లో 2 ఫోర్లు, 5 సిక్సలతో 45 రన్స్ చేసి జట్టుకు మంచి స్కోరు అందించాడు. చివర్లో భువనేశ్వర్ (6), షమి (1), చహల్ (0) త్వరత్వరగా ఔటవడంతో మరో బంతి మిగిలుండగానే ఇండియా ఇన్నింగ్స్ ముగిసింది.

బౌలింగ్ సూపర్

ఆ తర్వాత లక్ష్యాన్ని కాపాడుకోవడంలోనూ ఇండియా బౌలర్లు మ్యాజిక్ చేశారు. పిచ్ నుంచి సహకారం లభిస్తుండడంతో వరుస విరామాల్లో వికెట్లు తీస్తూ కివీస్ బ్యాట్స్‌మెన్ క్రీజులో నిలకదొక్కుకోకుండా చేశారు. నికోల్స్ (8)ను అవుట్ చేసి బ్లాక్ క్యాప్స్‌ను తొలి దెబ్బ తీసిన షమి ఆ తర్వాత మన్రో(24)ను బౌల్డ్ చేశాడు. మరో వైపు టేలర్ (1)ని పాండ్యా అవుట్ చేయడంతో కివీస్ 38 రన్స్‌కే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో కెప్టెన్ కేన్ విలియమ్సన్ (39) కాసేపు పోరాడాడు. లాథమ్‌తో కలిసి స్కోరును వంద దాటించాడు.



స్కోరు వివరాలు

ఇండియా: రోహిత్ (బి) హెన్రీ 2, ధవన్ (సి) హెన్రీ (బి) బౌల్ట్ 6, గిల్ (సి) శాంట్నర్ (బి) హెన్రీ 7, రాయుడు (సి) మన్రో (బి) హెన్రీ 90, ధోనీ (బి) బౌల్ట్ 1, శంకర్ (రనౌట్) 45, యాదవ్ (బి) హెన్రీ 34, పాండ్యా (సి) బౌల్ట్ (బి) నీషమ్ 45, భువనేశ్వర్ (సి) టేలర్ (బి) బౌల్ట్ 6, షమి (రనౌట్) 1, చహల్ (నాటౌట్) 0, ఎక్స్‌ట్రాలు: 15, **మొత్తం: 49.5 ఓవర్లలో 252 . వికెట్లపతనం:** 1-8, 2-12, 3-17, 4-18, 5-116, 6-190, 7-203, 8-248, 9-252, 10-252, బౌలింగ్: హెన్రీ 10-1-35-4, బౌల్ట్ 9.5-2-39-3, నీషమ్ 5-0-33-1, గ్రాండ్‌హోమ్ 7-0-33-0, మన్రో 10-0-47-0, శాంట్నర్ 3-0-18-0, ఆస్టిల్ 5-0-35-0,

న్యూజిలాండ్ : మన్రో (బి) షమి 24, నికోల్స్ (సి) జాదవ్ (బి) షమి 8, విలియమ్సన్ (సి) ధవన్ (బి) జాదవ్ 39, టేలర్ (ఎల్బీ) (బి) పాండ్యా 1, లాథమ్ (ఎల్బీ) (బి) చహల్ 37, నీషమ్ (రనౌట్) 44, గ్రాండ్‌హోమ్ (ఎల్బీ) (బి) చహల్ 11, శాంట్నర్ (సి) షమి (బి) పాండ్యా 22, ఆస్టిల్ (ఎల్బీ) (బి) చహల్ 10, హెన్రీ (నాటౌట్) 17, బౌల్ట్ (సి) షమి (బి) కుమార్ 1, ఎక్స్‌ట్రాలు: 3, **మొత్తం 44.1 ఓవర్లలో 217. వికెట్ల పతనం:** 1-18, 2-37, 3-38, 4-105, 5-119, 6-135, 7-176, 8-194, 9-204, 10-217. బౌలింగ్: భువనేశ్వర్ 7.1-0-38-1, షమి 8-0-35-2, పాండ్యా 8-1-50-2, శంకర్ 4-0-19-0, చహల్ 10-0-41-3. జాదవ్ 7-0-34-1



ఇది రాయుడు గెలుపు

నాలుగో వన్డే ఓటమి తర్వాత చివరి మ్యాచ్‌లో పరిస్థితులు కఠినంగా ఉన్నా తమ జట్టు చక్కటి ఆటతీరుతో విజయం సొంతం చేసుకుందని స్టాండ్ ఇన్ కెప్టెన్ రోహిత్ పేర్కొన్నాడు. మరోసారి ఓటమి తప్పదనుకున్న స్థితిలో పోరాడిన రాయుడు, విజయ్ శంకర్‌లను ప్రశంసల్లో ముంచెత్తాడు. 'హామిల్టన్‌లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత ఇక్కడ జట్టుగా పోరాడాం. స్టార్టింగ్‌లోనే నాలుగు వికెట్లు పడ్డ తర్వాత రాయుడు, విజయ్ శంకర్ చక్కటి ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరి భాగస్వామ్యం మమ్మల్ని మ్యాచ్‌లోకి తెస్తే... చివర్లో పాండ్యా, జాదవ్ దుమ్మురేపారు. 4–1తో న్యూజిలాండ్‌ను వారిగడ్డపై ఓడించడం ఈజీ కాదు' అని తెలిపాడు. బుమ్రా అందుబాటులో లేకున్నా క్లిష్ట సమయాల్లో ఎలాంటి బౌలింగ్ కూర్పుతో బరిలో దిగాలో ఈ సిరీస్ నేర్పిందని అన్నాడు. 'ఫ్లాట్ వికెట్‌పై ఛేజింగ్ సులువే అనిపించినా.. బుమ్రా గైర్హాజరీలోనూ మా బౌలర్లు సరైన సమయాల్లో వికెట్లు తీస్తూ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచారు' అని చెప్పుకొచ్చాడు.





లక్మే ఫ్యాషన్ వీక్‌లో ఏస్ షట్లర్ పీవీ సింధు ర్యాంప్ వాక్

కాలికట్ శుభారంభం

కొచ్చి: ప్రొ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) ప్రారంభం సీజన్‌లో కాలికట్ హీరోస్ శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో కాలికట్ 4-1 (15-8, 15-8, 13-15, 15-11, 15-11) తో చెన్నై స్పార్టాన్స్‌పై విజయం సాధించింది. ఈ విజయంతో కాలికట్ ఖాతాలో 2 పాయింట్లు చేరాయి. కాలికట్ ప్లేయర్ అజిత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. నేడు జరిగే మ్యాచ్‌లో అహ్మదాబాద్ డిఫెండర్స్‌తో బ్లాక్ హాక్స్ హైదరాబాద్ తలపడనుంది.

పాకిస్తాన్ విక్టరీ

కరాచి: వెస్టిండీస్ మహిళల టీమ్‌తో జరిగిన మూడో టీ20లో పాకిస్తాన్ 12 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడి సిరీస్ కోల్పోయిన పాక్ జట్టు చివరి మ్యాచ్‌లో ఆకట్టుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 20 ఓవర్లలో 150 రన్స్ చేసింది. నిదా డార్ (40 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 53) హాఫ్ సెంచరీ చేసింది. ఛేజింగ్‌లో విండీస్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 138 రన్స్‌కే పరిమితమైంది.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

విండీస్‌కు సిరీస్ విజయం

నార్త్‌సౌండ్ (అంటిగ్వా): ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్‌తో అదరగొట్టిన వెస్టిండీస్ టీమ్ సుదీర్ఘ విరామం అనంతరం ఓ అగ్రశ్రేణి జట్టుపై టెస్టు సిరీస్ విజయం సాధించింది. ఇంగ్లండ్‌తో జరుగుతోన్న 3 టెస్టుల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో గెలిచి పదేళ్ల తర్వాత విజ్డన్ ట్రోఫీ చేజిక్కించుకుంది. మూడు రోజుల్లోనే ముగిసిన రెండో టెస్టులో విండీస్ 10 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తుచేసింది. ఓవర్‌నైట్ స్కోరు 272/6తో శనివారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విండీస్ 306 పరుగులకు ఆలౌటైంది. డారెన్ బ్రావో (216 బంతుల్లో 50) హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 187 రన్స్‌కే పరిమితమవడంతో విండీస్‌కు 119 పరుగుల కీలక ఆధిక్యం లభించింది. అనంతరం విండీస్ పేసర్లు రోచ్ (4/52), హోల్డర్ (4/43) ధాటికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 132 రన్స్‌కే ఆలౌటైంది. బట్లర్ (24) టాప్ స్కోరర్. తల్లి చనిపోయినా మ్యాచ్ కొనసాగించిన అల్జారి జోసెఫ్ 2 వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత 14 పరుగుల టార్గెట్‌తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కరీబియన్ జట్టు 2.1 ఓవర్లలో 17 రన్స్ చేసి గెలిచింది. మ్యాచ్‌లో 8 వికెట్లు తీసిన రోచ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

ఖవాజా సెంచరీ.. లంక టార్గెట్ 516

కాన్‌బెర్రా : ఉస్మాన్ ఖవాజా(101 నాటౌట్) సెకండ్ ఇన్నింగ్స్‌లో సెంచరీతో చెలరేగడంతో రెండో టెస్టులో ఆస్ట్రేలియా.. లంక ముందు 516 రన్స్ భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఛేజింగ్ ప్రారంభించిన లంక మూడో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోకుండా 17 రన్స్ చేసి లక్ష్యానికి 499 పరుగుల దూరంలో నిలిచింది. కురుణరత్నే(8), తిరిమన్నె(8) క్రీజులో ఉన్నారు. ఓవర్‌నైట్ స్కోరు 123/3తో ఆదివారం ఆట ప్రారంభించిన లంక ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 215కు ఆలౌటైంది. 319 లీడ్‌తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ 196/3 వద్ద డిక్లేర్ చేసింది. ఖవాజా సెంచరీ చేయగా, ట్రావిస్ హెడ్(59 నాటౌట్) రాణించాడు.



సఫారీ సూపర్ విన్

జొహన్నెస్‌బర్గ్: తొలి టీ20లో తన ఫీల్డింగ్ మెరుపులతో టీమ్‌ను గెలిపించిన డేవిడ్ మిల్లర్ రెండో మ్యాచ్‌లో బ్యాటింగ్‌తో అదరగొట్టి సౌతాఫ్రికాకు సిరీస్ సాధించి పెట్టాడు. ఆదివారం జరిగిన రెండో టీ20లో మిల్లర్ 29 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 65 రన్స్ చేయడంతో మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 3 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. హెండ్రిక్స్ (28), మలన్ (33), డసన్ (45) కూడా రాణించడంతో భారీ స్కోరు చేయగలిగింది. అనంతరం పాకిస్తాన్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 181 పరుగులే చేయగలిగింది. బాబర్ ఆజమ్ (58 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్సర్‌తో 90), తలాత్ (55) మెరుపులు మెరిపించినా విజయానికి అవి సరిపోలేదు.

నిలబడి నీళ్లు తాగొద్దట

పరుగెత్తి పాలుతాగడం కన్నా నిలబడి నీళ్లు తాగడం చాలా బెటర్ అంటూ ఉంటారు కొందరు. కానీ, నిలబడి నీళ్లు తాగడం ఒంటికి అంత మంచిది కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఆయుర్వేదం ప్రకారం.. నిలబడి నీళ్లు తాగితే అన్ని అవయవాలకు నీరు సరిగ్గా వెళ్లదట. అందుకే మన పెద్దలు తిన్నా, తాగినా కూర్చొనే చేయాలని చెబుతుంటారు. అయినా కూడా చాలా మంది నిలబడే నీళ్లు తాగుతుంటారు. కానీ, అలా తాగొద్దంటున్నారు. నిలబడి తాగితే ఒంటికి కావాల్సిన పోషకాలు



అందవంటున్నారు. ఒక్కోసారి తీవ్రమైన అనారోగ్యమూ వస్తుందని చెబుతున్నారు. ప్రముఖ ఫిట్‌నెస్ ట్రైనర్ నికితా పామర్ దాని వల్ల ఎదురయ్యే సమస్యలు వివరించారు. నర్వస్ సిస్టమ్‌పై (నరాల వ్యవస్థ) ప్రభావం పడుతుందన్నారు. దాని వల్ల పోషకాలు అందక ఒత్తిడి పెరుగుతుందని చెప్పారు. నిలబడి తాగడం వల్ల నీళ్లు వేగంగా లోపలకు వెళతాయని, దాని వల్ల ఊపిరితిత్తులపై ఒత్తిడి పడుతుందని చెబుతున్నారు. ఆక్సిజన్ స్థాయిలూ అటూఇటూ అవుతాయన్నారు. కీళ్ల నొప్పులు రావడంతో పాటు ఎముకలు బలహీనమయ్యే అవకాశం ఉంటుందన్నారు. మలినాలు బయటకు పోకపోవడం వల్ల కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే ముప్పు ఉంటుందన్నారు. కూర్చుని తాగితే నీరు నెమ్మదిగా జీర్ణ వ్యవస్థ గుండా ప్రయాణించడంతో పాటు ఇతర అవయవాలకూ అందుతుందని చెబుతున్నారు. మెదడుకు పోషకాలు అంది అన్ని క్రియలు సక్రమంగా జరిగేలా చూస్తుందంటున్నారు.



లొకేషన్ చెప్పకున్నా 108 వస్తుంది

- ప్రమాదస్థలికి చేరేలా గూగుల్, సెల్‌ఫోన్ ట్రయాంగులేషన్ సాయం
- యూపీలో పైలెట్ ప్రాజెక్ట్

హరీశ్.. ఊరుకాని ఊరుకు బయల్దేరాడు. కానీ, దారిలో అతడి కారుకు యాక్సిడెంట్ అయింది. వెంటనే అక్కడ గుమిగూడిన జనం సహకారంతో 108 అంబులెన్సుకు కాల్ చేశాడు. కానీ, అడ్రస్ మాత్రం చెప్పలేకపోయాడు. అడ్రస్ తెలుసుకునే సరికి అంబులెన్స్ రాక ఆలస్యమైంది. అత్యవసర సమయాల్లో అలాంటి పరిస్థితులు రాకుండా ఉంటే బాగుంటుంది కదా. అందుకే దానికి కేంద్ర ప్రభుత్వం ఓ మంచి పరిష్కారం చూపిస్తోంది. అదే సెల్‌టవర్ ట్రయాంగులేషన్, గూగుల్ ఎమర్జెన్సీ లొకేషన్ సర్వీసెస్. ఘటనా స్థలంలో బాధితుడు లేదా వ్యక్తులు ఫోన్ కలవకపోయినా, ఫోన్‌లో ఇంటర్నెట్ లేకపోయినా ఆ నంబర్ జీపీఎస్ ఆధారంగా ఆ ప్రాంతానికి అంబులెన్సు చేరిపోతుంది. దానిపై టెలికం సంస్థలు, గూగుల్‌తో కేంద్రం ఒప్పందం చేసుకుంది.

సెల్‌ఫోన్ ట్రయాంగులేషన్ అంటే...

అంబులెన్సుల్లో ఆ రెండు సర్వీసెస్‌లను పెడతారు. అడ్రస్ తెలుసుకోలేకపోయినప్పుడు అంబులెన్స్ సర్వీస్ అధికారులు ఈ సెల్‌ఫోన్ ట్రయాంగులేషన్ ద్వారా బాధితుడి ఫోన్ ఏ ప్రాంతంలో ఉందో ట్రాక్ చేయిస్తారు. గూగుల్ ఎమర్జెన్సీ లొకేషన్ సర్వీస్ ద్వారా ఆ నంబర్ జీపీఎస్‌ను తెలుసుకుని అంబులెన్సులు ప్రమాద స్థలానికి చేరుకుంటాయి. ఈ టెక్నాలజీతో ఫోన్ లో ఇంటర్నెట్, యాప్ లేకున్నా 108 సేవలు అందుతాయి. నిజానికి ఈ ఆలోచన 2015వ బ్యాచ్ ఐఏఎస్ అధికారి అభిజిత్ కప్లిష్‌ది.. ప్రస్తుతం ఆయన పంజాబ్ లోని మన్సా జిల్లాలో పని చేస్తున్నారు. 2016లో ఆయన భటిండా నుంచి చండీగఢ్ వెళ్తుండగా రోడ్డుపై ప్రమాదాన్ని చూశారు. అంబులెన్స్‌కు ఫోన్ చేసినా లొకేషన్ వివరాలు సరిగ్గా ఇవ్వలేకపోయారు. అంబులెన్స్ రాకపోవడంతో ఆయన ఎస్పీకి ఫోన్ చేశారు. తర్వాత ఘటనా స్థలానికి అంబులెన్సు వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో టెక్నాలజీని వాడుకుంటే బాగుంటుంది కదా అన్న ఆలోచన ఆయనకు వచ్చింది. ఆ ఘటన జరిగిన ఏడాది తర్వాత అభిజిత్ కేంద్ర ఆరోగ్య శాఖలో అసిస్టెంట్ సెక్రటరీగా చేరారు. తనకు ఎదురైన అనుభవాన్ని, దాన్ని పరిష్కారాన్ని సీనియర్ అధికారులకు చెప్పారు. 2017 సెప్టెంబర్ లో ప్రధాని నరేంద్ర మోడీకి ఈ విషయాన్ని నివేదించారు. అభిజిత్ ఆలోచనను ప్రశంసించిన ప్రధాని మోడీ వెంటనే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. జనవరి నుంచి పైలెట్ ప్రాజెక్టుగా యూపీలో అమలు చేస్తున్నారు. అది సక్సెస్ అయితే దేశమంతా విస్తరిస్తారు.

ఎక్కువైనా తక్కువైనా బరువు సమస్యే

వాషింగ్టన్: చిన్నతనంలో వయసుకు తగ్గ బరువుండకపోతే (బీఎంఐ) టీనేజర్లయ్యాక ప్రభావం ఉంటుందట. అనోరెక్సియా నెర్వోసా (తక్కువగా తినడం) రోగం వచ్చి తినేందుకు ఎక్కువ ఆసక్తి చూపించరట. అలాగే చిన్నతనంలో ఎక్కువ బరువున్నా సమస్యేనంట. పెద్దయ్యాక ఎక్కువ తినేస్తారట. ఇందుకు సంబంధించి ఓ వ్యాసం అమెరికన్ అకాడమీ ఆఫ్ చైల్డ్ అండ్ అడోలెసెంట్ సైకియాట్రీ జర్నల్‌లో ప్రచురితమైంది. చిన్నతనంలో తక్కువ, ఎక్కువ బరువున్న పిల్లలు పెద్దయ్యాక ఎలాంటి తిండి సమస్యలతో బాధపడతారో అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా (యూఎన్‌సీ)కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ జినెప్ ఇల్మజ్ పరిశోధన చేశారు. వేలాది మంది చిన్నారుల పెరుగుదలకు సంబంధించిన అనేక రికార్డులను పరిశీలించి ఆయన నిర్ణయానికి వచ్చారు. కాబట్టి పిల్లలు ఉండాల్సిన బరువుకన్నా ఎక్కువ, తక్కువ ఉంటే వాళ్ల తల్లిదండ్రులను వెంటనే హెచ్చరించాలని పిల్లల డాక్టర్లకు జినెప్ సూచిస్తున్నారు. ఈటింగ్ డిజార్డర్ మానసిక సమస్య అయినప్పటికీ మనిషి జీవక్రియపై ప్రభావం చూపుతుందని చెబుతున్నారు.

ప్యాంట్ చినిగింది.. ఆఫీసుకు రాను

బ్రిటన్‌లో 'నేషనల్ సిక్కీ డే'.. సిల్లీ కారణాలతో సెలవు

"సార్.. ఇగో రూంలో నాతో పాటుండేటోడు బయటంగ తాళం పెట్టిపోయిండు. నేను బయటకు రాలేను. కాబట్టి ఆఫీసుకు కూడా నేనివ్వాళ బందే" బాస్‌కు కాల్ చేశాడో ఉద్యోగి...

"సార్.. నాకు బాగా జ్వరం వచ్చింది. నేను ఆఫీసుకు రాలేను. ప్లీజ్ సెలవివ్వండి" అంటూ వణుకుతున్న గొంతుతో (నటన) ఫోన్ చేశాడు మరో ఉద్యోగి.


"ఆఫీసుకొస్తుంటే నా ప్యాంట్ చినిగిపోయింది. అందుకే మళ్లీ ఇంటికొచ్చేసిన. నేను ఆఫీసుకు రాను" ఇంకో ఉద్యోగి కారణం..



...కారణమేదైనా దాని వెనక ఆంతర్యం 'సెలవు' పెట్టడమే. బ్రిటన్‌లో ఏటా ఆనవాయితీగా వస్తోందది. కారణం.. ఎయిడ్స్ డే, మహిళా దినోత్సవం, యోగా డే అంటూ ప్రతిదానికీ ఓ రోజున్నట్టే అక్కడ 'జబ్బు పడిన దినం' చేసుకుంటారు. అంటే 'నేషనల్ సిక్కీ డే' అన్నమాట. ఫిబ్రవరి మొదటి సోమవారాన్ని అలా జరుపుకుంటారు. అలా ఏటా కొన్ని లక్షల మంది ఉద్యోగులు సిల్లీ కారణాలు చెబుతూ ఆఫీసుకు రాకుండా తప్పించుకుంటున్నారట. గత ఏడాది అలా 3.5 లక్షల మంది సిల్లీ కారణాలతో సిక్కీ డేన సెలవు పెట్టారట. ఈ ఏడాది అంత కన్నా ఎక్కువ సంఖ్యలో సెలవు పెట్టేందుకు సిద్ధమయ్యారట. అయితే, దానికి చెబుతున్న కారణాలు మరీ సిల్లీగా ఉంటున్నాయి. ఆ సిల్లీ కారణాల్లో మరికొన్ని..

- 'మా ఆవిడ నా కన్నా ఎక్కువ సంపాదిస్తోంది. కాబట్టి ఇవాళ నేను నా పిల్లల్ని చూసుకోవాలి'
- 'సార్, మా దూరపు బంధువు చచ్చిపోయిండు. నేను అర్జెంట్‌గా వెళ్లాలి'
- 'నాకున్న ఒక్క జత బట్టలూ ఉతకడానికేసిన.. నాకు సెలవు కావాలి'
- 'ఇవ్వాళ నా కుక్క పుట్టినరోజు.. గ్రాండ్‌గా పార్టీ ఇస్తున్నా. కాబట్టి సెలవు ఇవ్వగలరు'
- 'కుక్క నా బూట్లు తినేసింది సార్'
- 'రాత్రంత ఫ్రెండ్స్‌తో కలిసి ఫుల్లుగా ఎంజాయ్ చేసిన. బాగా హ్యాంగోవర్. సెలవు ఇవ్వండి'
- 'నేను బాత్రూంలో ఇరుక్కుపోయిన'
- 'రాత్రి వేడివేడి సూప్ తాగిన. గొంతు బాగా చెడిపోయింది. కనీసం ఊపిరి కూడా పీల్చలేకపోతున్నా'

గుజరాత్‌ను వణికిస్తున్న సూపర్‌బగ్



- రాష్ట్రంపై ఎంఆర్‌ఎస్‌ఏ దండయాత్ర
- డ్రగ్ రెసిస్టెంట్‌గా మారి వణికిస్తున్న సూక్ష్మజీవి
- కోళ్లు, పాలు, చేపలు, మనుషుల్లో ఆనవాళ్లు

గుజరాత్‌ను ఓ బ్యాక్టీరియా వణికిస్తోంది. సూపర్‌బగ్‌గా మారి కోళ్లు, పాలు, చేపలు అంటూ అంతటా విస్తరిస్తోంది. అనేక రోగాలను నయం చేసే యాంటీబయోటిక్ డ్రగ్‌లను పని చేయకుండా చేస్తోంది. ప్రాణాంతకమవుతోంది. దానిపేరు మెథిసిలిన్ రెసిస్టెంట్ స్టఫైలోకోకస్ ఆరియస్ (ఎంఆర్‌ఎస్‌ఏ). ప్రభుత్వ పశువైద్య, వ్యవసాయ, చేపలకు సంబంధించిన ఇన్‌స్టిట్యూట్‌లు దాని ప్రభావం గురించి ఇప్పటికే వివరించాయి.

పదేళ్లుగా..

ఎంఆర్‌ఎస్‌ఏ (మెర్సా) గురించి చెప్పాలంటే 2008కి వెళ్లాలి. ఇండియన్ నెట్‌వర్క్ ఫర్ సర్వైలెన్స్ ఆఫ్ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఐఎన్‌ఎస్‌ఏఆర్)లో భాగంగా ఆ ఏడాది గుజరాత్ కేన్సర్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఓ కార్యక్రమం మొదలెట్టింది. అందులో భాగంగా ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్‌లో 722 మంది పేషెంట్ల రక్తం, మృదు కణాలు, చర్మం శాంపిళ్లను తీసుకుంది. చెక్ చేసి చూస్తే 57 శాతం శాంపిళ్లలో ఎంఆర్‌ఎస్‌ఏ ఆనవాళ్లున్నాయి. గత ఏడాది ఫిబ్రవరిలో ఎస్‌ఎస్‌జీ హాస్పిటల్‌లో తక్కువ బరువుతో పుట్టిన 40 మంది చిన్న పిల్లలను చెక్ చేస్తే (వాళ్లంతా సెప్సిస్‌తో బాధ పడుతున్నారు) వాళ్లలో 17 మందిలో ఎంఆర్‌ఎస్‌ఏ ఉంది. 2018 ఏప్రిల్‌లో అహ్మదాబాద్ ఎన్‌హెచ్‌ఎల్ మెడికల్ కాలేజీ మైక్రోబయాలజీ డిపార్ట్‌మెంట్ 1,002 మంది పేషెంట్ల చీము, దెబ్బల శాంపిళ్లను పరిశీలించగా 96 మందిలో ఎంఆర్‌ఎస్‌ఏ ఉందని తేలింది. భుజ్‌లో 2016 డిసెంబర్ నుంచి 2017 జూన్ మధ్య మూత్ర మార్గంలో అంటురోగంతో బాధ పడుతున్న 186 మంది చిన్నారుల శాంపిళ్లు పరిశీలించినప్పుడు కూడా 10 శాతం మందిలో ఈ బ్యాక్టీరియా కనిపించింది.

జంతువుల్లోనూ..

జంతువుల్లో బొవైన్ మెస్టిటిస్ (పొదుగు వ్యాధులు)కు స్టఫైలోకోకస్ ఆరియస్ కారణం. 2017 నవంబర్‌లో అలాంటి వ్యాధి ఉన్న 11 జంతువుల పాలను పరిశీలిస్తే నాలుగింటిలో ఎంఆర్‌ఎస్‌ఏ ఉన్నట్టు తేలింది. ఆ బ్యాక్టీరియా కణంలో మెక్‌ఏ జన్యువుంది. అది ఉంటే మెథిసిలిన్, పెన్సిలిన్ లాంటి యాంటీబయాటిక్స్ పనిచేయవు. 2017 ఆగస్టులో గుజరాత్‌లోని వెరవల్‌లో ఎండబెట్టిన రిబ్బన్‌ఫిష్‌లోనూ ఎంఆర్‌ఎస్‌ఏ ఆనవాళ్లు కనిపించాయి. 2018 ఫిబ్రవరిలో కోళ్ల మాంసంలోనూ ఇది దాగుందని తెలిసింది. 23 శాంపిళ్లలో నాలుగింటిలో ఎంఆర్‌ఎస్‌ఏ ఉందని వెల్లడైంది.

సమాజమూ స్పందించాలి

ఎంఆర్‌ఎస్‌ఏ విషయంలో డాక్టర్లు కచ్చితంగా వ్యవహరిస్తున్నారు. ఇంతకుముందే ఎంఆర్‌ఎస్‌ఏతో బాధపడుతున్న వారు, కొత్తగా ఎంఆర్‌ఎస్‌ఏ వ్యాధులలో బాధపడుతున్న వారికి వాంకోమిసిన్ ఇస్తున్నారు. మరోవైపు యాంటీబయోటిక్ రెసిస్టెన్స్‌పై పోరాడాలంటే ప్రభుత్వ నిర్ణయాలే సరిపోవని, సమాజం కూడా స్పందించాలని నిపుణులు అంటున్నారు.

ఏంటీ ఎంఆర్‌ఎస్‌ఏ?

ఎంఆర్‌ఎస్‌ఏ స్టాఫికొకస్ బ్యాక్టీరియా జాతికి చెందింది. సాధారణంగా స్టాఫికొకస్ బ్యాక్టీరియాలు మనుషుల చర్మంపై, ముక్కులో ఉంటాయి. ఎలాంటి హాని చేయవు. కానీ ఎంఆర్‌ఎస్‌ఏలా యాంటీ బయోటిక్ రెసిస్టెంట్‌గా మారితే మాత్రం ప్రాణాంతకమే. చర్మం, మృదు కణాలు, రక్త కణాలపై ఎంఆర్‌ఎస్‌ఏ దాడి చేస్తుంది. నిమోనియాకు కూడా దారి తీస్తుంది. ఆపరేషన్ జరిగిన ప్రాంతం, మూత్ర వ్యవస్థ, ఊపిరితిత్తులపైనా ప్రభావం ఉంటుంది. ఇంకో విషయమేంటంటే ఎంఆర్‌ఎస్‌ఏ తాకిడి వల్ల సులభంగా వ్యాపిస్తుంది.

13 ఏళ్ల పిల్లోడి సివిల్స్ పాఠాలు

యూపీఎస్సీ అభ్యర్థులకు మంచిర్యాల చిన్నోడి పాఠాలు



- 'లెర్న్ విత్ అమర్' పేరుతో యూట్యూబ్ చానెల్
- ఇప్పటికే 1,87,000 మంది సబ్‌స్క్రైబర్లు

పదమూడేళ్ల పిల్లాడు.. ఓవైపు స్కూలుకెళ్తూనే మరోవైపు యూట్యూబ్‌లో పాఠాలు చెబుతున్నాడు.. అది కూడా సివిల్స్ పరీక్షకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు.. ఎంత బాగా చెబుతున్నాడంటే ఇప్పటికే ఇతని చానెల్‌కు లక్షన్నర మందికి పైగా ఫాలోవర్లు.. అందుకే దేశంలోనే చిన్న వయసున్న పాపులర్ యూట్యూబరయ్యాడు.

జాగ్రఫీతో మొదలు

మంచిర్యాల జిల్లాలో గోవర్ధన్ ఆచారి ప్రభుత్వ టీచర్. ఆయనకు ఇద్దరు కొడుకులు. అమర్, విఘ్నేశ్. తండ్రి జిల్లాలో టీచర్లకు కూడా ట్రైనింగ్ ఇస్తుంటాడు. అమర్ ఐదో తరగతి చదువుతున్నపుడు అట్లాస్‌తో ఆడుకోవడం చూశాడు. దానిపై పిల్లాడి ఆసక్తిని చూసి భూగోళశాస్త్రం చెప్పడం మొదలెట్టాడు. ఓసారి ఆ పాఠాలను అలానే అమర్ చెబుతుండటాన్ని అమ్మ వీడియో రికార్డు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసింది. దానికి మంచి స్పందన వచ్చింది. అప్పటి నుంచి వీడియోలు చేయడం మొదలెట్టాడు. 2016లో 10 ఏళ్ల వయసులో 'లెర్న్ విత్ అమర్' పేరుతో యూట్యూబ్ చానల్ ప్రారంభించాడు. జాగ్రఫీ నుంచే పాఠాలు చెప్పడం మొదలెట్టాడు. దేశాలు, నదులు, జలసంధుల పేర్లు ఎలా గుర్తు పెట్టుకోవాలో ట్రిక్స్ చెప్పేవాడు. ఇప్పుడు పౌరశాస్త్రం, అర్థశాస్త్రం పాఠాలూ చెబుతున్నాడు. ప్రస్తుతం అతని చానల్‌కు 1,87,000 సబ్‌స్క్రైబర్లున్నారు.

ఒక్కోసారి నెగెటివ్ కామెంట్లూ..

డిమాండ్‌కు తగ్గట్టు కూడా అమర్ వీడియోలు అప్‌లోడ్ చేస్తుంటాడు. 'చాలా మంది కాంపిటిటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అవుతుంటారు. వాళ్లు కోరిన సబ్జెక్టులు, విషయాలను నేర్చుకుని వీడియోలు చేస్తుంటాను. అలా ఓ టాపిక్ గురించి పూర్తిగా తెలుసుకొని, ప్రాక్టీస్ చేసి వీడియో చేసేందుకు నాకు రెండు వారాలు పడుతుంది. వారాంతాల్లోనే వీడియోలు చేస్తుంటాను. ఎందుకంటే నేనూ స్కూల్ వెళ్తున్నాగా. ఒక్కోసారి మాకు నెగెటివ్ కామెంట్లు కూడా వస్తుంటాయి. అవేం నన్నంత బాధపెట్టవు లెండి' అంటున్నాడు అమర్. తన తమ్ముడు విఘ్నేశ్ కూడా అన్న బాటలోనే నడుస్తున్నాడు. తనకిప్పుడు పదేళ్లు. ఇప్పటికే 10 వీడియోలు అప్‌లోడ్ చేశాడు. అమర్‌కు విశ్వశాస్త్రమంటే (కాస్మాలజీ) చాలా ఇష్టం. ఖాళీ దొరికినపుడు ఆ వీడియోలు చూస్తుంటాడు. తనకిష్టమైన సబ్జెక్టులు గణితం, భౌతికశాస్త్రం. పుస్తకాలు కూడా చదువుతుంటారీ అన్నదమ్ములు. 'ద బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైం', 'ద ఆల్కెమిస్ట్' బాగా ఇష్టం.

సివిల్స్ రాస్తా..

తానూ సివిల్స్ రాసి ఐఏఎస్ కావాలనుకుంటున్నానని అమర్ అంటున్నాడు. ప్రభుత్వంలో చేరి అవినీతి లేకుండా చేయడమే తన ధ్యేయమని చెబుతున్నాడు. 'ఐఏఎస్ అధికారై దేశానికి సేవ చేయాలనుకుంటున్నా. దేశంలో ఎన్నో నిబంధనలున్నాయి. కానీ వాటిని సరిగా పాటించడం లేదు. అమలు కూడా చేయడం లేదు. నేను ఐఏఎస్ అయితే రూల్స్‌ను తప్పకుండా అమలు చేస్తా' అంటున్నాడు. తండ్రి గోవర్ధన్.. ఇద్దరు పిల్లలు తనకు దేవుడిచ్చిన వరమంటూ సంబురపడుతున్నాడు. 'నా కొడుకులకు చాలా తెలివైనవాళ్లు. ట్రైనింగ్‌లో టీచర్లకు చెప్పే మెలకువలే వీళ్లకూ చెప్పా. కానీ వీళ్లు చాలా త్వరగా నేర్చుకున్నారు. 10వ తరగతి తర్వాత చదువుకోడానికి వాళ్లను సిటీకి పంపుతా. అప్పటివరకు ఇక్కడే ఉంటారు. నాకు తెలిసినంత వరకు వాళ్లకు చెబుతా' అంటున్నాడు.

భూమికి భారం.. ఎందుకు కనడం?

'పిల్లల్ని కనడం ఆపండి' అంటున్న యాంటీ నాటలిస్టులు

న్యూఢిల్లీ: రాఫెల్ శామ్యూల్. వయసు 27 ఏళ్లు. ముంబైలో ఉంటాడు. తన తల్లిదండ్రులను కోర్టుకీడుస్తున్నడు. కారణం ఒకటే.. "నా అనుమతి లేకుండా నన్నెందుకు కనడం" అనే ప్రశ్న అంతే. "నా తల్లిదండ్రులంటే నాకు ప్రేమే. మా మధ్య మంచి అనుబంధం ఉంది. కానీ, వాళ్ల ఎంజాయ్‌మెంట్ కోసం నన్ను కన్నరు. కానీ, స్కూలుకెళ్లడం, ఓ మంచి కెరీర్‌ను ఎంచుకోవడం వంటి కష్టమైన జీవితాన్ని నేనెందుకు అనుభవించాలి? అందుకే కోర్టుకెళుతున్నా" అని అంటున్నాడు. అందుకే తాను పిల్లల వ్యతిరేకి (యాంటీ నాటలిస్ట్) అయ్యానంటున్నాడు. అతడొక్కడే కాదు.. అలాంటి వాళ్లంతా ఒక దగ్గరచేరి వాలంటరీ హ్యూమన్ ఎక్స్‌టింక్షన్ మూవ్‌మెంట్ (వీహెచ్‌ఈఎం)ను నడిపిస్తున్నారు. 'పిల్లల్ని కనడం ఆపండి' అన్న నిక్‌నేమ్ పెట్టుకున్నారు. పిల్లల్ని కనడం ఆపేస్తే కనీసం భూమికి భారమైనా తగ్గుతుందని వాళ్లు వితండ వాదం చేస్తున్నారు. పిల్లలను కంటూ ఉండడం వల్ల భూమిపై ఉండే వనరులన్నీ అంతరించిపోతున్నాయని, ఆపేస్తే ఆ వనరులు మిగులుతాయని, పర్యావరణానికి మేలు జరుగుతుందని అంటున్నారు. అయితే, కొందరు మాత్రం వాళ్ల నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు. ఎవరి ఇష్టం వాళ్లకుంటుందని, వాళ్ల బోడి సలహాలు ఎవడికి కావాలని ప్రశ్నించేవాళ్లూ లేకపోలేదు. పిల్లలు పుడితే కష్టపడిపోతారు, భూమికి భారమవుతారు అన్న కారణంగా పిల్లల్ని కనకుండా ఉండడం పిచ్చితనమే అవుతుందని సైకాలజిస్టులు అంటున్నారు. ఇక, నెల 10న బెంగళూరులో ఈ పిల్లల వ్యతిరేకులంతా సమావేశం కాబోతున్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియాల్లో పేజీలనూ తెరిచారు.

హంపి స్తంభాలను కూల్చేశారు

వాట్సాప్, సోషల్ మీడియాలో వైరల్ వీడియో.. పోలీసుల ఎఫ్ఐఆర్

హంపి ఆలయం.. ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపునిచ్చింది. అలాంటి గుడిలోని స్తంభాలను కొందరు దుండగులు కూల్చేశారు. ఆ వీడియోను ఆయుష్ సాహూ అనే వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో అది వైరల్ అయింది. దీంతో శనివారం ఉదయం జనం రోడ్లపైకి వచ్చి ఆందోళన చేశారు. ఇలాంటి చారిత్రక కట్టడాలను పురాతత్వ శాఖ అధికారులు జాగ్రత్తగా చూసుకోవాలని డిమాండ్ చేశారు. వాట్సాప్‌లోనూ ఆ వీడియో చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే శిథిలావస్థ దశలో ఉన్న ఆలయాన్ని దుండగులు కూల్చడం ఆందోళన కలిగించే విషయమని హంపి పోలీసులు అన్నారు. లోటస్ మహల్ వెనక ఈ ఘటన జరిగిందన్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. అయితే, ఆ వీడియో ఏడాది కిందట తీసిందంటూ పురాతత్వ శాఖ అధికారులు చెబుతున్నారన్నారు. స్థానికులు మాత్రం మూడు రోజుల కిందటే ఆ ఘటన జరిగిందంటున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వీడియో ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పరిరక్షించాల్సిన చారిత్రక కట్టడాలను రాష్ట్ర పురాతత్వ శాఖ, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హంపి ప్రపంచ వారసత్వ నిర్వహణ కేంద్రాలు పట్టించుకోవట్లేదని విజయనగర సమరక సంస్కృతి సంరక్షణ సేన కన్వీనర్ విశ్వనాథ్ మలగి ఆరోపించారు. రెండు మూడేళ్ల క్రితం కూడా ఇలాగే కొందరు దుండగులు అచ్యుతరాయ బజార్‌లో పిల్లర్లను ధ్వంసం చేశారన్నారు. తాజా ఘటనకు కారణమైన వ్యక్తులను పట్టుకునేందుకు తాము కూడా ప్రయత్నిస్తున్నామన్నారు.







చావులు తెచ్చిన మార్పులు

- 15వ శతాబ్దంలో అమెరికాపై యూరోపియన్ల దండయాత్ర
- ప్రబలిన జబ్బులు, యుద్ధాలతో లక్షలాది మంది హతం
- ఫ్రాన్స్ అంత సైజులో మళ్లీ పెరిగిన అడవులు
- కార్బన్ డై ఆక్సైడ్ తగ్గిపోయి మినీ మంచు యుగం

అది 15వ శతాబ్దం. అమెరికాపై యూరోపియన్లు దండెత్తారు. లక్షలాది మందిని చంపేశారు. భూభాగాన్ని ఆక్రమించారు. యుద్ధ వాతావరణం నుంచి అప్పుడప్పుడే కోలుకుంటున్న ఆ ప్రాంతం పచ్చగా మారింది. జనాలు లేక పడావు పడిన ప్రాంతాల్లో ఎప్పుడో పడిన గింజలు మొలకెత్తి చెట్లుగా ఎదిగాయి. గాల్లో కార్బన్ డై ఆక్సైడ్ తగ్గిపోయింది. వాతావరణం చల్ల బడింది. మినీ మంచు యుగంలా తయారైంది. పర్యావరణం మొత్తం మారిపోయింది. ఇది కథ కాదు. జరిగిన నిజం. కథలా అనిపించే యథార్థం. బ్రిటన్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్ పరిశోధకులు అధ్యయనం చేసి మరీ తేల్చిన నిజం. పర్యావరణ మార్పులకు అమెరికాపై యూరోపియన్ల వలసవాదమే కారణమని చెప్పారు. దాన్నే ద గ్రేట్ డయింగ్‌గా పిలుస్తారు.

స్టడీ ఏం చెబుతోంది..?

యూరోపియన్లు అమెరికాపై దండెత్తిన 1492 తొలినాళ్లలో పరిస్థితులను సైంటిస్టులు అంచనా వేశారు. అక్కడి జనాభా, వాతావరణ పరిస్థితులు, నివాసయోగ్యతపై స్టడీ చేశారు. ఆ టైంలో దాదాపు 6 కోట్ల మంది అమెరికాలో ఉండేవారని గుర్తించారు. అది ప్రపంచ జనాభాలో 10 శాతం. అయితే, యూరోపియన్ల రాకతో యుద్ధంలో కొన్ని లక్షల మంది చనిపోతే, వాళ్లు మోసుకొచ్చిన స్మాల్‌పాక్స్, మీజిల్స్ వంటి రోగాలతో చనిపోయినోళ్లు మరికొన్ని లక్షల్లో ఉన్నారని నిర్ధారించారు. యూరోపియన్ల దాడి తర్వాత వందేళ్లలో జనాల్లో మిగిలింది కేవలం 60 లక్షల మందేనట. దాదాపు 13.9 కోట్ల ఎకరాల్లో (ఇప్పటి ఫ్రాన్స్ దేశమంత) అడవులు పెరిగిపోయాయట. వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్ మోతాదు భారీగా పడి పోయిందట. దాని వల్ల 1500/1600 మధ్య కాలంలో ఉష్ణోగ్రతలూ తగ్గిపోయి మంచు ముద్దలా మారిపోయిందట. సహజంగా వాతావరణం చల్లబడే దానికన్నా రెట్టింపు చల్లదనం వచ్చిందట.

అంటార్కిటికా ఐస్ తెచ్చి



అంటార్కిటికాలోని ఐస్ కోర్ (మంచు గొట్టాలు)ను పరిశీలించి సైంటిస్టులు ఈ నిర్ధారణకు వచ్చారు. ఆ ఐస్‌లో దాగి ఉన్న గాలి బుడగలను పరిశోధించారు. ఆ బుడగల్లో కార్బన్ డై ఆక్సైడ్ తక్కువగా ఉండడాన్ని గమనించారు. భూమిపై ఎక్కడో ఓ చోట జరిగిన మార్పుల వల్లే అలా జరిగిందని అందులోని అణు నిర్మాణాలతో నిర్ధారణకు వచ్చారు. అదే ఇప్పటి పర్యావరణ విధానాలకు ఓ పాఠం అవుతుందని సైంటిస్టులు చెబుతున్నారు. జనాభా తగ్గడం, చెట్లు పెరిగి కార్బన్ డై ఆక్సైడ్ పడిపోవడం వంటివి ఇప్పటి భూతాపానికి చక్కని పరిష్కారాలు చూపుతాయని అంటున్నారు. కార్బన్ డై ఆక్సైడ్ దిగి రావాలంటే చెట్లు నాటడమే మంచి పరిష్కారమంటున్నారు. ఒకవేళ గ్రేట్ డయింగ్ అప్పుడు పెరిగిన అడవుల పరిమాణంతో ఇప్పుడు కేవలం రెండేళ్ల కర్బన ఉద్గారాలను మాత్రమే తగ్గించగలమంటున్నారు.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.